www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 8-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 339 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథిః నవమి ఉ.8.17 తదుపరి దశమి, నక్షత్రం: ఆర్ద్ర రా.11.28 తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.7.54-9.30, అమృతఘడియలు: మ.1.29-3.05, దుర్ముహూర్తం: ఉ.6.32-8.06, రాహుకాలం ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 6.19 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

వరంగల్ ● శనివారం 8 మార్చి 2025

మహిళా ఆంత్రప్రెన్యూర్ల కోసం ఎస్‌బీఐ అస్మిత

ముంబై: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల (ఆంత్రప్రెన్యూర్స్) కోసం తక్కువ వడ్డీతో కూడిన తనఖార హిత రుణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అస్మిత పేరుతో ఈ పథకాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఈ రుణ పథకం మహిళల సారథ్యంలో నడిచే సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు వేగంగా, సులువుగా ఫైనాన్స్ అందిస్తుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. కాగా, ఎస్‌బీఐ మహిళల కోసం నారీ శక్తి పేరుతో రూపే ప్లాటినమ్ డెబిట్ కార్డ్‌ను సైతం విడుదల చేసింది.

బీఓబీ గ్లోబల్ విమెన్ ఎన్ఆర్ఈ ఖాతా

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) "గ్లోబల్ విమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఓ సేవింగ్స్ అకౌంట్" ప్రారంభించింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఒకటి ఈ రకమైన ఎస్‌బీ ఖాతా తెరవడం ఇదే ప్రథమం. కస్టమర్లు అధిక వడ్డీ రేటు పొందేందుకు వీలుగా ఆటో స్వీప్ సదుపాయంతో ఇది అందుబాటులోకి వచ్చింది. దీనికి తోడు ప్రాసెసింగ్ చార్జీలు కూడా ఇతర ఖాతాల కన్నా తక్కువగా ఉంటాయి. గృహ, ఆటో రుణాలు రాయితీ వడ్డీ రేట్లకు అందుబాటులోకి వస్తాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ను 0.05 శాతం మేరకు తగ్గించింది. ఈ మార్పు అనంతరం బ్యాంక్ ఎంసీఎల్ఆర్ 9.20% నుంచి 9.45% మధ్యలో ఉంటుంది. తక్షణం ఈ కొత్త రేట్లు అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం రెండేళ్ల కాలపరిమితికి ఎంసీఎల్ఆర్ 9.45% నుంచి 9.40 శాతానికి తగ్గింది.

హైదరాబాద్‌లో ఓక్‌ట్రీ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ క్రెడిట్ రంగంలోని ఓక్‌ట్రీ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కార్యాలయం ప్రారంభించింది. దేశంలో కంపెనీకి ఇది రెండో కార్యాలయం. మొదటి కార్యాలయం ముంబైలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీకి 24 నగరాల్లో కార్యాలయాలుండగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 9 కార్యాలయాలున్నాయి. గత ఏడాది డిసెంబరు 31 నాటికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ 20,200 కోట్ల డాలర్లు. ఇదిలా ఉండగా అజయ్ మద్దాలి హైదరాబాద్ కార్యాలయానికి మానవ వనరుల డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

పేరుకే మహిళా ఉపాధి



శ్రామిక రంగంలోనూ వివక్ష
అత్తెసరు జీతాలతోనే సరి
వర్క్ఇండియా నివేదిక వెల్లడి

ముంబై: బ్లూకాలర్ ఉద్యోగాల్లో (శారీరక శ్రమ అవసరమయ్యే ఉద్యోగాలు)నూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. పెద్దగా నైపుణ్యాలు అవసరం లేని తక్కువ జీతాలు ఉండే ఉద్యోగులు లేదా తాత్కాలిక ఉద్యోగులతోనే కంపెనీలు సరిపెడుతున్నాయి. కంపెనీలకు బ్లూకాలర్ ఉద్యోగుల నియామక సేవలు అందించే 'వర్క్ఇండియా' అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఈ నివేదిక ప్రకారం 2023లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు స్వల్పంగా 0.4 శాతం పెరిగినా, 2024 వచ్చేసరికి 5.3 శాతం పడిపోయాయి. ముఖ్యంగా క్షేత్ర స్థాయి అమ్మకాలు, మార్కెటింగ్, బ్యాక్ ఆఫీస్ జాబ్స్‌లో మహిళలకు అవకాశాలు ఏటికేటికి తగ్గిపోతున్నాయి. 2023తో పోలిస్తే 2024లో బ్యాక్ ఆఫీస్ ఉద్యోగాలు 30 శాతం, ఆఫీస్ ప్యూను ఉద్యోగాలు 64.1 శాతం తగ్గాయి. ఇదే సమయంలో టెలికాలర్ ఉద్యోగాలు 8 శాతం, మెయిడ్ జాబ్స్ 99.8 శాతం పెరిగినట్టు వర్క్ఇండియా నివేదిక తెలిపింది.

చెల్లింపుల్లోనూ సమస్యలు

ఏదోలా వ్యాపారాలు నిర్వహిస్తున్న ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ కస్టమర్ల నుంచి రావలసిన బకాయిల వసూళ్లలో 80 శాతం మంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక సాలెగూడులా ఉన్న నియంత్రణ నిబంధనలు అమలు చేయలేక 60 శాతం మంది సతమతమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థ ఎంతగా ఎదిగినా ప్రస్తుతం దేశంలో ఉన్న 5.85 కోట్ల వ్యాపారాల్లో మహిళల వాటా 15.4 శాతం మాత్రమే. 'యాస్పైర్ ఫర్ హర్, పేమెంట్ సేవల సంస్థ 'పేయోనిర్' అనే సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది.

పెరుగుతున్న ఆదాయాలు

కొన్ని సమస్యలు ఉన్నా చాలా మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు రుణాలతో తమ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరిస్తున్నారు. రుణాలు తీసుకున్న తర్వాత తమ ఆదాయాలు పది శాతానికిపైగా పెరిగినట్టు చెప్పారు. ఇండిఫీ టెక్నాలజీస్ అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీంతో చిన్నచిన్న నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని మహిళా వ్యాపారవేత్తలూ రుణాలతో తమ వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

స్టార్టప్స్‌కు దండిగా నిధులు

మన దేశంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించే అంకుర (స్టార్టప్) కంపెనీలకు నిధులూ దండిగానే లభిస్తున్నాయి. ఈ సంస్థలకు ఇప్పటి వరకు 2,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.25 లక్షల కోట్లు) నిధులు అందాయి. అమెరికా తర్వాత ప్రపంచంలో మరే దేశంలోనూ మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించిన స్టార్టప్స్‌కు ఈ స్థాయిలో నిధులు అందలేదని ట్రాక్షన్ అనే సంస్థ తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఏడు వేలకుపైగా మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించిన స్టార్టప్స్ ఉన్నాయి. దేశంలోని మొత్తం స్టార్టప్స్‌లో ఇవి 7.5 శాతానికి సమానం.

ఏపీలో ప్రీమియర్ ఎనర్జీస్ ప్లాంట్



- రూ.1,700 కోట్ల పెట్టుబడి
- నాయుడుపేట వద్ద 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్ ఏర్పాటు
- తెలంగాణలోనూ కార్యకలాపాల విస్తరణ
- కంపెనీ ఎండీ చిరంజీవ్ సలూజా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రీమియర్ ఎనర్జీస్.. ఆంధ్రప్రదేశ్‌కు తన కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఏపీలోని నెల్లూరు జిల్లా నాయుడుపేట వద్ద 4 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) సెల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సలూజా వెల్లడించారు. రూ.1,700 కోట్ల పెట్టుబడితో 169 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ 2026 జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 1,200 మందికి ఉపాధి లభిస్తుందని సలూజా చెప్పారు. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించాలన్న వ్యూహంతో పాటు నిర్వహణా వ్యయాలు తగ్గించుకోవటం, నౌకాశ్రయానికి చేరువగా ఉండాలన్న ఉద్దేశంతో ఏపీలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కంపెనీ ఇప్పటికే హైదరాబాద్, రావిర్యాల ఎలక్ట్రానిక్ సిటీలో 2 గిగావాట్ సెల్, 4గిగావాట్ మాడ్యుల్ స్థాపిత సామర్థ్యం గల ప్లాంట్లను నిర్వహిస్తోంది.

తెలంగాణలో 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్ ప్లాంట్: కార్యకలాపాల విస్తరణలో భాగంగా గత ఏడాది తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్ వద్ద 75 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,000 కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్, 4 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చిరంజీవ్ సలూజా తెలిపారు. అయితే భారత ప్రభుత్వ మేకిన్ ఇండియా విజన్‌కు అనుగుణంగా ఉండటంతో పాటు భౌగోళికంగా కార్యకలాపాలు విస్తరించాలన్న ఉద్దేశంతో తెలంగాణలో ఏర్పాటు చేయతలపెట్టిన 4 గిగావాట్ల సెల్ ప్లాంట్‌ను ఏపీలో నెలకొల్పాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాగా ఇప్పటికే సీతారాంపూర్‌లో ఏర్పాటు చేస్తున్న 4 గిగావాట్ల సోలార్ మాడ్యుల్ ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇది ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. మరోవైపు మహేశ్వరం వద్ద రూ.800 కోట్లతో నెలకొల్పుతున్న 1 గిగావాట్ సెల్, 1 గిగావాట్ మాడ్యుల్ ప్లాంట్ జూన్ నాటికల్లా పూర్తి కానుందని తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా 1,500 మందికి ఉద్యోగాలు రానున్నాయని సలూజా వెల్లడించారు.

ప్రపంచంలోని బలమైన బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి మూడో స్థానం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కు మరో ఘనత దక్కింది. ప్రపంచంలోని అత్యంత బలమైన బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి మూడో స్థానం దక్కింది. ఈ ఏడాదికి గాను విడుదలైన 'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100' నివేదిక ప్రకారం.. ఎల్ఐసీ 100లో 88 బ్రాండ్ స్ట్రెంత్ ఇండెక్స్ (బీఎ‌స్ఐ) స్కోర్ సాధించింది. 94.4 బీఎస్ఐ స్కోర్‌తో పోలాండ్‌కు చెందిన పీజెడ్‌యూ ప్రపంచంలోనే అత్యంత బలమైన బీమా బ్రాండ్‌గా నిలిచింది. 93.5 స్కోర్‌తో చైనా లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో ఉంది.

బ్రాండ్ విలువలో 12వ స్థానం: ప్రపంచంలోని అత్యంత విలువైన 100 బీమా బ్రాండ్లలో ఎల్ఐసీకి 12వ స్థానం లభించింది. ఎస్‌బీఐ లైఫ్ 76వ స్థానంలో ఉంది. భారత్ నుంచి ఈ రెండింటికే చోటు జాబితాలో దక్కింది. ఎల్ఐసీ ఆర్థిక పనితీరు విషయానికొస్తే, 2024 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 17 శాతం వృద్ధితో రూ.11,056.47 కోట్లకు పెరిగింది.

లాభనష్టాల మధ్య ఊగిసలాట

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడింది. వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక సూచీలు చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 7.51 పాయింట్ల నష్టంతో 74,332.58 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 7.80 పాయింట్ల పెరుగుదలతో 22,552.50 వద్ద క్లోజైంది. పరస్పర సుంకాలతో అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య అనిశ్చితి, గ్లోబల్ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30కంపెనీల్లో 14 రాణించగా..16 నష్టపోయాయి.

లోకా లోక రూ. 110 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: సింగపూర్‌లోని కుటుంబ కార్యాలయానికి చెందిన ఇన్వెస్టర్ల నుంచి 1.25 కోట్ల డాలర్లు (సుమారు రూ.110 కోట్లు) సమీకరించినట్లు ఆల్కహాల్ బెవరేజెస్ కంపెనీ లోకా లోక శుక్రవారం వెల్లడించింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), భారత్ సహా ఇతర దేశాల్లో ఉత్పత్తులను విడుదల చేసేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీని సినీ నటుడు రానా దగ్గుబాటి, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, ఆల్కహాల్ బెవరేజ్ వ్యాపారవేత్త హర్ష వడ్లమూడి కలిసి ప్రారంభించారు. వడ్లమూడి ఈ కంపెనీకి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది తమ ఉత్పత్తులను యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఇండియా, దుబాయ్, లండన్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా మార్కెట్లలో ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	85
కరీంనగర్	73	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	72
కర్నూలు	73	నెల్లూరు	77
విశాఖపట్నం	94	అనంతపురం	77
గోదావరి	95		

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	443	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ.	66

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,160 ▼	79,900 ▼	1,08,100 ▲
విజయవాడ	88,250 ▼	84,000 ▼	99,200 ▲
విశాఖపట్నం	86,290 ▲	79,010 ▼	97,690 ▼
రాజమండ్రి	87,270 ▼	80,000 ▼	98,900 ▼
ప్రొద్దుటూరు	88,150 ▼	81,630 ▼	98,500 ▼
ముంబై	86,059 ▼	78,830 ▲	96,724 ▲

హెచ్‌పీసీఎల్ సారథిగా వికాస్ కౌశల్



తొలిసారిగా ప్రైవేట్ కన్సల్టెంట్ చేతికి పగ్గాలు

న్యూఢిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వికాస్ కౌశల్ నియమితులయ్యారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదేళ్ల కాలానికి ఈ నియామకం వర్తిస్తుంది. ఆయన గతంలో మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ కెర్నీలో పని చేశారు. ప్రైవేట్ రంగానికి చెందిన కన్సల్టెంట్‌కు ఒక ప్రభుత్వ రంగ సారథిగా పగ్గాలు అప్పగించడం ఇదే ప్రథమం. పీకే జోషి పదవీ విరమణ చేయడంతో గత ఏడాది ఆగస్టు నుంచి ఈ పదవి ఖాళీగానే ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న అర్హత నిబంధనలు సడలించి వికాస్ కౌశల్‌ను (53) హెచ్‌పీసీఎల్ సారథిగా నియమించాలంటూ పెట్రోలియం, సహజ వాయువుల శాఖ చేసిన ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్‌కు చెందిన నియామకాల కమిటీ ఆమోదించింది. ప్రభుత్వ రంగ సంస్థలకు సారథులను ఎంపిక చేసే పీఈఎస్‌బీ ఆ పదవికి సరైన వ్యక్తిని గుర్తించడంలో విఫలం కావడంతో సంబంధిత మంత్రిత్వ శాఖకు చెందిన అన్వేషణ, ఎంపిక కమిటీ కౌశల్‌ను ఎంపిక చేసింది.

స్పోర్ట్స్

వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్ ప్రణవ్



పెట్రోవాక్ (మాంటెనీగ్రో): భారత గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ వెంకటేశ్ వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన ప్రణవ్.. మేటిక్ లారెన్సిక్ (స్లొవేనియా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో ఆడిన 11 రౌండ్లలో ఈ చెన్నై కుర్రాడు తొమ్మిది పాయింట్లతో అజేయుడిగా నిలిచాడు. 2008లో అభిజిత్ గుప్తా తర్వాత ఈ టోర్నీ గెలిచిన భారతీయుడయ్యాడు. ఈ క్లాసికల్ చెస్ ఓపెన్ విభాగంలో మొత్తం 157 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ప్రణవ్ విజయంపై విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశాడు. మరోవైపు గతేడాది డిసెంబరులో చెన్నైకే చెందిన గుకేశ్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

విజేత అరవింద్



'ప్రేగ్' చెస్ మాస్టర్స్ టోర్నీ

ప్రేగ్: అంతర్జాతీయ చెస్ యవనికపైకి మరో భారత యువ సంచలనం దూసుకొచ్చింది. తమిళనాడుకు చెందిన 25 ఏళ్ల అరవింద్ చిదంబరం ప్రేగ్ మాస్టర్స్ చెస్ టైటిల్ కొల్లగొట్టాడు. గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం 9 రౌండ్ల ఈ టోర్నమెంట్ .చివరి గేమ్‌ను డ్రాగా ముగించాడు. టర్కీకి చెందిన ఎడిజ్ గురెల్‌తో తొమ్మిదో రౌండ్‌లో 39 ఎత్తుల అనంతరం చిదంబరం పాయింట్ పంచుకున్నాడు. దాంతో మొత్తం ఆరు పాయింట్లతో చిదంబరం విజేతగా నిలిచాడు. అరవింద్‌కు ఇది తొలి అంతర్జాతీయ టైటిల్. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద (5) ఆఖరి రౌండ్‌లో అనిష్ గిరి చేతిలో పరాజయం చవిచూశాడు. ఐదు పాయింట్లతో ప్రజ్ఞానంద రెండో స్థానంతో టోర్నీని ముగించాడు. ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ విభాగంలో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ యకుబేవ్ టైటిల్ దక్కించుకున్నాడు. ఈ విభాగంలో తలపడిన భారత జీఎం దివ్యా దేశ్‌ముఖ్ (3 పాయింట్లు) తొమ్మిదో స్థానంతో నిరాశ పరిచింది.

దుబాయ్‌పై రచ్చ



భారత్‌కు అనుకూలతపై విమర్శలు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో ఇక మిగిలింది ఒకే ఒక్క మ్యాచ్. ఆదివారం భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఫైనల్ జరగాల్సి ఉంది. ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్నది పాకిస్థానే అయినా టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే ఆడుతోంది. అయితే భారత జట్టు ఎటూ కదలకుండా ఒకే చోట మ్యాచ్‌లన్నీ ఆడేస్తుండడంతో తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇతర జట్ల మాదిరిగా పలు వేదికల్లో ఆడేందుకు ప్రయాణం చేయాల్సిన అవసరం లేదని, ఒకే మైదానంలో ఆడడంవల్ల వారికి లబ్ధి చేకూరుతోందని అంటున్నారు. టోర్నీ ముగింపు దశకు చేరినా ఈ దుబాయ్ అనుకూలత విమర్శలు మాత్రం ఆగడం లేదు. ఇంగ్లండ్ మాజీలు మైక్ అథర్టన్, నాసిర్ హుస్సేన్ దక్షిణాఫ్రికా ఆటగాళ్లు డేవిడ్ మిల్లర్, డుస్సెన్ తదితరులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఇతర జట్ల మాదిరిగా దుబాయ్ కూడా తమకు తటస్థ వేదికని భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గంభీర్ తేల్చారు. చాలా రోజుల క్రితమే ఐసీసీ భారత్ ఆడే వేదికను ఖరారు చేసిందని, అయినా అక్కడ కూడా వివిధ పిచ్‌లపై ఆడుతున్న విషయాన్ని గమనించాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నాడు.



వరుణ్ వర్సెస్ శాంట్నర్

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అందరి చూపు భారత్-కివీస్ జట్ల స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, మిచెల్ శాంట్నర్‌లపై ఉండనుంది. దుబాయ్ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ఇద్దరు కీలకంగా మారే అవకాశం ఉంది. శాంట్నర్ ఎడమచేతి స్పిన్నర్ కాగా, వరుణ్ కుడిచేతి లెగ్ స్పిన్నర్. అలాగే ఇద్దరూ ఏడు వికెట్లతో తమ జట్లకు అండగా ఉంటున్నారు. కానీ వరుణ్‌కు కేవలం మూడు వన్డేల అనుభవం ఉంది. అటు 117 వన్డేలాడిన సీనియర్ ఆటగాడు శాంట్నర్ జట్టు కెప్టెన్‌గా కూడా రాణిస్తున్నాడు. మరోవైపు ఇద్దరూ స్పిన్నర్లే అయినప్పటికీ బంతిని వదిలే వేగంలోనూ తేడా ఉంటోంది. వరుణ్ ఏకంగా గంటకు 93.74 కి.మీ వేగంతో బంతిని విసురుతున్నాడు. అందుకే బ్యాటర్‌కు ఆ బంతిని అర్థం చేసుకునేంత సమయం ఉండదు. కివీస్‌పై తను ఆడింది ఒక్క వన్డేనే అయినా ఐదు వికెట్లు తీశాడు. ఇక శాంట్నర్ సగటు వేగం 82.90 కి.మీ. భారత్‌పై అతడు 23 వన్డేలు ఆడి 15 వికెట్లు మాత్రమే తీశాడు. ఎకానమీ మాత్రం ఓవర్ 4.75 పరుగులతో మెరుగ్గానే ఉంది. అయితే వికెట్లను తీయడం కాకుండా బ్యాటర్లను కట్టడి చేయడంలో శాంట్నర్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.



ఫైనల్‌కు హెన్రీ డౌటే!

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు ముందే కివీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. ఆ జట్టు ప్రధాన పేసర్ మ్యాట్ హెన్రీ భుజం నొప్పితో బాధపడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన సెమీస్‌లో క్యాచ్ పట్టే సమయంలో గాయపడ్డాడు. టోర్నీలో అత్యధిక వికెట్లు (10) తీసిన హెన్రీ ఫిట్‌నె‌స్‌పై స్పష్టత లేదని జట్టు కోచ్ స్టెడ్ తేల్చాడు. అయితే భారత్‌తో ఫైనల్‌కు మరో రోజు మాత్రమే ఉండడంతో అతడు ఆడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రూప్ మ్యాచ్‌లో భారత్‌పై హెన్రీ ఐదు వికెట్లతో చెలరేగిన సంగతి తెలిసిందే.

చక్రవర్తితోనే మాకు ప్రమాదం: కివీస్ కోచ్

ఫైనల్లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తమకు సమస్యగా మారే అవకాశం ఉందని కివీస్ కోచ్ గ్యారీ స్టెడ్ తెలిపాడు. 'భారత్‌తో మేమాడిన గ్రూప్ మ్యాచ్‌లో వరుణ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. కాబట్టి అతడి ప్రదర్శనపై దృష్టి సారించాల్సిందే. అతనో క్లాస్ బౌలర్. వైవిధ్యంగా బౌలింగ్ చేస్తూ మా జట్టుకు ప్రధాన ముప్పుగా మారాడు. అందుకే ఫైనల్లో వరుణ్‌ను దీటుగా ఎదుర్కోవడంతో పాటు పరుగులు సాధించే విషయమై చర్చించాల్సి ఉంది' అని స్టెడ్ తెలిపాడు.

హర్లీన్ గెలిపించెన్!



హర్లీన్ డియోల్ (70 నాటౌట్)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
యూపీ × బెంగళూరు
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

- గుజరాత్ హ్యాట్రిక్
- ప్లేఆఫ్ దిశగా అడుగు
- ఉత్కంఠ పోరులో ఢిల్లీ ఓటమి

వడోదర: హర్లీన్ డియోల్ (49 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 70 నాటౌట్) అదరగొట్టడంతో మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ కీలకమైన విజయాన్ని అందుకుంది. వరుసగా మూడో గెలుపుతో ముంబై ఇండియన్స్‌ను వెనక్కునెట్టి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. తద్వారా మెగా టోర్నీలో తొలిసారి ప్లే ఆఫ్స్ దిశగా బలమైన అడుగు వేసింది. శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్లతో టేబుల్ టాపర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుజరాత్ షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 177/5 స్కోరు చేసింది. మెగ్‌లానింగ్ (57 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 92), షఫాలీ వర్మ (27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 40) మాత్రమే రాణించారు. శిఖా పాండే రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో గుజరాత్ 19.3 ఓవర్లలో 178/5 స్కోరు చేసి విజయం అందుకుంది. హర్లీన్ డియోల్ (70 నాటౌట్)తో పాటు బేత్ మూనీ (35 బంతుల్లో 6 ఫోర్లతో 44), డాటిన్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24) మెరిశారు. శిఖా పాండే, జెస్ జొనాసెన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఏ మాత్రం ఆశల్లేని పరిస్థితులనుంచి జట్టును విజయపథంలో నడిపిన హర్లీన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఇక..ఇంతకుముందే ప్లేఆఫ్స్‌కు చేరిన ఢిల్లీ..లీగ్ దశను పరాజయంతో ముగించింది. మరోవైపు గుజరాత్ విజయంతో యూపీ వారియర్స్ టోర్నమెంట్ నుంచి నాకౌట్ అయ్యింది. కాగా గుజరాత్ జట్టు తమ చివరి మ్యాచ్‌ని ముంబైతో ఈనెల పదోతేదీన ఆడనుంది.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 177/5 (మెగ్ లానింగ్ 92, షఫాలీ వర్మ 40, సదర్లాండ్ 14, మేఘనా సింగ్ 3/35, డాటిన్ 2/37)
గుజరాత్ జెయింట్స్: 19.3 ఓవర్లలో 178/5 (హర్లీన్ 70 నాటౌట్, మూనీ 44, శిఖా పాండే 2/31, జొనాసెన్ 2/38).

ప్రతిభాన్వేషణ, వసతుల కల్పన క్రీడాభివృద్ధిలో కీలకం



కేంద్ర మంత్రి మాండవ్య

షాద్‌నగర్ (ఆంధ్రజ్యోతి): 'ఒలింపిక్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా పక్కాగా అడుగులు వేస్తోంది. 2028 లాస్‌ఏంజెల్స్ విశ్వ క్రీడలకు సన్నాహకాలతోపాటు, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి బిడ్ దాఖలు చర్యలు చేపట్టిన భారత్..అందుకు సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో మేథోమథనం ప్రారంభించింది. ఈ మేరకు రెండు రోజుల చింతన శిబిరం శుక్రవారం రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో మొదలైంది. శిబిరాన్ని ప్రారంభించిన కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య..క్రీడల్లో భారత్ తిరుగులేని శక్తిగా అవతరించేందుకు అందరూ చేతులు కలపాలని పిలుపు నిచ్చారు. భారత్‌ను ప్రపంచ క్రీడా శక్తిగా నిలపాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారని చెప్పారు. 'ఈ క్రమంలో ప్రతిభను గుర్తించడం, అధునాతన శిక్షణ పద్ధతులు ఆచరించడం, మౌలిక సదుపాయాల కల్పన ముఖ్యం. తద్వారా క్రీడల్లో సమ్మిళిత అభివృద్ధి సాధించాలి' అని మంత్రి పిలుపు నిచ్చారు. శిబిరంలో రాష్ట్రాల క్రీడల మంత్రులు, క్రీడా పరిపాలకులు, సీనియర్ అధికారులు పాల్గొంటున్నారు.

రోహిత్ కెప్టెన్సీపై కఠిన నిర్ణయం?



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత రోహిత్ శర్మ కెప్టెన్సీ భవిష్యత్ కూడా తేలనుంది. 2027లో వన్డే వరల్డ్‌కప్‌తో పాటు రాబోయే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు సన్నద్ధం కావాల్సి ఉంది. అందుకు ఇప్పటి నుంచే వన్డే, టెస్టులకు నూతన సారథిని నియమించాలన్న ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. కివీస్‌తో ఫైనల్ తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించాలని బోర్డు భావిస్తోంది. అలాగే గ్రేడ్ ఎ+ కాంట్రాక్ట్‌లో మార్పులు జరగనున్నాయి. ఇందులో మూడు ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన వారికి చోటుంటుంది. కానీ రోహిత్, విరాట్, జడేజా టీ20ల నుంచి వైదొలగగా, టెస్టుల్లోనూ రాణించలేదు. దీంతో వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సెమీస్‌లో ఆయుష్ షెట్టి

పారిస్: ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ ఆయుష్ షెట్టి సెమీస్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆయుష్ 21-16, 21-23, 21-17 తేడాతో రస్మస్ గెమ్కే (డెన్మార్క్)పై గెలిచాడు. శనివారం జరిగే సెమీస్‌లో ఆయుష్ వరల్డ్ నెంబర్ 14 ఆటగాడు లిన్ చున్ యితో తలపడతాడు.

www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 8-3-2025 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 339 | వెల (Price) : Rs. 6.50
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎల్లుండే గ్రూప్‌-1 ఫలితాలు

11న గ్రూప్‌-2, 14న గ్రూప్‌-3 జనరల్‌ ర్యాంకుల జాబితా

17న హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్ల తుది జాబితా విడుదల

ఫలితాల షెడ్యూల్‌ను ప్రకటించిన టీజీపీఎస్సీ

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా సంప్రదిస్తే..

99667 00339 నంబర్‌కు ఫోన్‌ చేసి ఫిర్యాదు చేయండి

అభ్యర్థులకు టీజీపీఎస్సీ చైర్మన్‌ బుర్రా వెంకటేశం విజ్ఞప్తి

10



కాస్త మెరుగే.. అయినా బరువే!

ఉద్యోగాలు చేస్తున్న మహిళల పరిస్థితి గతం కంటే నయం.. కానీ ఇప్పటికీ అనేక సవాళ్లు

దాదాపు సగం మంది ఉద్యోగినులకు తమ జీతం మీద నిర్ణయాధికారం కరువే

ఒకవైపు ఉద్యోగం చేస్తూనే.. ఇంటిపనంతా తామే చేసుకుంటున్నవారు 27% మంది

పురుషుల్లో మొదలైన మార్పు.. ఇంటిపనుల్లో తోడ్పాటు.. మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగినుల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' సర్వే



(ఆంధ్రజ్యోతి న్యూస్‌ నెట్‌వర్క్‌)

రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల పరిస్థితి గతంతో పోలిస్తే కాస్త మెరుగ్గానే ఉంది! అదే సమయంలో.. మహిళలపై తరతరాలుగా వస్తున్న కట్టుబాట్ల బరువు మాత్రం ఇంకా పోలేదు!! నిర్ణయాలు తీసుకోగలిగే స్వాతంత్ర్యం ఉన్నవారు.. ఇంటిపనుల్లో భర్త, పిల్లల తోడ్పాటు అందుకుంటున్నవారు గణనీయంగానే ఉన్నా.. తమ జీతం మీద తమకే హక్కులేని వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది!! మహిళా దినోత్సవం సందర్భంగా.. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఉద్యోగినులపై 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ప్రత్యేక సర్వేలో వెల్లడైన వాస్తవాలివి. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో.. కుటుంబ అవసరాల కోసమే తాము పని చేస్తున్నామని దాదాపు 57.8 శాతం మంది చెప్పగా, తమకు ఇష్టం కాబట్టి చేస్తున్నామన్నవారు 42.2 శాతం మంది ఉండడం విశేషం. ఉద్యోగం చేస్తున్నా తమ జీతం మీద తమకు ఎలాంటి అధికారమూ లేనివారి సంఖ్య ఏకంగా 48 శాతం దాకా

మిగతా 9వ పేజీలో...

లక్ష మంది మహిళలతో భారీ సభ

నేడు పరేడ్‌ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఇందిరా మహిళాశక్తి మిషన్‌ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌

హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

9

దక్షిణాదిపై కక్ష

ఎన్నికల్లో తక్కువ సీట్లు ఇచ్చిందని మోదీ ప్రతీకారం

ప్రాతినిధ్యం తగ్గించేందుకు పునర్విభజన ఆయుధం

అఖిలపక్ష సమావేశం ఎందుకు నిర్వహించడం లేదు?

1971 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్‌ చేపట్టాలి

హిందీ జాతీయ భాష కాదు.. బలవంతంగా రుద్దొద్దు

దేశంలో రెండోస్థానంలో ఉన్న తెలుగుకు ప్రాధాన్యమేదీ?

గుజరాత్‌కు ప్రధాని బ్రాండ్‌ అంబాసిడర్‌ అయితే నేను తెలంగాణకు.. ఆయనది టెస్టు మ్యాచ్‌.. నాది టీ-20

ప్రధానిగా మోదీని గౌరవిస్తా.. రాజకీయంగా విభేదిస్తా

ఉచితాలు పంచడంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి

ఒలింపిక్స్‌కు అహ్మదాబాద్‌ కంటే హైదరాబాద్‌ ఉత్తమం

ఇండియా టుడే కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ సీట్లు ఇచ్చిన దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకునేందుకు బీజేపీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తోందని, ఇందుకు నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని ఎంచుకుందని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ఆరోపించారు. కేంద్రం ఆదేశాల మేరకు కుటుంబ నియంత్రణను తాము సమగ్రంగా అమలు చేసినందుకు మూల్యం చెల్లించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. పునర్విభజనతో దక్షిణాది మాత్రమే కాకుండా పంజాబ్‌ వంటి రాష్ట్రాలు కూడా నష్టపోతాయని, రాజస్థాన్‌, బిహార్‌, యూపీ వంటి బీమారు రాష్ట్రాలు ఎక్కువ ప్రయోజనాలు పొందుతాయని తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన

మిగతా 11వ పేజీలో...

నియోజకవర్గాల పునర్విభజనపై చర్చిద్దాం రండి

8

చంద్రబాబు, రేవంత్‌ సహా 7 రాష్ట్రాల సీఎంలు, 29 పార్టీల అధినేతలకు స్టాలిన్‌ ఆహ్వానం

22న చెన్నైలో ఉమ్మడి కార్యాచరణ కమిటీ భేటీ



అసెంబ్లీకి వస్తా.. కాంగ్రెస్‌ను ఎండగడతా

వారికి చాలా సమయం ఇచ్చాం

హామీలు నెరవేరుస్తారని చూశాం.. ఏమీ చేయకపోగా అసత్య ప్రచారం చేస్తున్నారు

రాష్ట్ర ప్రజలు విసిగిపోయారు.. ఎప్పుడు ఎన్నికలొచ్చినా బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడతారు

ఏప్రిల్‌ 27న వరంగల్‌లో బహిరంగ సభ.. 10 లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు

పార్టీ నేతలతో బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై సమాలోచన

మర్కుక్‌/హైదరాబాద్‌, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌ పార్టీకి చాలా సమయం ఇచ్చాం. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని ఓపికగా ఎదురుచూశాం. కానీ, కాంగ్రెస్‌ సర్కారు ఏమీ చేయకపోగా.. రైతులు, ప్రజలకు ఇబ్బంది కలిగించే అసత్య ప్రచారాలతో కాలం వెళ్లదీస్తోంది' అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తానే స్వయంగా పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగడతానని వెల్లడించారు. కాంగ్రెస్‌ అసమర్థ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీయే తెలంగాణ సమాజానికి రక్షణ కవచమని 15 నెలల కాంగ్రెస్‌ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి రుజువైందని చెప్పారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో కేసీఆర్‌ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో కేటీఆర్‌, హరీశ్‌ సహా పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ పలు అంశాలపై మాట్లాడారు. వచ్చే నెలలో జరగబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం, 25 ఏళ్ల వేడుకలు, వరంగల్‌లో భారీ

మిగతా 10వ పేజీలో...





ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ 2.5% పెంపు

నేటి నుంచే అమల్లోకి 10

మహిళా శక్తి బస్సుల ప్రారంభం కూడా నేడే

తొలి దశలో 150 బస్సులు.. మొత్తం 600

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ వెల్లడి

నేను కాంగ్రెసోణ్ని కాదు!

అదో పార్టీనా..? నేను పక్కా బీఆర్‌ఎస్‌!!

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

డంప్‌యార్డ్‌ సమస్యపై తనను కలిసిన గ్రామస్థులపై ఎమ్మెల్యే మండిపాటు

ఆయన అభ్యంతరకర వ్యాఖ్యలు సోషల్‌ మీడియాలో వైరల్‌ 12

నా వ్యాఖ్యలను వక్రీకరించారు: ఎమ్మెల్యే

ఎకరా టార్గెట్‌ 100 కోట్లు!

వేలం భూముల ధర పెంపునకు మౌలిక సదుపాయాల కల్పన 8

గచ్చిబౌలిలోని ఐఐటీ నుంచి ఓఆర్‌ఆర్‌ దగ్గర్లోని జీఏఆర్‌ వరకూ ఐదు కిలోమీటర్ల మేర ఆరు వరుసల్లో ఫ్లై ఓవర్‌ లేదా ఎలివేటెడ్‌ కారిడార్‌

డీపీఆర్‌, సాధ్యాసాధ్యాల నివేదికకు టెండర్లు ఆహ్వానించిన టీజీఐఐసీ

నేడే అఖిలపక్ష భేటీ

భట్టి అధ్యక్షతన ఎంపీల సమావేశం



ముఖ్య అతిథిగా పాల్గొననున్న సీఎం రేవంత్‌

విభజన సమస్యలు, ఇతర గ్రాంట్లపైనే ప్రధాన చర్చ

పార్లమెంట్‌లో రాష్ట్ర వాణిని వినిపించడమే లక్ష్యం

పార్టీతో చర్చించాకే హాజరుపై నిర్ణయం: కిషన్‌రెడ్డి

సమగ్ర కుల గణనపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వండి

సలహా కమిటీకి డిప్యూటీ సీఎం భట్టి సూచన

హైదరాబాద్‌, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తేందుకు వీలుగా అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజాభవన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు అన్ని పార్టీల ఎంపీల సమావేశం ప్రారంభం కానుంది. ఈ భేటీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు అన్ని పార్టీల ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి స్వయంగా ఫోన్‌ చేసి, సమావేశానికి

మిగతా 11వ పేజీలో...



భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

21 మందికి స్థానచలనం

సీవీ ఆనంద్‌... ఏసీబీ డీజీ

సీపీడీ ఐజీగా శ్రీనివాసులు

అదనపు డీజీ(పర్సనల్‌)గా అనిల్‌ కుమార్‌ 8

వచ్చే వారం నుంచే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

బీఆర్‌ఎస్‌ ఆర్థిక అరాచకం వల్లే 'తులం బంగారం' ఆలస్యం

రెవెన్యూ మంత్రి పొంగులేటి 11



కూసుమంచిలో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మంత్రి పొంగులేటి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా విద్యార్థుల పార్టీ!

బంగ్లాదేశ్‌లో షేక్‌హసీనా పాలనమీద తిరుగుబాటు చేసి, ఆమెను గద్దెదించే లక్ష్యంతో సుదీర్ఘకాలం ఉద్యమాన్ని నడిపించిన విద్యార్థినాయకులు ఇటీవల ఒక కొత్త పార్టీ ఆరంభించడం విశేషమైన పరిణామం. పార్లమెంట్ భవనం ఎదురుగా వేలాది విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో నేషనల్ సిటిజెన్స్ పార్టీ (ఎన్సీపీ) ఆరంభం ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఒక ఉద్యమం, అనంతరకాలంలో కొత్త శక్తుల ప్రవేశంతో హసీనా వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెంది, అంతిమంగా ఆమె స్వదేశాన్ని వీడి భారత్ చేరింది. ఎన్సీపీ ఏర్పాటు అంత సునాయాసంగా ఏమీ సాధ్యపడలేదని, జమాతే ఇస్లామీ విద్యార్థి సంఘానికి చెందిన ఇద్దరు నాయకులకు చోటిచ్చే విషయంలో వివాదం రేగి, తిరుగుబాట్లు, సర్దుబాట్లతో ప్రస్తుతానికి సద్దుమణిగిందని అంటారు. రాబోయే కాలంలో విద్యార్థినాయకులంతా ఒక్కటిగా, పటిష్ఠంగా పార్టీని ముందుకు తీసుకుపోగలరా అన్నది అటుంచితే, బంగ్లాదేశ్ రాజకీయాలను దశాబ్దాలుగా గుప్పిట్లో పెట్టుకున్న రెండు వంశాలకు ఈ కొత్త పార్టీ సవాలు విసిరే సూచనలైతే ఉన్నాయి.

బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబూర్ రహ్మాన్ కుమార్తె హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఒకవైపు, సైనిక పాలకుడు జియావుర్ రహ్మాన్ కుమార్తె ఖలీదాజియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పి) మరొకవైపు ఉంటూ పరస్పర ఘర్షణలతో దేశాన్ని ఒక యుద్ధక్షేత్రంలాగా మార్చేశారు. వారి వైరానికి వందలాదిమంది బలైనారని తెలిసిందే. ఎవరు అధికారంలో ఉన్నా ఎదుటిపక్షం నాయకులను జైళ్ళలో పెట్టడానికీ, కార్యకర్తల ప్రాణాలు తీయడానికి వెనుకాడేవారు కాదు. ఈ ఇరువురి అనంతరం దేశాన్ని ఏలడానికి వారసులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. హసీనాను దేశంనుంచి తరిమివేసి, ఖలీదా జియాను జైలునుంచి బయటకు తేవడం ఇటీవలి పరిణామం. ఖలీదా కుమారుడు బిఎన్‌పి నాయకత్వహోదాలో ఉంటూ, ఇంతకాలమూ వెనుకపట్టుపట్టిన పార్టీని ఉద్ధరించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా ఒక కొత్తపార్టీ పెట్టడం రెండు ప్రధానపార్టీలకూ పెద్ద సమస్యే.

ఉద్యమానంతరం ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన వీరిని, దేశానికి నాయకత్వం వహించడానికి ప్రజలు అంగీకరిస్తారా? అన్నది ప్రధానం. పార్టీ డిక్లరేషన్ ఎంతో అందమైన, ఉన్నతమైన ఆదర్శాలనూ, ఆశయాలనూ ప్రకటించింది. దారిద్ర్యం, అసమానతలు, అధికార దుర్వినియోగం నుంచి ప్రజలకు రక్షణలను ఇస్తామన్నది. ప్రజల్లో ఏ వర్గాన్నీ నిర్లక్ష్యం చేయబోమనీ, సామాజిక, సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని కాపాడుతూ, బహుళత్వాన్ని పరిరక్షించుకుంటూ, సుసంపన్నమైన దేశాన్ని నిర్మించుకుంటామని ప్రకటించింది. నాయకత్వస్థానాల్లో మహిళలు, దళితులకు ప్రాతినిధ్యం దక్కడం, కోటా వ్యతిరేక ఉద్యమంలో కనిపించిన అన్ని వర్గాలకూ ఇప్పుడూ చోటు ఉంటూ, పార్టీ నాయకత్వం వైవిధ్యభరితంగా ఉండటం మెచ్చదగింది. ఇక, భారత్ అనుకూల, పాకిస్థాన్ అనుకూల రాజకీయాలకు తమ దేశంలో చోటులేదని ఎన్సీపీ కన్వీనర్ చేసిన ప్రకటన ఆచరణసాధ్యమైనదేనా? అన్నది ప్రశ్న. దేశప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనే నవీన వ్యవస్థల, విధానాల నిర్మాణం జరుగుతుందని ఆయన అన్నారు. ఇది అవామీలీగ్, బిఎన్‌పిలకంటే జమాత్‌ను దృష్టిలో పెట్టుకొని చేసిన వ్యాఖ్య అని విశ్లేషకుల అభిప్రాయం. హసీనా లేకపోవడంతో జమాత్ అన్ని రంగాల్లోనూ చక్రం తిప్పుతోందని, ప్రభుత్వ ఉద్యోగాల్లోకి చొరబడుతోందని వార్తలు వినబడుతున్న నేపథ్యంలో, అది స్వయంగా తన విద్యార్థినాయకులతో ఒక పార్టీ పెట్టించే పనిలో ఉందని కూడా అంటున్నారు.

దేశం సంక్లిష్టమైన స్థితిలో ఉండగా, యూనస్ ప్రభుత్వంమీద ప్రజావిశ్వాసం సన్నగిల్లుతున్న నేపథ్యంలో ఎన్సీపీ ఆవిర్భావం జరిగింది. ఇప్పటివరకూ ఈ విద్యార్థి నాయకులకు మంచిపేరే ఉన్నందున, అవినీతి రహిత స్వచ్ఛ రాజకీయాలకు కట్టుబడివుంటామన్న వారి హామీని ప్రజలు విశ్వసించవచ్చు. పార్టీ ర్యాలీలో ఖురాన్, భగవద్గీత పఠనం బహుళత్వానికీ, లౌకికవాదానికి కట్టుబడివుంటానన్న హామీకి రుజువు కావచ్చు. మతవాద జమాత్, మితవాద బీఎన్పీల విలువలు, సిద్ధాంతాలకు దూరంగా, భిన్నంగా నడవాలనుకుంటున్న ఈ పార్టీని బంగ్లాదేశ్ ప్రజలు ఎంత ఆదరిస్తారో చూడాలి.

సమాజంలో నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్న లైంగిక హింస, అసమానతలు, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటివి మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలుస్తున్నాయి. లింగ వివక్ష సమసిపోవడమే ఈ సమస్యకు మేలైన పరిష్కారం. నా దృష్టిలో మహిళా సాధికారతకు నిదర్శనం మహిళలకు సమానంగా ఆస్తి హక్కు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు వంటివే.

మహిళా సాధికారతతోనే వికసిత భారతం

మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

నేను ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి యువతతో కలవడం, వారి ఆకాంక్షలను తెలుసుకోవడం, నా అనుభవాలను పంచుకోవడం, భవిష్యత్ దిశగా వారికి దిశానిర్దేశం చేయడాన్ని నా కర్తవ్యంగా ముందుకు సాగుతున్నాను. ఈ సమయంలో ఓ విషయం నన్ను ఎంతగానో ఆకట్టుకునేది. ఏ విద్యాసంస్థ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడ మంచి ప్రతిభ చూపిన వారికి నా చేతుల మీదుగా అవార్డులు అందింపజేసేవారు. ఆ సమయంలో నా చేతుల మీదుగా అవార్డులు అందుకునే వారిలో... ఎక్కువ శాతం (65 శాతానికి పైగా) ఆడపిల్లలే ఉండేవారు. అవకాశం ఇస్తే... వారు ఏ విధంగా ఎదగగలరు అనే విషయానికి ఇదే ఉదాహరణ. విద్యా రంగంలోనే కాదు, నేడు అనేక రంగాల్లో మహిళా సాధికారత ఫలాలు మనం చూస్తూనే ఉన్నాం. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చెప్పిన ఓ మాట నాకు జ్ఞప్తికి వస్తోంది.



"మహిళలు ఇతరులపై ఆధారపడకుండా, తమ జీవితాలను తాము నియంత్రించుకోగలిగే విధంగా, తమ సవాళ్ళను తామే పరిష్కరించుకునే విధంగా సాధికారత పొందాలి."

ఈ ఆకాంక్షలోని ఆంతర్యాన్ని ఈ తరం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. మహిళా సాధికారత, స్త్రీ స్వేచ్ఛను అనేక కోణాల్లో ఆలోచించి అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా సంప్రదాయవాదులం అని చెప్పుకుంటూ మహిళా స్వేచ్ఛకు అడ్డంకిగా మారుతున్న ఆలోచనా విధానాల్లో మార్పు రావలసిన అవసరం ఉంది. భారతీయ సంస్కృతి స్త్రీని శక్తి స్వరూపంగా పూజించింది. 'శక్తి రూపేణ సంస్థిత' అంటూ మన సనాతన ధర్మం అమ్మవారిని అభివర్ణించింది. ఇక్కడ నదుల పేర్లు స్త్రీ రూపాలే. భూమాత, ప్రకృతి మాత, చెట్టు తల్లి... ఇలా మనిషికి మేలు చేసే ప్రతిదీ అమ్మ స్వరూపంగా భావించాం. విద్యలకు సరస్వతి మాతను, వేదాలకు గాయత్రి మాతను, సంపదకు లక్ష్మీ మాతను, ధైర్యానికి పార్వతీ మాతను పూజిస్తాం. సీతారాములు, పార్వతి పరమేశ్వరులు, లక్ష్మీ నారాయణులు అంటూ అగ్రస్థానాన్ని అమ్మవారికే ఇస్తూ వస్తున్నాం. అంతేనా శివుడు అర్ధనారీశ్వరుడుగా సగభాగం అమ్మవారికి ఇస్తే, శ్రీమహావిష్ణువు గుండెల్లో నిలుపుకున్నాడు. ఇక్కడ మనం గమనించాల్సింది... ఇంతగా స్త్రీలను భారతీయ సంస్కృతి గౌరవించింది.

ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న భారతదేశం మీద కన్నేసిన పరాయి దేశాలు, మన సంస్కృతిని నాశనం చేసి, మన మీద పెత్తనం చేయాలని చూశాయి. అదే సమయంలో భారతదేశం మాత్రమే గాక... భారతీయ స్త్రీల సాధికారత సైతం చీకటిలోకి వెళ్ళిపోయింది. స్వరాజ్యం సాధించుకునే



సమయానికి పరదేశీయులకు భయపడి ఏర్పాటు చేసుకున్న ఆంక్షలు సంప్రదాయాలుగా మారిపోయాయి. అవే మహిళా సాధికారతకు అడ్డంకిగా మారడం విచారకరం. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే... ముందుగా సమాజం ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలి. "స్త్రీలను గౌరవించి, వారికి అధికారం ఇచ్చే దేశాన్ని అభివృద్ధి చెందిన, నాగరిక దేశంగా భావించాలి" అన్న స్వామి వివేకానంద పలుకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ శక్తిగా భారత్ ఎదిగే క్రమంలో ప్రధాన అడ్డంకిగా మారుతున్న వివక్షలు, అసమానతలకు వ్యతిరేకంగా యువతీ యువకులు గళం ఎత్తాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితి రావాలంటే ముందుగా 'స్త్రీ విద్య' ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలి. పురుషుడి చదువు అతడికి మాత్రమే భవిష్యత్‌ను ఇస్తే, స్త్రీ విద్య మొత్తం కుటుంబ అభివృద్ధికి బాటలు వేస్తుంది. మహిళలు విద్యావంతులు కావడం వల్ల శిశుమరణాల రేటు తగ్గుతుంది. కుటుంబ ఆరోగ్యం మెరుగు పడుతుంది. పిల్లల పోషణ, ఆరోగ్యంతో పాటు వారి విద్యాపరమైన అవకాశాల మీద సానుకూల ప్రభావం ఏర్పడి అనేక సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. భారత ప్రభుత్వం ప్రారంభించిన బేటీ బచావ్ – బేటీ పఢావ్, సుకన్య సమృద్ధి యోజన లాంటి పథకాలు సమాజంలో మార్పునకు బీజాలు వేశాయి. నేను నెల్లూరు వెళ్ళినప్పుడు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వచ్చి, నన్ను కలిసే చాలా పేద కుటుంబాలు ఈ పథకాల వల్ల తమకు ఎలాంటి ఉపయోగాలు లభించాయో తెలియజేస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది.

స్వరాజ్యం సముపార్జించుకుని 75 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా మహిళా విద్య, మహిళా సాధికారత లాంటి అంశాల మీద మాట్లాడాల్సిన పరిస్థితి రావడం ఓ విధంగా బాధాకరమే. అయితే గత పదేళ్లుగా మొదలైన మార్పులు ప్రజా ఉద్యమాలుగా రూపుదాల్చి, వికసిత భారత సాకారం దిశగా ముందుకు సాగుతుండటం ఆనందదాయకం. ప్రపంచ వ్యాప్తంగా అనేక పెద్ద దేశాలతో పోల్చి చూస్తే, భారత్ సాధించిన మహిళా సాధికారత వేగం ఆశ్చర్యం కలిగించకమానదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం మహిళా భద్రత, మహిళా సాధికారతను మరింత కీలకంగా భావించి ముందుకు సాగడం వల్లనే ఈ మార్పు సాధ్యమైందని భావిస్తున్నాను. ఈ స్ఫూర్తిని ప్రజలు కూడా అందిపుచ్చుకోవాలి. సమాజంలో నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్న లైంగిక హింస, అసమానతలు, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వంటివి మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలుస్తున్నాయి. లింగ వివక్ష సమసిపోవడమే ఈ సమస్యకు మేలైన పరిష్కారం. నా దృష్టిలో మహిళా సాధికారతకు నిదర్శనం మహిళలకు సమానంగా ఆస్తి హక్కు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు వంటివే. సమాజం ఆలోచనా ధోరణిలో మార్పు ద్వారానే ఇది సాధ్యమౌతుంది.

సమాజం ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చి వచ్చి, మహిళా శక్తిని బలహీన పరుస్తున్న కొన్ని అంశాల్లో పునరాలోచన జరగాలని సూచిస్తూ... మహిళామణులు విద్య, సాధికారతలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగి, వికసిత భారత నిర్మాణాన్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాను.

▪ **ముప్పవరపు వెంకయ్యనాయుడు**
పూర్వ ఉపరాష్ట్రపతి

ప్రాంతాల ఆధిపత్యాలు.. ఆగ్రహాలు!

ఉత్తరాది ఆధిపత్యం... హిందీ సామ్రాజ్యవాదం... ఒకప్పుడు దక్షిణాదిన ప్రముఖంగా వినపడేవి. ఇప్పుడు మళ్లీ ఆ మాటలకూ ఆ భావాలకూ ప్రాచుర్యం వస్తోంది! వచ్చే ఏడాది చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలతో పాటు నూతన విద్యావిధానం అమలుకు కేంద్రం చేపడుతున్న చర్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేస్తున్న విమర్శలు వివాదాస్పద గతాన్ని గుర్తుకు తెస్తున్నాయి. అందులో మంచీచెడూ ఉండొచ్చు. చూసేచూపును బట్టే అది ఉంటుంది. ఉత్తరాది ఆధిపత్య భావన వెనుక ఎంతో చరిత్ర ఉంది.



akbar

పార్లమెంటు ఉభయ సభలకు సమానాధికారాలు కల్పించి, ఎగువసభలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారా జటిలమైన నియోజకవర్గాల పునర్విభజన సమస్యకు అంబేడ్కర్ సూచించినట్లుగా పరిష్కారం దొరకొచ్చు. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగసవరణలు తీసుకురావటానికి చూపించే ఉత్సాహం రాష్ట్రాలకు సమానహక్కులు కల్పించటంలోనూ ప్రదర్శించటమే ప్రాప్తకాలజ్ఞత కావొచ్చు! రాష్ట్రాల మధ్య సమానత్వం నెలకొంటే ప్రాంతీయవాదాలు బలహీనం అవుతాయి. నిజమైన జాతీయవాదం బలోపేతమూ అవుతుంది.

రాజ్యాంగ రూపకల్పనప్పుడు జరిగిన చర్చల్లోనే హిందీ అమలుపై తీవ్ర విభేదాలు తలెత్తాయి. దక్షిణాది నేతల అభిప్రాయాలకు తగిన విలువ ఇవ్వకుండా హిందీని జాతీయభాషగా అమలుచేయటానికి ఉత్తరాది నేతలు గట్టిగానే ప్రయత్నించారు. హిందీని వ్యతిరేకించేవారు జాతీయవాదులే కారనీ ఘాటుగానూ విమర్శించారు. జాతీయ భాషనే ఎంపిక చేసుకోలేకపోతే స్వాతంత్ర్యానికి అర్థం ఏముంటుందన్న ప్రశ్నా తలెత్తింది. దక్షిణాది నాయకులను సమాధానపరచటానికి రాజీసూత్రాన్ని కనుక్కొని 15 ఏళ్లపాటు హిందీ అమలును వాయిదా వేశారు. అప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ అధికారభాషగా ఇంగ్లిషు కొనసాగుతుందనీ 1965 జనవరి 26 నుంచి హిందీ జాతీయ భాషగా అమలయ్యేలా రాజ్యాంగ నిబంధనను రూపొందించారు. హిందీ అమలును రాజ్యాంగంలో పొందుపరచటం దక్షిణాది నేతలకు ఇష్టం లేకపోయినా ఉత్తరాది నేతల సంఖ్యాబలం వల్ల ఆమోదించక తప్పలేదు. అందుకే ఆ నిబంధనపై విమర్శలు ఆగలేదు. తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా అప్పటికే తీవ్ర ఉద్యమాలు జరిగాయి. 1937లోనే రాజాజీ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో హిందీ అమలు కోసం ఉత్తర్వులు జారీచేయటం పెను వివాదానికి దారితీసింది.

పెరియార్ రామస్వామి నాయకర్ సారథ్యంలో ఆత్మగౌరవ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. బ్రాహ్మణ వ్యతిరేక భావజాలంతో జస్టిస్‌పార్టీ 1920ల్లోనే అధికారంలోకి వచ్చింది. ఆర్యులు వలసవాదులనీ బ్రాహ్మణులు ఆర్య సంస్కృతికి ఆద్యులనీ ఆ సంస్కృతిలోనే ఇతర కులాల అణచివేత ఉందనీ ద్రావిడులే భారత ప్రాచీన నాగరికతకు అసలు నిర్మాతలనీ ఉత్తరాది నుంచి వారిని తరిమివేశారనీ.. అంటూ పెరియార్ చేసిన వాదనలు చదువరులను బాగా ప్రభావితం చేశాయి. సంస్కృత సాహిత్యాన్నీ పురాణాలనూ ఆయన తీవ్రంగా విమర్శించారు. మతగ్రంథాలను తగలపెట్టించారు. హిందీ సామ్రాజ్యవాదం అనే భావన అప్పుడే ప్రాచుర్యం పొందింది. తమిళం నుంచి సంస్కృత పదాలను తొలగించే ప్రయత్నమూ ప్రారంభమైంది. మరుగునపడిన తమిళ పదాలను మళ్లీ వాడుకలోకి తీసుకువచ్చారు. తమిళ భాషే కొత్తరూపు సంతరించుకుంది. అట్లా ద్రవిడ ఉద్యమంలో హిందీ వ్యతిరేకత, ఉత్తరాది ఆధిపత్యాన్ని నిలువరించే భావనలు ఊపిరిపోసుకున్నాయి. దక్షిణాది ద్రావిడుల కోసం ప్రత్యేక దేశాన్ని ఏర్పాటుచేయాలనే డిమాండును రామస్వామి చేశారు. పాకిస్థాన్ ఏర్పడినట్లే ద్రవిడస్థాన్ ఆవిర్భవించాలనీ కోరారు. ద్రవిడస్థాన్‌కు మద్దతు ఇవ్వాలని జిన్నాకు విజ్ఞప్తి కూడా చేశారు. జిన్నా దాన్ని తిరస్కరించారు. ఆర్యుల దండయాత్రలు, ద్రవిడుల స్థితిగతులు, కులవ్యవస్థ పుట్టుపూర్వోత్తరాల గురించి రామస్వామి నాయకర్‌తో పాటు 19వ శతాబ్దిలో బ్రిటిష అధికారులు– చరిత్రకారులు–భాషా శాస్త్రవేత్తలు వెల్లడించిన అభిప్రాయాలను ఇప్పటి సామాజిక శాస్త్రాల దృష్టితో అంగీకరించటం కష్టం. అయినప్పటికీ వాటి ఆధారంగా తలెత్తిన రాజకీయ ఉద్యమాలను ఇంకా కొనసాగిస్తున్నామని చెప్పుకొనే నేతలు మాత్రం పాత భావాలు పరమ సత్యాలన్నట్లే వ్యవహరిస్తున్నారు. సిద్ధాంత భూమికలు లోపభూయిష్టమని తెలిసినా రాజకీయ అవసరాలు ఆ పనిని చేయనివ్వవు.

ద్రవిడస్థాన్ డిమాండును పక్కనబెట్టి చూస్తే ఆత్మగౌరవ ఉద్యమం తమిళ సమాజ ముఖచిత్రాన్ని చాలా మార్చివేసింది. మధ్యస్థాయి కులాలకు రాజకీయ ప్రాధాన్యాన్ని కల్పించింది. కింది కులాల్లో రాజకీయ చైతన్యాన్ని తెచ్చింది. పట్టణ పేదల్లో కొత్త ఆశలను చిగురింపచేసింది. తమిళభాష ఆధారంగా ప్రాంతీయ జాతీయవాదాన్ని అభివృద్ధి చేసింది. సంక్షేమ పథకాలను ప్రభుత్వ విధానాల్లో కీలకం చేసింది. విద్యా, ఉద్యోగాల్లో ఏకకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించి రిజర్వేషన్ల కల్పనకు గట్టి భూమికను ఏర్పాటు చేసింది. ద్రవిడ ఉద్యమంపై పరిశోధన చేసిన 'రాబర్ట్ ఎల్ హార్డ్‌గ్రేవ్' వీటిపై వివరంగానే రాశారు.



▪ రాహుల్ కుమార్

తమిళనాడులో ఒకప్పటి హిందీ వ్యతిరేకత ఇప్పుడెంత ఉందో స్పష్టంగా చెప్పలేం. అక్కడి ప్రైవేటు పాఠశాలల్లో కూడా హిందీ, సంస్కృతాలను తృతీయ భాషలుగా తీసుకోవటం సర్వసాధారణమైంది. ఇతర ద్రవిడ భాషల పట్ల తమిళనాడులో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనటానికి దాఖలాల్లేవు. తెలుగు మాతృభాషగా ఉన్నవారు 2011 జనాభా లెక్కల నాటికి 42,34,302 మంది ఉన్నారు. తెలుగు బోధనను తమిళనాడు ప్రభుత్వం లెక్కచేయటం లేదనే ఆరోపణలు చాలానే ఉన్నాయి. ఒక్క తమిళనాడే కాకుండా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోనూ మూడో భాషగా హిందీ, సంస్కృతాలకే ప్రాధాన్యం పెరుగుతోంది. హిందీ రాష్ట్రాల్లోనైతే దక్షిణాది భాషలకు అక్కడి ప్రభుత్వాలు నామమాత్రపు ప్రాధాన్యాన్ని కూడా ఇవ్వలేదు. నిక్కచ్చిగా చెప్పుకోవాలంటే త్రిభాషా సూత్రం (మాతృభాష–ఇంగ్లిషు–మరో రాష్ట్ర భాష) విఫలమైంది.

విషయగ్రహణ సామర్థ్యం పెంచకుండా మార్పులు చేర్పులతో ఎన్ని త్రిభాషా సూత్రాలు పెట్టినా ఫలితం ఉండదు. త్రిభాషా సూత్రాన్ని పెట్టింది జాతీయ సమైక్యత కోసమే తప్ప గ్రహణ సామర్థ్యాలతో దానికి ఎలాంటి సంబంధం లేదు. నూతన విద్యావిధానంలో హిందీని బలవంతంగా నేర్చుకోవాలనే నిబంధన ఏదీలేదనీ కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. హిందీని తప్పనిసరిగా ఒక అంశంగా నేర్వాలని మొదటి ముసాయిదాలో పెట్టి విమర్శలు రావటంతో తర్వాత తొలగించారు.

ఏకభాష ద్వారా రాజకీయ ఐక్యతను, జాతీయభావాన్ని పెంపొందించాలన్న ఆదర్శం స్వాతంత్ర్యోద్యమ కాలంలో బలంగా ఉండేది. ఒకే భాష, ఒకే జాతి అన్నది యూరపు దేశాల్లోని జాతీయవాదానికి ఆధారం. ఏక భాషను అలవర్చి భావసమైక్యతను సాధించటం భారత్‌లో అంత తేలికగా సాధ్యం కాదు. ప్రధాన ప్రాంతీయ భాషలకు సమాన సామర్థ్యముండి, శతాబ్దాల సాహిత్య చరిత్ర కలిగిన పరిస్థితి మనలాగా మరోచోట ఉందని చెప్పలేం! ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా ఒక మతం, ఒక భాష ఆధారంగా ప్రజలందరినీ ఐక్యం చేద్దామని అనుకోవటం అత్యాశే అవుతుంది. ఈ అత్యాశ పెరిగినప్పుడల్లా మన ప్రజాస్వామ్యం గాడి తప్పుతోంది.

నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనపై ఆందోళనలు మొదలైన నేపథ్యంలో ఉత్తరాది ఆధిపత్యం గురించి అంబేడ్కర్ తన చివరిరోజుల్లో చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ చాలా ప్రాధాన్యత ఉంది.. భాషాప్రయుక్త రాష్ట్రాలపై కొన్ని ఆలోచనల పేరుతో ఆయన రాసిన చిన్న పుస్తకంలో 1955 నాటికే నెలకొన్న ఆందోళనల గురించి ప్రస్తావించారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం(ఎస్ఆర్‌సీ)లో సభ్యుడైన కె.ఎం.ఫణిక్కర్ తన అసమ్మతి పత్రంలో ఉత్తరాది ఆధిక్యత దేశ ఐక్యతకు ఎలా భంగకరంగా పరిణమిస్తుందో వివరిస్తూ చేసిన వ్యాఖ్యలను అంబేడ్కర్ ఉదహరించారు. ఒక రాష్ట్ర జనాభా ఎంత ఉన్నా పర్వాలేదనే ధోరణిలో ఎస్ఆర్‌సీ సిఫార్సులు ఉన్నాయనీ దీనివల్ల కలిగే విపత్తు గురించి కనీస ఆలోచన చేయలేదనీ అంబేడ్కర్ విమర్శించారు. ఎస్ఆర్‌సీ చేసిన ఘోరతప్పిదం అదేనని కూడా వ్యాఖ్యానించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దకపోతే దేశానికి తీవ్రనష్టం వాటిల్లుతుందనీ హెచ్చరించారు. ఉత్తరాదినీ దక్షిణాదినీ సమదృష్టితో చూడకపోవటం దేశ ఐక్యతకు గొడ్డలిపెట్టుగా మారుతుందని కూడా చెప్పారు. ఒకే భాష ఉన్నప్పటికీ పెద్ద రాష్ట్రాలను విభజించాలనీ సూచించారు. సాధ్యమైనంతవరకూ జనాభాపరంగా రాష్ట్రాలు ఒక స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోకపోతే వచ్చే అనర్థాలు చాలానే ఉంటాయనీ హెచ్చరించారు. ఎస్ఆర్‌సీ సిఫార్సులతో రాష్ట్రాల మధ్య వ్యత్యాసమే కాదు.. ఉత్తరాది–దక్షిణాది అనే భేద భావం ఏర్పడిందనీ వ్యాఖ్యానించారు. అమెరికాలో ఎగువ, దిగువ సభలకు సమాన అధికారాలు ఉన్నాయనీ, ఆర్థిక బిల్లులకు ఎగువసభ అయిన సెనేట్ ఆమోదం తప్పనిసరి అనీ అట్లా రాష్ట్రాల మధ్య సమతూకం ఏర్పడటం వల్లే అక్కడ నిజమైన సమాఖ్య వ్యవస్థ ఉందనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. హిందీని జాతీయభాషగా ఆమోదించటానికి ఉద్దేశించిన రాజ్యాంగ ముసాయిదాలోని 115 అధికరణ వివాదస్పదమైనంతగా మరేదీ కాలేదనీ సుదీర్ఘ చర్చల తర్వాత ఆ సమస్యపై ఓటింగు పెట్టినప్పుడు 78 ఓట్లు అనుకూలంగా వస్తే ప్రతికూలంగానూ అన్ని ఓట్లే వచ్చాయని అంబేడ్కర్ గుర్తుచేశారు. చివరికి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఒక ఓటు ఆధిక్యతతో హిందీ (అనుకూల ఓట్లు 78, వ్యతిరేక ఓట్లు 77) జాతీయభాషా స్థానాన్ని గెలుచుకుందనీ ప్రస్తావించారు. విచిత్రం ఏమిటంటే అంబేడ్కర్ కూడా హిందీని జాతీయభాషగా సమర్థించారు. దానితో ఏకీభవించనివారు అప్పుడూ ఇప్పుడూ ఉన్నారు. రాజాజీ అయితే దేశాన్ని ఉత్తరాది, దక్షిణాది అనే రెండు ఫెడరేషన్లుగా ఏర్పాటుచేసి, ఆ రెండు కలిసి ఒక కాన్ఫెడరేషన్‌గా మారాలనీ సూచించారు. ఆ కాన్ఫెడరేషన్‌కు కూడా మూడు అంశాలపై మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉండాలనీ ఉత్తర, దక్షిణాది సమాఖ్యలకు సమాన ఓటింగ్ హక్కులు ఉండాలనీ ప్రతిపాదించారు.

విషయగ్రహణ సామర్థ్యం పెంచకుండా మార్పులు చేర్పులతో ఎన్ని త్రిభాషా సూత్రాలు పెట్టినా ఫలితం ఉండదు. త్రిభాషా సూత్రాన్ని పెట్టింది జాతీయ సమైక్యత కోసమే తప్ప గ్రహణ సామర్థ్యాలతో దానికి ఎలాంటి సంబంధం లేదు.

70–75 ఏళ్లనాడు రాజాజీ, అంబేడ్కర్ వ్యక్తంచేసిన అభిప్రాయాలు ఇప్పుడు విచిత్రంగా అనిపించొచ్చు. 1971 నాటి జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరపాలన్న స్టాలిన్ డిమాండ్‌కు ఆమోదం లభించినా, మొత్తంగా పునర్విభజన ప్రక్రియనే కేంద్రం వాయిదా వేసినా పరిస్థితిలో పెద్దమార్పు రాదు. సీట్లపరంగా ఇప్పటికే ఉన్న అసమానత్వం అలాగే కొనసాగుతుంది. ఇక జనాభా ప్రాతిపదికగా నియోజకవర్గాల ఏర్పాటును ఎల్లకాలం వాయిదా వేయలేరు. ఒక ఓటుకు ఒకే విలువ ఎల్లకాలం కాదనలేరు. పార్లమెంటు ఉభయ సభలకు సమానాధికారాలు కల్పించి, ఎగువసభలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారా జటిలమైన ఈ సమస్యకు అంబేడ్కర్ సూచించినట్లుగా పరిష్కారం దొరకొచ్చు. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగసవరణలు తీసుకురావటానికి చూపించే ఉత్సాహం రాష్ట్రాలకు సమాన హక్కులు కల్పించటంలోనూ ప్రదర్శించటమే ప్రాప్తకాలజ్ఞత కావొచ్చు! రాష్ట్రాల మధ్య సమానత్వం నెలకొంటే ప్రాంతీయవాదాలు బలహీనం అవుతాయి. నిజమైన జాతీయవాదం బలోపేతమూ అవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

వర్గీకరణ మెడపై '371డి' కత్తి!

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఏర్పాటు చేయబడిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ఎమ్మార్పీఎస్ అభ్యంతరాల నేపథ్యంలో ఆ కమిషన్ గడువును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఇప్పటికే ఆ కమిషన్ ఎస్సీ రిజర్వేషన్లను ఎ, బి, సి అనే మూడు గ్రూపులుగా విభజించింది. అయితే తర్వాత వచ్చే నివేదికలో నాలుగు గ్రూపులుగా చేస్తుందా? మాదిగల రిజర్వేషన్ శాతాన్ని 11 లేదా 12 శాతానికి పెంచుతారా? అలా పెంచితే ఎవరికి తగ్గిస్తారు? అంటే మాలలకు 5 శాతంగా కేటాయించిన దాన్ని 4 లేదా 3 శాతానికి తగ్గిస్తారా? అలాగే మాల, మాదిగ కాని కులాలు గతంలో లాగానే అవే గ్రూపులో ఉంటాయా, వేరే గ్రూపుల్లోకి మార్చబడతాయా? వారు డిమాండ్ చేసినట్లు వారి రిజర్వేషన్ శాతాన్ని కూడా గతం కంటే పెంచుతారా? – అనే వాటికి సమాధానాల కోసం వేచి చూడాలి.



ఇలా రాజకీయ ఒత్తిడితోను, రాజకీయ ప్రయోజనాల కోసమూ మార్పులు, చేర్పులు చేయిస్తే అంతిమంగా అది సుప్రీంకోర్టులో నిలబడుతుందా అనే సమస్య ఎలాగూ ఉన్నది. అలాగే తెలుగు రాష్ట్రాలలో ఉనికిలో ఉన్న ఆర్టికల్ 371డి అనే మరో పెద్ద సమస్య కూడా ఉన్నది. కానీ దీన్ని గురించి ఎవరూ మాట్లాడటం లేదు.

ఈ ఆర్టికల్ 371డి అనేది 1973లో 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉనికిలోకి వచ్చింది. దేశంలో కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఉద్దేశించబడినది. ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలను, వెనుకబాటుతనాన్ని తగ్గించడం కోసం ఉద్యోగ నియామకాలు జోనల్, జిల్లా, స్థానిక స్థాయిల ఆధారంగా జరగాలని నిర్దేశిస్తున్నది. ఈ 371డి తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ ఉనికిలో ఉంది. అటువంటప్పుడు కేవలం రాష్ట్ర సగటు ఆధారంగా వర్గీకరణ గ్రూపులు చేస్తే అది రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించటమే అవుతుంది కదా. కాబట్టి జోనల్, జిల్లా, స్థానిక స్థాయిలలో కూడా రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలి. రాష్ట్ర సగటులు జిల్లాలలో పనిచేయవు. ఎందుకంటే తెలంగాణలో ఎక్కువ జిల్లాలలో మాదిగలు ఎక్కువ, తక్కువ జిల్లాలలో మాలలు ఎక్కువ సంఖ్యలో ఉండటం కనబడుతుంది. ఉదాహరణకి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో మాదిగల జనాభా ఎక్కువ. అక్కడ జిల్లా స్థాయి పోస్టులకు సంబంధించి రాష్ట్ర సగటుల ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడితే వారు నష్టపోతారు. కాబట్టి 371డి ప్రకారంగా జిల్లా స్థాయిలోనే గాక జోనల్, స్థానిక స్థాయి ఆధారంగా కూడా వర్గీకరణ జరగాలి. అప్పుడు జోనల్‌లో జరిగిన వర్గీకరణ జిల్లాలో ఉండదు. జిల్లాలో వర్గీకరణ స్థానిక స్థాయిలో ఉండదు. ఈ విధంగా ఒక దగ్గర ఉన్న గ్రూపులో ఉన్న కులాలు మరో దగ్గర ఉండవు. ఎక్కువ జనాభా కలిగిన మాదిగ, మాల కులాలకు ఈ పద్ధతి ఉపయోగకరంగా ఉండవచ్చు కానీ వందల్లో వేలల్లో జనాభా కలిగిన ఇతర షెడ్యూల్ కులాలకు కొన్ని సమస్యలు ఎదురవుతాయి.

మరి దీని నుంచి బయటపడే మార్గం ఏమి లేదా? అంటే ఉంది. అదేమంటే, వర్గీకరణను కులాల వారి జనాభా శాతాన్ని బట్టి కాక, ఆయా కులాలలో జరిగిన అభివృద్ధి, వెనుకబాటుతనం ఆధారంగా చేపట్టడం. అంటే వారిలో విద్య, ఉద్యోగాలు, ఇతర ఉపాధి అవకాశాల ఆధారంగా ముందు వరుసలో ఉన్న వారిని గుర్తించాలి. అదే సమయంలో ఇంకా ఆయా కులాలలో భూమి లేక రెక్కాడితే గానీ డొక్కాడని వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇలాంటి వారే ఇప్పటివరకు రిజర్వేషన్ల అవకాశాలను పొందటంలో వెనకబాటుకు గురయ్యారు. కాబట్టి వీరి అభివృద్ధి, వెనుకబాటు ఆధారంగా వర్గీకరణ చేయడం వల్ల 371డి సమస్య ఉత్పన్నం కాదు. రిజర్వేషన్లు ఇప్పటివరకు ఎవరికైతే అందటం లేదో వారికి అందాలంటే ఈ పద్ధతే శాస్త్రీయం

ఇలాగాక కులాలవారీగా వర్గీకరణ చేయడం వల్ల ఆయా కులాల్లో ఇప్పటికే రిజర్వేషన్ పొంది అభివృద్ధి చెందినవారు ఇప్పుడు కులాలవారీగా కల్పిస్తున్న రిజర్వేషన్ అవకాశాన్ని తిరిగి పొందటంలో ముందు వరుసలో ఉంటారు. అందువల్ల ఆయా కులాలలో ఉన్న పేదలు మరలా రిజర్వేషన్లను పొందలేని స్థితిలోకి నెట్టబడతారు. ఏ ఉద్దేశం కోసమైతే రిజర్వేషన్లు వర్గీకరించాలని కోరుతున్నామో ఆ లక్ష్యం నెరవేరదు.

అన్ని కులాలలో అభివృద్ధి చెందిన వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. ఇలాంటి వారందరూ ఒక గ్రూపులో ఉండటం వల్ల వారి సంఖ్య ఆధారంగా వారికి తక్కువ రిజర్వేషన్ ఉండటంతో ఆ రకంగా వారు ఎక్కువగా రిజర్వేషన్ పొందే అవకాశం ఉండదు. అప్పుడు ఎక్కువగా ఉండే పేదలకు అదే శాతంలో రిజర్వేషన్ అందుబాటులోకి వస్తుంది. సామాజిక న్యాయం అంటే ఇదే కదా. ఇప్పటికైనా వైషమ్యాలు తగ్గించి ఐక్యతను పెంచే, కుల నిర్మూలనకు బాట వేసే శాస్త్రీయ వర్గీకరణ జరగాలని కోరుదాం.

• **డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లు**

'పిలుపునివ్వటం'తోనే ఆగిపోరాదు!

ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మహిళా దినోత్సవం సందర్భంగా కొన్ని పిలుపులు ఇస్తుంది. ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయంగా మహిళల, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారత కోసం పిలుపునిచ్చింది. ఐతే పిలుపునివ్వడం వరకే సరిపోదు, దానికి తగ్గ దిశానిర్దేశం ఉండాలి. ఇవి లేవు కాబట్టే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో మహిళల నిరసనలు ఆందోళనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. పాకిస్థాన్‌లో మహిళలపై హింస, అదృశ్యం, హత్యలు, పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యం లేకపోవడం వంటి సమస్యలను హైలైట్ చేస్తూ వేలాది మంది మహిళలు 'ఔరత్ మార్చ్' జరిపారు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్‌ల అణచివేతకు వ్యతిరేకంగా మహిళలు, కళాకారులు, విద్యావేత్తలు నిరసనలు తెలుపుతున్నారు. ఇరాన్‌లో నివురుగప్పిన నిప్పులా ప్రతిఘటన ఏకమవుతున్నది. పాలస్తీనా మారణహోమానికి వ్యతిరేకంగా అక్కడి మహిళా జర్నలిస్టులు, కళాకారులు తమ నిరసనను ప్రపంచ ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. భారతదేశంలో పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా మణిపూర్, ఛత్తీస్‌గఢ్, లడక్‌లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు, పోరాటాలు చేస్తున్నారు. మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు వేలాదిగా పోలీస్ క్యాంపులు పెడుతూ మహిళలపై చేస్తున్న లైంగిక దాడులు, హింస, హత్యలకు వ్యతిరేకంగా అక్కడి మహిళలు ఉద్యమిస్తున్నారు. ఈ అంతర్జాతీయ, జాతీయ పోరాటాలు మహిళలపై నేటికీ జరుగుతున్న హింసను సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిలో మహిళల అభివృద్ధిని ఎలా ఆశించగలం? ఉన్నత న్యాయస్థానాలు సైతం నేడు మహిళా వ్యతిరేక తీర్పులు ఇస్తూ తమ పితృస్వామిక భావజాలాన్ని చాటుకుంటున్నాయి. లైంగిక నేరాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో తెలంగాణలో 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలు హైదరాబాదులో ప్రారంభం అవుతున్నాయి. 1996లో ప్రపంచ సుందరి పోటీలు బెంగళూరులో జరిగినప్పుడు అన్ని మహిళా సంఘాలు ఐక్యంగా నిరసించాయి. అదే స్ఫూర్తిని ఇక్కడా ప్రదర్శించాలి. మొత్తంగా భూస్వామ్య, కార్పొరేట్, సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తూ, విముక్తి సాధన దిశగా మహిళలు అన్ని రంగాల్లో సమానత్వం కోసం పోరాడాలి.



– **బి. జ్యోతి,** చైతన్య మహిళా సంఘం
(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

- ఓరుగల్లు రాజకీయ యవనికపై మెరిసిన అతివలు
- చట్టసభల్లో అడుగుపెట్టిన పలువురు మహిళా నేతలు
- జడ్పీ, కార్పొరేషన్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గానూ సేవలు
- క్రీడలు, ఇతర రంగాల్లోనూ దూసుకుపోతున్న అతివలు
- ప్రభుత్వ కొలువుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న పలువురు



నారీ.. విజయభేరి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వివరాలు: 5లో..

కుటుంబ వ్యవహారాల్లోనే కాదు.. ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా సత్తాచాటుతున్నారు మహిళలు. ముఖ్యంగా ఉమ్మడి ఓరుగల్లు రాజకీయ యవనికపై పురుషులకు ఏమాత్రం తీసిపోని రీతితో విజయాలు నమోదు చేస్తున్నారు. చట్టసభల్లో అడుగుపెట్టడమే కాదు ప్రజల పక్షాన గళం విప్పుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లోనూ సత్తాచాటుతున్నారు. ప్రభుత్వ కొలువుల్లోనూ ఉన్నత స్థానాల నుంచి కార్మికుల వరకు తమతమ విధుల్లో శక్తివంచన లేకుండా సేవలందిస్తున్నారు. ఎందరో నారీమణులు తాము ఎంచుకున్న రంగాల్లో విజయభేరి మోగించి.. ఉమ్మడి జిల్లా ప్రగతిపథంలో చెరిగని ముద్ర వేశారు.. వేస్తున్నారు. బాధ్యతల నిర్వహణలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి అయినా.. ఆలోచనలు, ఆచరణలు భిన్నంగా ఉన్నా.. అంతిమంగా ప్రజాభ్యుదయమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆకాశంలో.. అవకాశంలో సగం అంటూ చట్టసభల్లోనూ, పాలనా వ్యవస్థల్లోనూ గళం విప్పుతూ, కలం ఝుళిపిస్తూ ఉమ్మడి జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బండా ప్రకాశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోయినపల్లి వినోద్‌కుమార్, సిరికొండ మధుసూదనాచారి

ఓరుగల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- లక్ష మందితో నిర్వహించాలని యోచన
- ఉత్తర తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా ప్రణాళిక
- వరుస ఓటములతో నిస్తేజంలో ఉన్న శ్రేణుల్లో జోష్ నింపేలా సభ
- పార్టీ సభ్యత్వంతో పాటు గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకానికి నిర్ణయం
- కేసీఆర్‌తో భేటీలో పాల్గొన్న ఓరుగల్లు నేతలు

వచ్చే నెల 27న వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభకు కసరత్తు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాలను ఓరుగల్లు కేంద్రంగా నిర్వహించేందుకు 'గులాబీ' పార్టీ ప్రణాళిక రూపొందిస్తోంది. శుక్రవారం మాజీ సీం కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో ముఖ్యనేతలతో బీఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా వరుస ఓటములతో నిస్తేజంలో ఉన్న శ్రేణుల్లో జోష్ నింపేందుకు పార్టీ 25ఏళ్ల ఉత్సవాలను వైభవంగా గ్రామ, గ్రామాన నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీకి ఆయువుపట్టుగా ఉన్న ఉత్తర తెలంగాణలో పూర్వవైభవం తీసుకవచ్చేందుకు వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించటంతో గులాబీ శ్రేణులు జోష్‌గా ఉన్నాయి.

వరంగల్‌లో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు..

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను వరంగల్ కేంద్రంగా నిర్వహించాలని ఆ పార్టీ ప్రాథమికంగా నిర్ణయించింది. ఏప్రిల్ 27వ తేదీతో పార్టీ ఏర్పాటు చేసి 25 ఏళ్లవుతుండగా.. ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా ప్రతినిధుల సభ నిర్వహించి, 27న వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పార్టీ 20వ ఆవిర్భావ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. రజతోత్సవాలను మాత్రం వరంగల్‌లోనే నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అయితే కరీంనగర్‌లో ఏర్పాటు చేయాలని కొందరు సూచించినా కేసీఆర్ వరంగల్ వైపు మొగ్గుచూపినట్లు సమాచారం. వరంగల్‌లో సభ నిర్వహిస్తేనే ఉత్తర తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపుతుందని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే బహిరంగ సభ నిర్వహణకు కావాల్సిన సభ స్థలాన్ని పరిశీలించాలని వరంగల్ నేతలకు కేసీఆర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కాగా, 2001, ఏప్రిల్ 27వ తేదీన జలదృశ్యంలో టీఆర్ఎస్ పురుడుపోసుకుంది. ఆ తరువాత 2001, మే 17వ తేదీన కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభతో రాజకీయాల్లో పెనుమార్పులకు కేసీఆర్ నాందిపలికారు. అప్పటి జార్ఖండ్ సీఎం శిబూసోరెన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న

మిగతా 4వ పేజీలో...

వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్

- రామగుండం కమిషనరేట్‌కు అంబర్ కిషోర్ ఝా బదిలీ
- ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్‌కుమార్.. క్రైం డీసీపీగా జనార్దన్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



నూతన సీపీ సన్‌ప్రీత్ సింగ్



ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



క్రైమ్ డీసీపీ జనార్దన్

వరంగల్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన పోలీసు కమిషనర్‌గా సూర్యాపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సన్‌ప్రీత్ సింగ్‌కు డీఐజీగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ సీపీగా పనిచేసిన అంబర్ కిషోర్ ఝాను రామగుండం పోలీసు కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి. 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సన్‌ప్రీత్‌సింగ్ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు ఏఎస్పీ, వరంగల్ రూరల్ ఓఎస్డీగా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ డీసీపీగా, జగిత్యాల ఎస్పీగా పనిచేశారు. అలాగే బదిలీపై వెళ్తున్న అంబర్ కిషోర్ ఝాకు వరంగల్‌తో చాలా కాలంగా అనుబంధం ఉంది. వరంగల్ ఉమ్మడి జిల్లా ఓఎస్డీగా పనిచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వరంగల్ రూరల్ జిల్లా ఎస్పీగా పనిచేశాడు. ఆ తర్వాత ఖమ్మం ఎస్పీగా, కొద్ది రోజులు హైదరాబాద్‌లో బీపీఆర్‌డీ విభాగంలో పనిచేసి 2023 అక్టోబరులో వరంగల్ సీపీగా బాధ్యతలు స్వీకరించారు.

ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్‌కుమార్

ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్ కుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఇంతకాలం పనిచేసిన రవీందర్‌ను సీఐడీ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంకిత్‌కుమార్ గతంలో వరంగల్ కమిషనరేట్‌లో ట్రెయినీ ఐపీఎస్‌గా పని చేశారు. అలాగే క్రైమ్ డీసీపీగా బి.జనార్దన్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంతకాలం ట్రాన్స్ కో విభాగంలో అదనపు ఏఎస్పీగా పనిచేసిన జనార్దన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా నియమించింది కాగా, జనార్దన్ చాలాకాలంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో వివిధ హోదాల్లో కొనసాగుతూ వస్తున్నారు.

తనయుడే యముడయ్యాడు

- తల్లిని గొడ్డలితో నరికిన కొడుకు
- కుటుంబకలహాల నేపథ్యంలో హత్య
- వీరనారాయణపూర్‌లో దారుణం



రేవతి (ఫైల్)



రక్తపు మడుగులో మృతురాలు చదిరం రేవతి, సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎల్కతుర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కనీ.. పెంచి పెద్ద చేసిన ఆ తల్లి పాలిట కుమారుడే యముడయ్యాడు.. పనీపాట లేకుండా తిరుగుతున్నావని మందలించినందుకు కన్న తల్లినే అతి కిరాతకంగా నరికి హత్య చేశాడు. ఈ దారుణ సంఘటన శుక్రవారం రాత్రి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనా రాయణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన చదిరం రేవతి (45) - కు మారస్వామి దంపతులకు ఇద్దరు కుమారులు అజయ్, విజయ్ ఉన్నారు. కుమారస్వామి పదిహేనేళ్ల కిందట సాగు చేసిన పంట ఎండిపోవడంతో అప్పులపాలై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి రేవతి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకోవడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ కుమారులను చదివించింది. పెద్ద కు మారుడు అజయ్ గ్రామంలో కూలీ ప నులు చేస్తూ ఆకతాయిగా తిరుగుతు న్నాడు. చిన్న కుమారుడు విజయ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. కాగా, అజయ్‌కి ఇటీవల అదే గ్రామానికి చెందిన దగ్గరి బంధువుల అమ్మాయితో వివాహం జరగగా ఒకే ఇంటిలో అందరూ కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో వారం కిందట అత్తాకోడళ్లకు గొడవ జరగడంతో అజయ్ భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ విషయమై శుక్రవారం రాత్రి తల్లి రేవతికి కుమారుడు అజయ్‌లకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహించిన అజయ్.. క్షణికావేశంలో ఇంటిలో ఉన్న గొడలితో తల్లి రేవతి మెడపై బలంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలై రేవతి అక్కడిక్కడే మృతి చెందింది. ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై అక్కెనపెల్లి ప్రవీణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని డాగ్ స్కాడ్, క్లూస్ టీంతో వివరాలు సేకరించి దర్యాప్తు చేశారు. నిం దితుడు అజయ్ పరారీలో ఉన్నాడు. మృతదేహాన్ని హుజూరాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలో మార్చురీకి తరలించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులలో వాటికి పేమెంట్ జరిగి ప్రక్రియ పూర్తయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మునిసిసల్, కుడా, పంచాయతీ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మునిసిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పేమెంట్‌పై ప్రచారం జరగాలన్నారు. ఎంపీవోలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, పేమెంట్ జరిగిన రెండు రోజుల్లో ఎల్-1 దశ నుంచి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షను నిర్వహించారు. గ్రామాలలో తాగునీరు అందుతుందా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్, పరకాల మునిసిపల్‌తో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వేసవికాలంలో అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలు చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ మల్లేశం, కుడా పీవో అజిత్‌రెడ్డి, సీపీవో రవీందర్ రడేకార్, డీఎల్‌పీవో గంగా భవాని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ప్రైవేట్ టీచర్ టోకరా

అరెస్టు చేసిన హనుమకొండ పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదుతో ఏసీపీ, సీఐ, ఎస్సై

వరంగల్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తోటి ఉపాధ్యాయులను నమ్మించి లక్షల్లో డబ్బులు స్వాహా చేసిన ప్రైవేట్ టీచర్‌ను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి సుమారు రూ.5,10,000 విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు 2,68,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ఇందూరు కొత్తపల్లికి చెందిన కొమ్మ వివేకానందరెడ్డి అలియాస్ కిషోర్‌రెడ్డి (37) కొద్ది కాలంగా అక్కడ ప్రైవేట్ టీచర్‌గా పనిచేసి తోటి ఉపాధ్యాయులతో సన్నిహితంగా ఉండేవారు. జల్సాల ఖర్చుల కోసం వారి నుంచి డబ్బులు, నగలు తీసుకొని తిరిగి ఇవ్వలేదు. దీంతో సహోద్యోగులు చేసిన ఫిర్యాదులపై నిందితుడిపై ఏపీలో మూడు కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత హనుమకొండకు మకాం మార్చాడు. ఓ ప్రైవేట్ పాఠశాలలో మారు పేరుతో టీచర్‌గా చేరి ఎన్ఐటీలో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని అందులో పనిచేసే ఉపాధ్యాయురాలిని నమ్మించి రూ.8 లక్షలతో పాటు ఆమె కుమారుడికి ఎన్ఐటీలో సీటు ఇప్పిస్తానని 60గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని అక్కడి నుంచి మకాం మార్చాడు. ఇదే తరహాలో మరో ముగ్గురిని మోసం చేసినట్లు ఫిర్యాదులు రావడంతో నిందితుడిపై పోలీసులు నిఘా పెట్టారు. శుక్రవారం కిరాయి ఇల్లు ఖాళీ చేస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, హనుమకొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ సతీష్, ఎస్సై కిషోర్, కానిస్టేబుల్ ఉపేందర్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని సెంట్రల్ కాంప్లెక్స్ శ్రీహర్ష కన్వెన్షన్‌హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వహన కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగంలో ఈ టోర్నీ నిర్వహించనున్నట్లు, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు బహుమతులను, ప్రశంస పత్రాలు ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా పేర్కొన్నారు.

కేయూ పీజీ పరీక్షల్లో పది మంది డీబార్

కేయూ క్యాంపస్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ పీజీ పరీక్షల్లో శుక్రవారం 10 మంది విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడగా తనిఖీ బృందాలు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం తెలిపారు. డీబారైన వారిలో హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) పరీక్షల కేంద్రంలో 5 మంది, హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ డిగ్రీ పరీక్షల కేంద్రంలో మరో 5గురు డీబారైనట్లు పేర్కొన్నారు. వీరిపై పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హసన్‌పర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. కేయూ ఎస్సై రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ రెవెన్యూకాలనీకి చెందిన చింతల రంజిత్ (24), జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చెందిన పాయిండ్ల రాధాకృష్ణలు మిత్రులు కాగా, వీరిద్దరు ఓ ప్రైవేటు పెస్టిసైడ్ కంపెనీలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి వీరిద్దరూ కలిసి హుజూరాబాద్‌లో మిత్రుడి వివాహ వేడుకకు హాజరై తిరిగి హనుమకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో భీమారం బస్టాండు సమీపంలో రంజిత్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో ఎంజీఎంకు తరలించగా శుక్రవారం రంజిత్ మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రాధాకృష్ణ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. రంజిత్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిందర్ తెలిపారు.

వైద్య విద్య కోసం కేఎంసీకి శరీరదానం


కేఎంసీకి మృతదేహాన్ని అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమ నివాసి సంజీవ్ కుమార్ (80)శుక్రవారం మృతి చెందారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు యాకూబీ, చోటేమియా సహకారంతో సమాజహితం కోరి వైద్య విద్య నిమిత్తం మృతదేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేసేందుకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర, అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో పార్థీవదేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, అనాటమీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి, ప్రవీణ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు మల్లారెడ్డి, పి.వేణు, రాజేంద్రప్రసాద్, సాయిరెడ్డి, నరసింహారాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జస్టిస్ సుజోయ్‌పాల్ రాక

హనుమకొండటౌన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్, సామాజిక మధ్యవర్తిత్వ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్ శనివారం రానున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని సామాజిక మధ్యవర్తిత్వ వలంటీర్లతో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ సమావేశం కానున్నట్లు జస్టిస్ క్షమాదేశ్ పాండే ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలి

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.నిర్మల గీతాంబ


ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ధైర్యంగా పోరాడాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.నిర్మల గీతాంబ హజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు విభిన్న రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. ముందుతరాలతో పోల్చుకుంటే కలెక్టర్లు, పోలీసు తదితర ఎన్నో ఉద్యోగాలు మొదలుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందు నిలుస్తున్నారన్నారు. మహిళలు ఎన్నో అవరోధాలను దాటి ఉన్నత స్థానంలో నిలిచినందుకు మహిళా అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రతీ మహిళ ఒక రోల్‌మాడల్ అన్నారు. సమాజంలో పురుషులే మహిళా దినోత్సవం నిర్వహించినప్పుడే అసలైన మహిళా దినోత్సవమన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉద్యోగులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మల గీతాంబను కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, టీఎన్‌జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు, జిల్లా అధికారులు శ్రీను, శ్రీనివాస్‌కుమార్, నీరజ, అనురాధ, యూనియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ మనవడు రాంచంద్రం కన్నుమూత

- మృతుడు పాలకుర్తి మాజీ సర్పంచ్
- కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంచంద్రం
- పాలకుర్తిలో నివాళులర్పించిన ప్రముఖులు


పూలమాల వేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సభ్యులు


రాంచంద్రం (ఫైల్)

పాలకుర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ మనవడు, పాలకుర్తి మాజీ సర్పంచు చిట్యాల రాంచంద్రం అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. రాంచంద్రం సీపీఐ పార్టీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. 1981 నుంచి 2001 వరకు వరుసగా మూడుసార్లు సీపీఎం నుంచి సర్పంచుగా పనిచేశారు. తెలంగాణ తొలి, మలిదవ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. పాలకుర్తి అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించడంలో రాంచంద్రం కీలకంగా వ్యవహరించాడు. ముఖ్యంగా 100ఫీట్ల రోడ్ల విస్తరణకు ఎంతో కృషిచేశారు. పలు మార్లు ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్నాడు. 2001 నుంచి టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పనిచేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాంచంద్రం కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో మృతదేహంపై ఎర్రజెండాను కప్పారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, బీజేపీ జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్, మారం రవికుమార్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, క్రాంతి దల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్, చాకలి ఐలమ్మ సంఘం ఫౌండర్ నాగిల్ల శంకర్, ప్రముఖ కవి శంకర మంచి శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచు సోమేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు ఎడవెల్లి సోంమల్లయ్య సందర్శించి సంతాపం తెలిపారు. రాంచంద్రం అంత్యక్రియలకు ప్రభుత్వం తరుపున కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందచేశారు. రాంచంద్రం భార్య భారతి గత రెండేళ్ల క్రితం మృతి చెందగా, కుమారుడు సంపత్, కోడలు శ్వేత ఉన్నారు.

కేయూకు నేడు సెలవు లేదు..

మహిళ ఉద్యోగులందరికీ క్యాజువల్ లీవ్

కేయూ క్యాంపస్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మార్చి 8న రెండో శనివారం సెలవు లేదని, యథావిధిగా పనిచేస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్పష్టం చేశారు. జనవరి 15న కాకతీయ యూనివర్సిటీకి కనుమ పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించగా దానికి బదులుగా మార్చి 8 రెండో శనివారం పనిదినంగా ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో తెలియజేశారు.

వర్సిటీ మహిళ ఉద్యోగులకు సెలవు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న మహిళ బోధన, బోధనేతర ఉద్యోగులందరికీ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాజువల్ లీవ్‌ను ప్రకటించినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వర్సిటీ మహిళ ఉద్యోగులందరికీ క్యాజువల్ సెలవు ఇచ్చినట్లు తెలిపారు. మహిళ ఉద్యోగులందరూ గమనించాలని పేర్కొన్నారు.

ఎంజీఎంలో పేలిన ఆక్సిజన్ సిలిండర్

మహిళా స్వీపర్‌కు గాయాలు

వరంగల్ మెడికల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఆర్థో వార్డులో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఆర్థో వార్డు స్వీపర్ జ్యోతి గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్థో రోగికి అవసరమైన ఆక్సిజన్ సిలిండర్‌ను అదే వార్డులో పని చేస్తున్న స్వీపర్ జ్యోతి తీసుకువస్తోంది. ఈ క్రమంలో సిలిండర్ ఆకస్మాత్తుగా పేలింది. ఈ ఘటనలో స్వీపర్ చేతికి, కాలికి గాయాలు అయ్యాయి. ఎంజీఎం అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించారు. కాగా, అనుభవం ఉన్న వార్డు బాయ్ తీసుకురావాల్సిన సిలిండర్‌ను స్వీపర్ తీసుకురావడం వల్లే ప్రమాదం జరిగిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘనటతో రోగులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పెద్దగా ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా పారిశుధ్య కార్మికుల వెతలు

- పురుషులకు సమానంగా విధులు
- చాలీచాలని జీతాలతో అవస్థలు


ఉదయాన్నే అశోక జంక్షన్‌కు చేరుకున్న కార్మికులు


చెత్త కుప్పలను తొలగిస్తున్న మహిళా కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగంలో మహిళా పారిశుధ్య కార్మికులు పురుషులకు దీటుగా సేవలందిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని 66డివిజన్లలోని పలు కాలనీల్లో సుమారు 1,512 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. పదేళ్లుగా చాలీచాలని జీతాలతో జీవితాలు వెళ్లదీస్తున్నామని మహిళా కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, నెలవారీ ఖర్చులు అన్నీ పెరిగినా పాత జీతంతో వేదన అనుభవిస్తున్నామంటున్నారు. రూ.16,500లో చేతికి రూ.13వేలు మాత్రమే జీతం వస్తుండగా.. ఖర్చులకు కూడా సరిపోవడం లేదని మహిళా కార్మికులు కన్నీరు పెడుతున్నారు. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పర్మినెంట్ చేసి నెలకు రూ.30వేలు జీతం అందించాలని మహిళా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తమకు పీపీఈ కిట్లు, సబ్బులు, టవళ్లు, చీరలు, డ్రెస్సులు, చెప్పులు, కొబ్బరి నూనె, రోడ్డు ప్రమాద సూచిక ఆప్రాన్స్‌ను మూడేళ్లుగా ఇవ్వడం లేదని వెల్లడించారు. ఇక ప్రజలు తమను చిన్నచూపు చూస్తున్నారని, ఇళ్ల యజమానులు కనీసం తాగు నీరు కూడా ఇవ్వరని, ఎండకు తట్టుకోలేక చెట్ల నీడన కూర్చుంటే చీదరించుకుంటున్నారని కన్నీరు పెట్టుకుంటున్నారు. పెట్టారు.

రూ.30వేలు జీతం ఇవ్వాలి



ప్రస్తుతం నగరంలో ఏ వస్తువు కొనాలన్నా కొనబోతే కొరివిలా ఉంది. వచ్చే తక్కువ జీతానికి పిల్లల ఫీజులు, ఇంటి అద్దె, నెల వారి ఖర్చులు, ఆసుపత్రి ఖర్చులకు జీతం మొత్తం పోను అప్పులు మాత్రమే మిగులుతున్నాయి. 15 ఏళ్లుగా చేస్తున్న తమ సేవలను గుర్తించి నెలకు రూ.30వేల జీతంలో పాటు ఉద్యోగం పర్మినెంట్ చేయాలి.

-కొడకండ్ల లక్ష్మి, పారిశుధ్య కార్మికురాలు

పురుషులతో సమానంగా పని చేస్తున్నాం



ఉదయం 4 గంటలకు లేచి పని చేసే డివిజన్ అడ్డాపైకి వెళ్లి హాజరు తర్వాత మూడు షిఫ్టులలో పురుషులకు సమానంగా పని చేస్తున్నాం. అయినా తమకు ఎలాంటి గుర్తింపు లేదు. చెత్త కుప్పలు, మురుగు కాల్వలతో నిత్యం యుద్ధం చేస్తాం. తమ సేవలను కాలనీల ప్రజలు కనీసం గుర్తించి గౌరవించరు. ఎండా కాలంలో ఐతే కనీసం మంచి నీరు కూడా ఇవ్వరు.

- మాదాసి రజిత, పారిశుధ్య కార్మికురాలు


పోలీసులు అదుపులోకి తీసుకున్న బెల్లం ట్రాలీ, నిందితులు

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటిక పట్టివేత

హసన్‌పర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధి దేవన్నపేట క్రాసు రోడ్డు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీలో సుమారు రూ.1.20 లక్షల విలువ చేసే 15 క్వింటాళ్ల బెల్లం, రూ.8400 విలువ చేసే 140 కిలోల పటిక పట్టుకోవడం జరిగిందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజుపల్లి పుట్లం తండాకి చెందిన మాలోతు నరేష్, గూడూరు మండలం కొల్లాపూర్ ఇప్పల తండాకు చెందిన లావుడ్య రవీందర్‌లు జహిరాబాద్ ఏరియాలో బెల్లం, పటికను కొనుగోలు చేసి వారి గ్రామాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను, ట్రాలీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవిందర్ తెలిపారు.

ఓరుగల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

5వ పేజీ తరువాయి

ఈ సభతో దేశం మొత్తం తెలంగాణ ఉద్యమం వైపు చూసింది. ఆ తరువాత 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా మార్చాలనే లక్ష్యంతో 2022అక్టోబరు 5న భారత్ రాష్ట్ర సమితిగా పేరు మార్చారు. బీఆర్ఎస్ పేరుతో పోటీ చేసి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయింది. పార్టీకి గెలుపోటములు సహజమే అయినప్పటికి మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో శ్రేణులు చేజారకుండా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని నేతలు నిర్ణయించినట్లుగా సమాచారం.

క్యాడర్‌లో జోష్ నింపేలా..

వరుసగా ఎన్నికల్లో ఓటములు, కీలక నేతలు పార్టీ మారటంతో క్యాడర్ డీలా పడుతోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాల్లో కేవలం స్టేషన్‌ఘనపూర్, జనగామ స్థానాల్లోనే ఎమ్మెల్యేలు గెలిచారు. ఈ ఇద్దరిలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. పార్టీ అధికారం కోల్పోవడం, గెలిచిన ఇద్దరిలో ఒక ఎమ్మెల్యే పార్టీ మారటంతో నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తలకు.. 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉపశమనం ఇవ్వలేదు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒక్కసీటు దక్కించుకోలేదు. వరంగల్ లోక్‌సభ పరిధిలో మూడోస్థానానికి పరిమితం కావటం క్యాడర్‌ను మరింత కుంగతీసింది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటమే దక్కింది. వీటితో ఇటీవల జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయలేదు. కనీసం ఎవరికి బహిరంగంగా మద్దతు కూడా ఇవ్వలేదు. దీంతో పార్టీ క్యాడర్ తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ 25ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించి, క్యాడర్‌లో జోష్ నింపాలని గులాబీ పార్టీ భావిస్తోంది. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ తదితర దక్షిణ తెలంగాణ జిల్లాల్లో బీఆర్ఎస్ కొంత ప్రభావం ఉన్నా.. ఉత్తర తెలంగాణలోనే వరుస ఓటములతో క్యాడర్ డీలా పడిపోయారనే టాక్ ఉంది. దీంతో వరంగల్ కేంద్రంగా సభ నిర్వహణతో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని క్యాడర్‌లో కదిలిక తీసుకరావచ్చునని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్లుగా పార్టీ నేతలు పేర్కొంటున్నారు. అయితే సెప్టెంబరు నెలలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకునే అవకాశం ఉండగా.. వరంగల్ సభ తరువాత పార్టీ సభ్యత్వాల ప్రక్రియ పూర్తి చేసి, గ్రామ, వార్డు, మండల, జిల్లా కమిటీలకు కూడా ఎన్నికలు పూర్తి చేయాలని పార్టీ భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ కమిటీలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉండటంతో కమిటీల నియామకం చేయాలని సమావేశంలో పలువురు నేతలు సూచించినట్టు సమాచారం. బడ్జెట్ సమావేశాల అనంతరం పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లె రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2290	2100
పల్లికాయ (సూక)	7110	6500
పల్లికాయ (పచ్చిది)	5150	4400
కందులు	6868	5540
పెసళ్లు	7002	4645
పత్తి	7020	5800
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	14100	9000
డిడి	13010	12500
వండర్‌హాట్	17500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14000	9500
దేశీ	28000	25500
సింగిల్ పట్టి	40000	40000
దీపిక	17200	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కొండా సురేఖ



రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరు పొందిన కొండా సురేఖ ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో తనదైన విశిష్టతను నిలబెట్టుకున్నారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. శాయంపేట (రద్దయిన) నియోజకవర్గం నుంచి రాజకీయ ప్రస్థానం మొదలవగా.. 1999, 2004, 2008 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో మొదటిసారి మంత్రి అయ్యారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరి వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ సభ్యురాలిగా విజయం సాధించి.. రేవంత్ రెడ్డి కెబినెట్‌లో రెండో సారి మంత్రి పదవిని అలంకరించారు.

సీతక్క



ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ పటంలో దనసరి అనసూయ అలియాస్ సీతక్క ప్రస్థానం ఆసక్తిదాయకం. నక్సల్స్ నేపథ్యం నుంచి వచ్చిన సీతక్క రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. ములుగు నియోజకవర్గం ఓటర్లపై తనదైన ముద్ర వేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన బరిలో దిగి మరోసారి సంచలన విజయం సాధించి సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

గుండు సుధారాణి



ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థ మేయర్‌గా ఉన్న గుండు సుధారాణి రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమే. మొదట్లో తెలుగుదేశం పార్టీలో క్రియాశీల పాత్రపోషించారు. చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో పార్టీ పరంగా పలు రాష్ట్రస్థాయి పదవులను నిర్వహించారు. 2002 నుంచి 2004 వరకు టీటీడీ బోర్డు మెంబర్‌గా కూడా పని చేశారు. 2010 నుంచి 2016 వరకు రాజ్యసభ సభ్యురాలుగా ఉన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు.





నారీ.. విజయభేరి

ఓరుగల్లు రాజకీయ యవనికపై మెరిసిన అతివలు

- చట్టసభల్లో అడుగుపెట్టిన పలువురు మహిళా నేతలు
- జడ్పీ, కార్పొరేషన్, మున్సిపల్ చైర్‌పర్సన్లుగానూ సత్తా

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు.. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మరీ ముఖ్యంగా రాజకీయాల్లో తమదైన సత్తా చాటుతూ.. చట్టసభల్లో అడుగుపెడుతూ.. ప్రజాప్రతినిధులుగా ప్రత్యేకతను చాటుతున్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా.. మంత్రులుగా ప్రజాసేవలో తరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన 16 సాధారణ ఎన్నికల్లో చెన్నూరు (రద్దయిన) మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, శాయంపేట (రద్దయిన), ములుగు, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుంచి 8 మంది మహిళలు అసెంబ్లీలో అడుగుపెట్టగా, ముగ్గురు పార్లమెంట్‌లో పాగా వేసారు. అలా ఉమ్మడి జిల్లా నుంచి లోక్‌సభలో అడుగుపెట్టిన తొలి మహిళగా డాక్టర్ కల్పనాదేవికి దక్కగా.. అలాగే అసెంబ్లీలో తొలి మహిళా ఎమ్మెల్యేగా కాలుమోపిన ఘనత కనకరత్నమ్మకు దక్కింది. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఎక్కువసార్లు విజయం సాధించిన రికార్డు కొండా సురేఖకు దక్కుతుంది.

ఎర్రబెల్లి స్వర్ణ



ఉమ్మడి జిల్లాలో మరో సీనియర్ మహిళా నేత ఎర్రబెల్లి స్వర్ణ. సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు. వరంగల్ నగర పాలక సంస్థ మాజీ మేయర్. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయినా.. ఇప్పటికీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. మేయర్‌గా పనిచేసిన సమయంలో నగరాభివృద్ధికి తనవంతు కృషి చేశారు.

డాక్టర్ కడియం కావ్య



రాజకీయాల్లోకి ప్రవేశించిన మరో కొత్త తరం మహిళా నేత డాక్టర్ కడియం కావ్య. మాజీ మంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు అయిన కావ్య ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ తరుపున అనూహ్య విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టిన మహిళా నేతల్లో డాక్టర్ కావ్య మూడోవారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన కావ్య.. ప్రవృత్తి రిత్యా సంఘసేవకురాలు. స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయాలవైపు మొగ్గు చూపి తొలిప్రయత్నంలోనే విజయం సాధించారు.

విమలాదేవి

1967 ఎన్నికల్లో చెన్నూరు (రద్దయిన) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నెమురుగొమ్ముల విమలాదేవి ఎన్నికయ్యారు. మాజీ మంత్రి యతిరాజారావు సతీమణి అయిన విమలాదేవికి రాజకీయాలు తెలియకపోయినా భర్త యతిరాజారావు ప్రోద్బలంతో అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. చెన్నూరు నుంచి గెలిచిన ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమెనే. నియోజకవర్గం రద్దయ్యేనాటికీ మరో మహిళ ఎమ్మెల్యేగా గెలవలేదు. ఆ తర్వాత విమలాదేవి వరంగల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా పని చేశారు.

సత్యవతి రాథోడ్



సత్యవతి రాథోడ్ కూడా రాజకీయ రంగంలో తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంటున్నారు. 2009 ఎన్నికల్లో డోర్నకల్ నియోజవకర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన సత్యవతి రాథోడ్ సీనియర్ నేత రెడ్యానాయక్‌పై గెలుపొంది మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ అధినాయత్వం ఎమ్మెల్సీ సీటు ఇవ్వడంతో పాటు సీఎం కేసీఆర్ కేబినెట్‌లో ఆమెకు చోటు కూడా కల్పించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి శాఖ మంత్రిగా పనిచేసిన ఆమె ఇప్పుడు మరోసారి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ రేస్‌లో ఉన్నారు.

మాలోత్ కవిత



మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన మాలోతు కవిత కూడా రాజకీయాల్లో తన శైలిలో రాణిస్తున్నారు. మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ కూతురైన కవిత.. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తొలి మహిళ కవితనే కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పార్లమెంట్‌లో కూడా అడుగుపెట్టారు.

కనకరత్నమ్మ

నర్సంపేట నియోజకవర్గంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తొలి మహిళా ఎమ్మెల్యే కాకుమాను కనకరత్నమ్మ. 1975 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచిన కనకరత్నమ్మ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సహజంగానే సంఘ సేవకురాలైన ఆమె.. ప్రజలకు ఎంతో చేరువయ్యారు. ప్రజాసేవలో తనదైన ముద్రను వేశారు. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఏకైక మహిళగా నేటికీ ఆమె పేరు నిలిచింది.

బండారు శారారాణి

రాజకీయంగా ఓనమాలు కూడా తెలియని బండారు శారారాణి మొదటి సారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. పరకాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఆ పార్టీ ప్రభంజనంలో అనూహ్యంగా గెలిచారు. రాజకీయంగా ఎంత వేగంగా వచ్చారో అంతే త్వరగా నిష్క్రమించారు. ఆనారోగ్యకారణంగా ఆమె మరణించారు.

యశస్విని రెడ్డి



గత అసెంబ్లీ ఎన్నికల్లో యువకెరటంలా వచ్చిన మహిళా నేత, విద్యాధికురాలు యశస్వినీరెడ్డి. కాంగ్రెస్ అభ్యర్థిగా పాలకుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసి సీనియర్ నేత, విజయాలతో తిరుగులేని ప్రజాప్రతినిధిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావుపై అనూహ్య విజయం సాధించి రికార్డు సృష్టించారు. పాలకుర్తి నియోజవకర్గంలో సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమె ఇప్పుడు తనదైన శైలిలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

పుల్లా పద్మావతి



రాజకీయాల్లో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి ఆ తర్వాత కనుమరుగైన మరో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి. ఈమె గతంలో జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. పరకాల నియోజకవర్గం నుంచి పలుసార్లు అసెంబ్లీకి పోటీ చేసినప్పటికి గెలుపొందలేక పోయారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో అడుగుపెట్టారు.

కాకుమాను పద్మావతి

నగర పాలక సంస్థ మేయర్‌గా పని చేసిన మహిళా నేతల్లో కాకుమాను పద్మావతి ఒకరు. పద్మావతి కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ ఆమె ఎప్పుడూ రాజకీయాలకు దూరంగానే ఉంటూ వచ్చారు. నగర పాలక సంస్థ ఎన్నికల సందర్భంగా ఆమె అనూహ్యంగా తెరపైకి వచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిచి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈమె కూడా ఎంత వేగంగా రాజకీయాల్లోకి వచ్చారో అంతే త్వరగా కనుమరుగయ్యారు. మేయర్ పదవీ కాలం ముగిసిన తర్వాత తెరమరుగయ్యారు.

జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లుగా..

పలువురు మహిళలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్లుగా ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. గతంలో చెన్నూరు (రద్దయిన) మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల విమలాదేవి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ తొలి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండో మహిళా జడ్పీ చైర్‌పర్సన్‌గా ధన్వంతి, మూడో చైర్‌పర్సన్‌గా గద్దల పద్మ పని చేశారు. జిల్లాల పునర్విభజన ఫలితంగా జడ్పీల విభజన జరిగింది. తత్ఫలితంగా ఏర్పాటైన వరంగల్ జిల్లా పరిషత్‌కు తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా గండ్ర జ్యోతి, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌గా బడే నాగజ్యోతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీచైర్‌పర్సన్‌గా జక్కు శ్రీహర్షిణి పని చేశారు. కాగా, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లుగా కూడా మహిళలు రాణించారు. వీరిలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వెంకటరాణి, మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సిందూర రాణి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆంగోతు అరుణ, నర్సంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా గుంటి రజనీ తమ పదవులకు న్యాయం చేశారు.

మన దీప్తి.. విశ్వ కీర్తి..

- ఓరుగల్లు సత్తాను ప్రపంచానికి చూపిన పారా ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత
- అంగవైకల్యాన్ని సైతం జయించిన కల్లెడ ఆణిముత్యం



పారాలింపియన్, అర్జున అవార్డు గ్రహీత జీవాంజి దీప్తి

వరంగల్ స్పోర్ట్స్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కడు బీదరికం ఒక వైపు.. మానసిక వైకల్యం ఇంకోవైపు చుట్టుముట్టినా లక్ష్యం ముందు అవేం సమస్యలు కావని.. కఠోర సాధనతో ఏదైనా సాధించగలమని నిరూపించింది జీవంజి దీప్తి. పారాఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి.. ఇటీవల అర్జున ఆవార్డు అందుకుని.. ఓరుగల్లు కీర్తిని, వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసింది కల్లెడ ఆణిముత్యం.. పరుగుల చిరుత జీవాంజి దీప్తి. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవాంజి దీప్తి సాధించిన విజయాలపై ప్రత్యేక కథనం. అంగవైకల్యం కారణంగా సమాజంలో ఎన్నో అవమానాలను, సూటిపోటీ మాటలు ఎదుర్కొంది. అయినా వాటిని లెక్కచేయకుండా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అహర్నిశలు శ్రమించింది. గతేడాదిలో పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో మహిళల 400మీటర్ల టీ20 పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచింది. కాంస్య పతకంతో మెరిసి అంతర్జాతీయ వేదికపై ఓరుగల్లు కీర్తి ప్రతిష్ఠలను రెపరెపలాడించింది. దివ్యాంగురాలైన దీప్తి.. ఎన్నో అవమానాలు ఎదురైనా.. ఆత్మవిశ్వాసంతో పరుగు తీసింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో గ్రామంలో మొదలైన ప్రస్థానం.. హైదరాబాద్ మీదుగా సాగి ఆసియా పారా క్రీడలు, ప్రపంచ పారాఒలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించే వరకు కొనసాగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం హనుమకొండ నగర శివారులో 500 గజాల నివాస స్థలంతో పాటు గ్రూప్-2 ఉద్యోగావకాశం కల్పించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమెకు ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డును అందజేసి గౌరవించింది.

ఆత్మ విశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు..

జీవాంజి దీప్తి, పారా ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత

ఆత్మ విశ్వాసంతో కఠోర సాధన చేయడం ద్వారా లక్ష్యాన్ని అందుకోవచ్చు. కోచ్‌ల తర్ఫీదులను పాటించడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల తోడైతే క్రీడల్లో రాణించొచ్చు. పేదరిం, మానసిక వైకల్యం వేధిస్తూ.. వాటిని పట్టించుకోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహం, కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల ఫౌండర్ రామ్మోహన్‌రావు, పీఈటీ సహకారంతో అథ్లెటిక్స్‌లో ఓనమాలు దిద్దా. అక్కడ నా ప్రతిభను గుర్తించిన మా పీఈటీ... మరింత శిక్షణ ఇప్పించేందుకు 2016లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ వద్ద చేర్పించారు. ఆ తర్వాత రమేష్ అన్నీ తానై భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)లో చేర్పించి అత్యుత్తమ శిక్షణ అందించారు. అదే విధంగా జాతీయ బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ సహకారం కూడా తోడవడంతో నేను ఈ స్థాయికి చేరుకున్నా.

‘ఆమె’కు అండగా...

- మహిళల భద్రత కోసం షీటీమ్
- గ్రేటర్ వరంగల్‌లో మూడు బృందాలతో నిఘా
- పనిప్రాంతాల్లో, కళాశాలల్లో అవగాహన సదస్సులు



వరంగల్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అబలలు కాదు.. మీరు సబలలంటూ మహిళలో ధైర్యాన్ని నింపుతున్నారు షీటీమ్ పోలీసులు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ షీటీంను ప్రారంభించింది. ఆకతాయిలు కళాశాల విద్యార్థినులను, మహిళలను వేధింపులకు గురిచేయకుండా రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లు, కళాశాలల వద్ద షీటీమ్ పోలీసులు మఫ్టీలో గస్తీ కాస్తూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. అదుపులోకి తీసుకుని శిక్షిస్తున్నారు. పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురిచేసినా, మానసికరంగా ఇబ్బందులు పెట్టినా సమాచారం అందిన నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకుని మహిళలను రక్షిస్తున్నారు. మహిళలు ఆపద సమయాల్లో భద్రత కోసం ప్రత్యేక ఏర్పాటైన షీటీమ్‌ను సంప్రదించాలని షీటీం ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ఉన్న (హనుమకొండ, వరంగల్, కాజీపేట) ట్రైసిటీలో అవగహన సదస్సులు నిర్వహిస్తూ మహిళలకు ధైర్యాన్ని ఇస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 2015 ఏప్రిల్ 10న షీటీం ప్రారంభమవగా కమిషనరేట్‌లో ఇప్పటి వరకు 1607 మంది బాధితులు షీటీమ్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో 109 మందిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని, 542 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామని, 739 పెట్టి కేసులు నమోదు, 748 అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని షీటీమ్ ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత తెలిపారు. మహిళలు ప్రయాణాలు చేసేటప్పుడు టీ-సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని గమ్యం వివరాలు, వాహన నెంబర్ నమోదు చేస్తే గమ్యం చేరుకునే వరకు పోలీసులు నిఘా పెట్టి అప్రమత్తం చేస్తారని, దీనిని ప్రయాణాలు చేసే మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అత్యాచార బాధితులకు భరోసా

అత్యాచార బాధితులతో పాటు పోక్సో బాధితుల కోసం కమిషనరేట్ పరిధిలో 2020 సంవత్సరం జూన్‌లో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం బాధితులకు బాసటగా నిలుస్తోంది. హనుమకొండ రంగంపేటలో ఉన్న భరోసా సెంటర్‌లో కౌన్సిలర్‌లు, సపోర్టర్స్, వైద్య సిబ్బంది, న్యాయవాది అందుబాటులో ఉండి వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో మోసపోయిన మహిళలకు తోడుగా నిలిచి వారి తరుపున పోరాడి ఆశ్రయం కల్పిస్తూ స్వయం ఉపాధి ఆవకాశాలు కల్పిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదై జడ్జిమెంట్ వచ్చేంతవరకు దశల వారీగా పోక్సో కేసులో రూ.1,00,000, అత్యాచారం కేసులో రూ.50,000 అందిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు 720 కేసులు నమోదు కాగా, 466 పోక్సో, 178 అత్యాచారం, 78 మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి. బాధిత మహిళలకు పరిహారం కింద ఇప్పటి వరకు 376 కేసులలో కోటి 45లక్షల పరిహారం అందించినట్లు భరోసా గణంకాలు చెప్తున్నాయి. అదే విధంగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 73 మంది బాధిత మహిళలకు రూ. 4,59,400 అందజేశారు.

ఆపద సమయాల్లో మహిళలు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

సీపీ వాట్సాప్ నెంబర్ 8712685257
షీటీం : 8712685142
ఉమెన్ హెల్ప్‌లైన్ : 181



అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల

అమ్మ ప్రోద్బలంతో లా చేశా


మహిళలు నచ్చిన మార్గాన్ని ఎంచుకోవాలి ● వారికి కుటుంబసభ్యులు సహకరించాలి

జయశంకర్ భూపాలపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల

భూపాలపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'నాకు సివిల్స్ సాధించాలన్న ఆసక్తి ఉండేది. కానీ అమ్మ మాట, ఆమె ఇచ్చిన ప్రోద్బలంతో లా చేశా. మాది పేద కుటుంబం. ఉన్నత చదువులు చదివిన వారు లేరు. అందుకే నేను, మా అక్కను ఓ స్థాయిలో చూడాలని అమ్మానాన్న అనుకున్నారు. ఈ క్రమంలోనే నేను ఉన్న స్థాయి అధికారిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకే అమ్మ చెప్పగానే లా చేశా' అని తెలిపారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఖమ్మం నగరానికి చెందిన గంగినేని శ్రీనివాసరావు, పద్మ దంపతుల రెండో కూతురైన అఖిల ఇంటర్ వరకు ఖమ్మంలో, గ్రాడ్యుయేషన్ గీతం యూనివర్సిటీలో చదివారు. 2013లో బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. ఈ క్రమంలో ఐదు సంవత్సరాలు యూనివర్సిటీ టాపర్‌గా నిలవడమే కాకుండా గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. ఆ తర్వాత 2023లో భూపాలపల్లిలో ఉద్యోగంలో చేరారు. ఆమె అక్క కూడా హైకోర్టులో న్యాయవాదిగా ఉన్నారు. తనకు తొలుత సివిల్స్ అంటే ఎంతో ఇష్టమని, కానీ తన తల్లి ప్రోబ్బలంతో 'లా'లో చేరానని, మొదటి సంవత్సరం పూర్తయ్యే సరికి తనకు జడ్జి కావాలని పట్టుదల వచ్చిందని అఖిల వివరించారు. దీని ద్వారా మానవాళికి సంబంధించిన అన్ని అంశాలు, విభాగాలపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు, యువతులు వారికి నచ్చిన మార్గాన్ని ఎంచుకోవాలని, దానిని సాధించడం కోసం కృషి చేయాలని, వారికి కుటుంబసభ్యులు కూడా సహకరించాలని సూచించారు. మహిళలే కదా అని వారి మనోభావాలను దెబ్బతీయకూడదని, ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు సత్తాచాటుతున్నారన్నారు. మహిళలు, యువతులు కూడా లక్ష్యాలను చేరుకునేందుకు సెల్ఫ్ మోటివేషన్ అవసరమన్నారు. రక్షణ కోసం ఎన్నో చట్టాలున్నాయని అందరూ వాటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక భూపాలపల్లి జిల్లాలో ఇప్పటివరకు సుమారు 3వేల కేసుల వరకు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని, ఈ ఉద్యోగం ఓ సవాల్ లాంటిదని చెప్పుకొచ్చారు.

సాధారణ గృహిణి.. 25మందికి నాయకత్వం

సత్తా చాటుతున్న ముల్కనూర్ మహిళా డెయిరీ చైర్‌పర్సన్



మడిపల్లి పాల కేంద్రంలో పాలు పోస్తున్న బుర్ర ధనశ్రీ

భీమదేవరపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇమె ఓ సాధారణ గృహిణి... ఇంటర్ వరకు చదివారు.. అయితేనేం దేశంలోని మొట్టమొదటి మహిళా డెయిరీకి అధ్యక్షురాలయ్యారు. అంతేకాదు ఆమె ఆ మహిళా డెయిరీని విజయ పథంలో నడుపుతున్నారు. సుమారు 25వేల మంది మహిళా సభ్యులకు నాయకత్వం వహిస్తూ.. ఏడాదికి రూ.200కోట్ల టర్నోవర్‌కు మార్గదర్శకరాలిగా నిలిచారు. ప్రతిష్ఠాత్మక ముల్కనూర్ మహిళా డెయిరీని లాభాల బాటలో నడిపిస్తున్న బుర్ర ధనశ్రీ మహిళలకు ఆదర్శంగా నిలిచారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె 2002లో ప్రారంభమైన ముల్కనూర్ మహిళా డెయిరీకి 2022లో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె స్వయంగా పాలు పితికి కేంద్రంలో పోస్తూనే తన అధ్యక్ష విధులు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. సిబ్బంది, పాలకవర్గం, మహిళా సభ్యుల సహకారంతో 70వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ప్రతీ 15రోజులకు రూ.5కోట్ల పాడి రైతులకు బిల్లులను చెల్లిస్తున్నారు. డెయిరీ పరిధిలోని 200 సంఘాల్లో, డెయిరీ కేంద్రంలో కంప్యూటరీకరణ పూర్తి చేశారు. పాలు, పాల పదార్థాలను కూడా మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. భవిష్యత్తులో ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా లక్ష లీటర్ల పాలను సేకరించేలా కృషి చేస్తున్నామని ధన శ్రీ చెబుతున్నారు.



నేడు మహిళలకు వైద్య శిబిరం

వరంగల్ చౌరస్తా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 29వ డివిజన్ రామన్నపేటలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ తెలిపారు. మెడికవర్, మ్యాక్స్ ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో రామన్నపేటలోని గంగపుత్ర సంఘంలో కంటి పరీక్ష, బీపీ, షుగర్, ఈసీసీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా శానిటేషన్ మహిళలను సన్మానిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళలందరు హాజరు కావాలని కోరారు.

శేషభారతికి ఉమెన్ ఐకాన్ అవార్డు



వరంగల్ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవస్థానం ఈవో, సహాయ కమిషనర్ శేష భారతి ఉమెన్ ఐకాన్ -2025 అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజ్‌డమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉమెన్ ఐకాన్ -2025 అవార్డులను అందజేస్తోంది. హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రావొద్దు

మేయర్ గుండు సుధారాణి ● కమిషనర్‌తో కలిసి సమీక్ష సమావేశం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బల్దియా అధికారులకు మేయర్ గుండు సుధారాణి సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో మంచి నీటి సరఫరాకు సంబంధించిన ప్రణాళికలు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రూపొందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ నగర ప్రజలకు ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి ఫిల్టర్‌బెడ్‌లలో శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నామని, నగర ప్రజలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు టెండర్లు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నగరంలోని వడ్డెపల్లి, కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లలో చెడిపోయిన మోటార్లను వెంటనే మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని అన్నారు. సమావేశంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు మహేందర్ పాల్గొన్నారు.

అంధులు మనోనేత్రాలతో చూడగలరు

వరంగల్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంధ విద్యార్థులు మనోనేత్రాలతో చూడగలరని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో విజన్ ఎంపవర్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అంధ విద్యార్థులకు సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా అనితారెడ్డి, గౌరవ అతిథిగా ఫాదర్ జెరోమ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంధ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను చూసి ప్రశంసించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంధుల పాఠశాల నిర్వాహకులు కల్యాణి, మణిశంకర్, విజన్ ఎంపవర్ ఆర్గనైజేషన్ సిబ్బంది, గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీటీసీలో మహిళా అధికారులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పూజ



వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ



శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో కేక్ కట్ చేస్తున్న సీపీఐ మహిళలు

ఘనంగా మహిళా దినోత్సవం

నగరంలో కేక్ కట్ చేసి ముందస్తు సంబరాలు ● మహిళా అధికారులకు సన్మానాలు ● అతివలపై దాడులను అరికట్టాలని పిలుపు

ఖిలావరంగల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళా అధికారులను, సిబ్బందిని సన్మానించారు. ఖిలావరంగల్‌లో మహిళా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు ఆకుల విమల, ఆరెళ్లి సుధారాణి మాట్లాడుతూ అతివలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, మనువాద, ఆధిపత్య, పితృస్వామిక భావజాలాన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న, పీవోడబ్ల్యు హైదరాబాద్ అంబర్‌పేట్‌లో జరుగు బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా నాయకురాలు గోపిరెడ్డి రజిత, జూలూరి రజిత, బండి రేణుక, సుజాత, బండి రజిత, ఎమ్డీ బీబీ, ఎమ్డీ ఖతీజా, విజయ, గడ్డం అరుణ, తదితరులు పాల్గొన్నారు.

భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శివనగర్‌లో జెండాను ఎగురవేసి, స్వీట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సదాలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్నం, గృహహింస లు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళాసమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రోహిలా, సహాయ కార్యదర్శి విక్టోరియా, ప్రజానాట్యమండలి సహాయ కార్యదర్శి సువర్ణ, షఫీ, గౌతమి, సరిత, రామ రాజమ్మ, రాధిక, జయ, రజిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

● మామునూరు: మామునూరు పోలీస్ ట్రెయినింగ్ కాలేజీ (పీటీసీ)లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ పూజ హాజరై మహిళా అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో పీటీసీ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

● శంభునిపేట: రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆకాశంలో సగభాగమైన మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. ఇంటిని చక్కదిద్దటంతో పాటు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్‌లు, అధ్యాపకులు ప్రేమలత, పరమేష్, జి. వెంకటేశ్వర్లు, పీఎల్ఎన్ మూర్తి, నాగపరమేష్, మినాజుద్దీన్, శ్రీధర్, రమేష్, సుస్మిత, కృష్ణవేణి, రాజన్న, షరీఫ్ పాల్గొన్నారు. అనంతరం మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

● గిర్మాజీపేట: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించింది. సంఘం జిల్లా కోశాధికారి ఆర్.విజయ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద ప్రారంభమైన ప్రదర్శన వరంగల్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింస, దౌర్జన్యాలను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిగా మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, సభ్యులు స్వప్న, ఎం.డి.ఫరీదా, ఎ.మంజుల, పి.కీర్తి, ఎ.చైతన్య పాల్గొన్నారు.

● కరీమాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాణక్య విద్యానికేత్ హై స్కూల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆమెతో పాటు ఐద్వా స్టేట్ జాయింట్ సెక్రటరీ నళిగంటి రత్నమాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. 1975లో మహిళా హక్కుల పోరాటం ప్రారంభమైందని, అదే సంవత్సరం మార్చి 8వ తేదీని 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాయని గుర్తుచేశారు.



తమ్మెరభవన్‌లో జెండాను ఎగురవేస్తున్న మహిళ సమాఖ్య నాయకులు



మధ్యకోటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహిళలు

ఎల్‌ఆర్‌ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌ను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు తుచ తప్పకుండా పాటించాలన్నారు. ఈ నెల 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు, ఓపెన్ స్పేస్ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు తయారు చేసి ప్రతీ దరఖాస్తుదారుడిని ఫాలో అప్ చేస్తూ గడువులోగా ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు.

అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో మొత్తం 41,422 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 15,341 దరఖాస్తులను ఆమోదించామని, 199 దరఖాస్తులకు చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించి త్వరలో దరఖాస్తులు పరిశీలించి పూర్తి చేస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ జోనా, ఉప కమిషనర్ ప్రసన్నరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూట్ ఉత్పత్తులు అందరికీ ఉపయోగపడేలా ఉండాలి

● మహిళలకు కలెక్టర్ సత్యశారద సూచన

గిర్మాజీపేట, మార్చి7 (ఆంధ్రజ్యోతి): జూట్ ఉత్పత్తులను అందరికీ ఉపయోగపడేలా తయారుచేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. పర్యావరణ హితమైన జనపనార ఉత్పత్తులు ప్రజల దినచర్యలో భాగం కావాలని, అపుడే వాటికి డిమాండ్ ఉంటుందని అన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ హోటల్‌లో భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సహకారంతో జాతీయ జనపనార బోర్డు ఆధ్వర్యంలో జూట్ మార్క్ ఇండియా పథకంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జనపనార వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతోందని, వీటి వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని అన్నారు. వరంగల్‌లో తయారవుతున్న జూట్ ఉత్పత్తుల నైపుణ్యం చూస్తుంటే సరైన మార్కెటింగ్ ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తాయనే నమ్మకం కలుగుతోందని అన్నారు. ఉత్పత్తిదారులు మార్కెటింగ్ పెంచుకునేందుకు జనపనార బోర్డుతో పాటుగా టెక్స్‌టైల్ కమిటీ సహకారం తీసుకోవాలని సూచించారు. టెక్స్‌టైల్ కమిటీ అమోదం పొందితే ఆ ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ వస్తుందని అన్నారు. పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ ఉత్పత్తుల వినియోగం పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల్లో జనపనార ఉత్పత్తులు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తయారీదారులకు శిక్షణ, మార్కెటింగ్ మెళకువలు నేర్పించేందుకు కృషి చేస్తామన్నారు. జూట్ మార్క్ ఇండియా పథకంపై స్వయం సహాయక మహిళ గ్రూపులు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఈ సందర్భంగా జనపనార ఉత్పత్తిదారులకు టెక్స్‌టైల్ కమిటీలో నమోదు, మార్కెటింగ్ తదితర అంశాలపై భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ టెక్స్‌టైల్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ జె.నిశాంత్ మేత్రాస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భారత టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ టెక్స్‌టైల్ కమిటీ హైదరాబాద్ ఇన్‌చార్జి అధికారి కె.శిరీష అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దివ్యారావు, టెక్స్‌టైల్ కమిటీ క్వాలిటీ అస్యూరెన్స్ అధికారి సి.సతీష్ కుమార్, వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కౌసల్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనపనార ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తిలకించారు. శుభలేఖ మాదిరిగా తయారుచేసిన మహిళా పర్సును చూసి బాగుందని అభినందించారు. జూట్ బ్యాగును అదనపు కలెక్టర్ సంధ్యారాణి కొనుగోలు చేశారు. ఈ సదస్సులో మెప్మా అధికారులు, స్వయంసహాయక మహిళలు పాల్గొన్నారు.

● మహిళా శక్తి ప్రపంచానికి మార్గదర్శకం

వరంగల్ కలెక్టరేట్: మహిళలు, పురుషులు ఇద్దరు ఒక బండికి చక్రాల్లాంటి వారని, మహిళలు సెన్సిటివ్ కాదు రాణిరుద్రమలని, ఇంట్లో, కార్యాలయాల్లో నిబద్ధతతో ఉంటారని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అనగానే సానుభూతి, త్యాగాలకు ప్రతీక అనేది ఒకప్పటి మాట అని, ప్రస్తుతం కొన్ని సమయాలలో కఠినత్వాన్ని ప్రదర్శించక తప్పదని, మహిళా శక్తి ప్రపంచానికి మార్గదర్శకమని అన్నారు. అమ్మాయిలను పెంచే విధానంలో తల్లిదండ్రులు సెన్సిటివ్ అలవాటు చేయడం వల్లే వారు అలా తయారవుతున్నారని, ఆ అలవాటు మానుకొని ధైర్యం, ఆత్మస్థైర్యం కలబోసి రాణి రుద్రమలా పెంచాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతోపాటు మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీఎన్‌జీవో అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, హేమనాయక్, శెంకేసి రాజేష్, రమాదేవి, తిరుమల, రజిత, సునీత నాయక్, ప్రియాంక, మేఘన, అన్నపూర్ణ, మానస, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెన్నం రమేష్ (ఫైల్)

కరీమాబాద్, మార్చి7(ఆంధ్రజ్యోతి): వరంగల్ కరీమాబాద్ ప్రాంతానికి చెందిన వెన్నం రమేష్ కనిపించకుండా పోయాడు. గత సంవత్సరం నవంబరు 28న ఇంట్లో భార్యతో గొడవ పడి వెళ్లిపోయిన తను ఇంతవరకు తిరిగిరాలేదు. అంతకుముందు కూడా ఇలా గొడవ పడి ఇంట్లోంచి వెళ్లిపోయి కొద్ది రోజులకు తిరిగివచ్చేవాడు. కానీ ఈసారి ఇన్ని రోజులైనా తిరిగి రాకపోవడంతో అతడి భార్య వెన్నం లలిత శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటరత్నం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు డీజే వాహనాలు స్వాధీనం

మట్టెవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'దడ పుట్టిస్తున్న డీజేలు' శీర్షికన ఈ నెల 3వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వరంగల్ సబ్ డివిజన్ పోలీసులు గురువారం రాత్రి ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ పోలీసు స్టేషన్ల పరిధిలో 6 డీజే వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రాత్రివేళల్లో పెళ్లి ఊరేగింపులలో విపరీతమైన శబ్దాలతో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే యజమానులు, ఆపరేటర్లపై కేసులు నమోదు చేశారు. ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ హెచ్చరించారు. నగరంలో డీజేలను పూర్తిగా నిషేధించామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వరంగల్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఖిలావరంగల్, ఏఎస్ రెడ్డి నగర్, స్తంభంపల్లి, ఏజే మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్, ఏఎస్ఎం కాలేజీ, రంగశాయిపేట, వసంతాపూర్, దూపకుంట, నాయుడు పంపు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని వరంగల్ డివిజన్ డీఈ శంకేషి మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న శానిటేషన్ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ - 2024లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న బల్దియా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి చేతుల మీదుగా కార్మికులను శాలువాతో సన్మానించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. నగర పరిశుభ్రత కోసం రాత్రి, పగలు అని తేడా లేకుండా పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో మల్లం రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, పోలెపాక అనిల్‌కుమార్, చెన్నూరి శ్యాంరాజ్‌తో పాటు ఎస్‌బీఐ హెడ్ ప్రకాశ్‌రావుతో పాటు జవాన్లు పాల్గొన్నారు.

'న్యాయం చేస్తామంటేనే సర్వేకు సహకరించాం'

మామునూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హామీ ఇచ్చినందుకే సర్వేకు సహకరించామని మామునూరు విమానాశ్రయ భూ బాధిత రైతులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ రోడ్డు, మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం, బాధిత రైతుల పిల్లలకు విమానాశ్రయంలో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న తమ డిమాండ్లకు ఎమ్మెల్యే ఒప్పుకున్నారని, అందుకే గురువారం నాటి సర్వేకు సహకరించామని అన్నారు. సర్వేకు సహకరిస్తే ఒక కమిటీ వేసి కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి రైతుల డిమాండ్ల కోసం పోరాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఒకవేళ ఇచ్చిన హామీలు అమలు చేయని ఎడల పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై కిసాన్ మోర్చా నిరసన

గిర్మాజీపేట, మార్చి7(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా శుక్రవారం నిరసన తెలిపింది. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నాయకులు ధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వం రైతాంగానికి తీరని నష్టం చేస్తున్నదని ఆరోపించారు. మోదీ ప్రవేశపెట్టిన జాతీయ మార్కెట్ వ్యవసాయ ముసాయిదా బిల్లు అమలులోకి వస్తే రైతాంగానికి పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి ఎఫ్.సి.ఐ, నాఫెడ్, సీసీఐ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతు అనుకూల విధానాలను ప్రవేశపెట్టి అమలుచేయాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ నిరసనలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, గోనే కుమారస్వామి, రైతు సంఘాల నాయకులు ఈసంపల్లి బాబు, ఇంద్రసేన, సుధమల్ల భాస్కర్, ఓదెల రాజయ్య, హంసల్ రెడ్డి, నరసింహారెడ్డి, నగేష్, మైదం పాణి తదితరులు పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

మహిళలకు రూ.15కోట్ల రుణాలు

పంపిణీ చేసిన మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఆర్చరీ క్రీడాకారిణి భరణిని సన్మానిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ

వరంగల్ చౌరస్తా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రూ. 15 కోట్ల రుణాలను అందజేశారు. వరంగల్‌లోని యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆర్చరీ క్రీడాకారిణి భరణిని ఘనంగా సన్మానించారు. శాలువా మెమొంటోతో పాటు నగదు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార రంగంలో గణనీయమనైన అభివృద్ధిని సాధించాలని, అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం హవేలి రాజు, బ్యాంకు రీజనల్ హెడ్ సత్యం, డివిజనల్ మేనేజర్ మహేష్ శ్రీరాం, బ్యాంకు సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తోపుడు బండిపై చెత్త సేకరణ

ఆలస్యమవుతోందని స్థానికుల ఆగ్రహం



ఖిలా వరంగల్‌లో బండిపై చెత్త సేకరిస్తున్న సిబ్బంది

ఖిలావరంగల్, 12(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్త సేకరణకు మళ్లీ పాత తోపుడుబండ్లే దిక్కవుతున్నాయి. స్వచ్ఛ వ్యాన్ పాడవడంతో దానిని రిపేర్‌కు ఇచ్చిన డ్రైవర్ కొంత కాలంగా తోపుడుబండిపైనే చెత్తను సేకరిస్తున్నారు. దీంతో బండి సరైన సమయానికి రాక చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖిలావరంగల్‌లోని కాపువాడ, హనుమాన్‌వీధి, మా లఅగర్తల, మధ్యకోటలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జవాన్, ఇన్‌స్పెక్టర్, కార్పొరేటర్‌లకు ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

రేపటి మహాసభను జయప్రదం చేయాలి

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అడెపు రవీందర్

పోచమ్మమైదాన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపెల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9వతేదిన నిర్వహిస్తున్న అఖిల భారత పద్మశాలి సంఘం 17వ మహాసభ -తెలంగాణ ప్రాంత 8వ మహాసభను విజయవంతం చేయాలని సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అడెపు రవీందర్ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్‌లోని పద్మశాలి సంఘం కార్యాలయంలో శనివారం మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పద్మశాలి కులబంధువులు, నాయకులు, చేనేత ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వద్నాల నరేందర్, గోరంటల రాజు, మాచబత్తుల కుమారస్వామి, గంజి సాంబయ్య, వేముల నాగరాజు, సురేష్, క్యాతం రంజిత్, వంగరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: అఖిల భారత పద్మశాలి మహాసభకు ప్రతీ పద్మశాలి ఇంటి నుంచి ఒకరు తప్పకుండా రావాలని సంఘం వరంగల్ నగర అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ రాంకీ విల్లాస్‌లోని తన స్వగృహంలో మాట్లాడారు. పద్మశాలీలు అధికసంఖ్యలో మహాసభకు వచ్చేలా నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గోరంటల రాజు, సాంబయ్య, రంజిత్, శీధర్, సారంగపాణి, రాంప్రసాద్, రవిందర్, కృష్ణ, నాగరాజు, గోపి, సురేష్, అంజనేయులు, రవి, జగన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
శనివారం ● 8 మార్చి 2025
నవ్య
కుటుంబ కదంబం

నేడు మహిళా దినోత్సవం



వినూత్నం

పొలానికి పురుగుమందులు పిచికారీ చేయడం కోసం డ్రోన్‌ను ఉపయోగిస్తూ వినూత్నమైన జీవనభృతిని ఎంచుకుంది పల్నాడు జిల్లా, అచ్చంపేటకు చెందిన, కోట సంధ్య. పొలం పనుల్లో డ్రోన్ వినియోగంతో పొందే ప్రయోజనాలు, ఆదాయాల గురించి ఆమె 'నవ్య'తో పంచుకున్న ఆసక్తికరమైన విశేషాలు...

డ్రోన్ పైలెట్ మన సంధ్య

మహిళల జీవితంలో పెళ్లి, పిల్లలతో కెరీర్‌కు బ్రేక్ పడుతుందనే విషయం అందరికీ తెలిసిందే! ఎమ్మెస్సీ బిఇడి చదివిన నేను ప్రారంభంలో అచ్చంపేటలో కస్తూర్బా స్కూల్లో ఏడేళ్లపాటు టీచర్‌గా పని చేశాను. పెళ్లయ్యాక, గర్భిణిగా ఉన్న సమయంలో వైద్యులు బెడ్‌రెస్ట్ సూచించడంతో టీచర్ వృత్తికి బ్రేక్ పడింది. అలా ఇద్దరు పిల్లల తల్లిగా, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ గృహిణిగా స్థిరపడిపోయాను. ఆ తర్వాత డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా చేరాను. ఆ సమయంలో కోరమాండల్ పురుగుమందుల కంపెనీ మమ్మల్ని సంప్రతించి, డ్రోన్ పైలట్‌గా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా డ్రోన్‌లను పంపిణీ చేస్తామని చెప్పింది. డ్రోన్‌తో పురుగుమందులు చల్లే ఆ ఆలోచన నాకు నచ్చింది. దాంతో ఏడాది క్రితం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపిఎమ్)లో ఏడు రోజుల శిక్షణ తీసుకున్నాను. మూడు రోజుల థియరీ శిక్షణలో భాగంగా డ్రోన్లలో రకాలు, డ్రోన్ల నిర్మాణం, అవి పని చేసే విధానాల గురించి తెలుసుకున్నాను. మిగతా నాలుగు రోజులు డ్రోన్‌ను ఎగరేయడమెలాగో నేర్చుకున్నాను. తర్వాత గుంటూరు, లామ్‌లో రెండుసార్లు శిక్షణ తీసుకున్నాను. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రభుత్వంతో అనుసంధానమైన కోరమాండల్ కంపెనీ నుంచి ఉచితంగా డ్రోన్‌ను అందుకున్నాను.

> మా వారు బాల యోగీంద్రబాబు ఎరువుల వ్యాపారి. మాకిద్దరు పిల్లలు. పెద్ద బాబు 6వ తరగతి, చిన్నవాడు ఒకటో తరగతి. డ్రోన్ విషయంలో మా వారు నన్నెంతో ప్రోత్సహించారు. ప్రస్తుతం ఓ పక్క డ్రోన్ పనులు చూసుకుంటూ, ఆన్‌లైన్‌లో ట్యూషన్లు కూడా చెప్తున్నాను.

రోజుకు 20 ఎకరాల మేరకు...

ప్రస్తుతం నేను 25 కిలోల డ్రోన్‌ను ఉపయోగిస్తున్నాను. ఈ డ్రోన్ అడుగున పది లీటర్ల ట్యాంక్ ఉంటుంది. ఒక ఎకరాకు సరిపడా పురుగు మందును పది లీటర్ల నీళ్లలో కలిపి, ట్యాంక్‌లో నింపి, డ్రోన్‌ను గాల్లో ఎగరేస్తూ పొలానికి పిచికారీ చేయవచ్చు. పంటకు ఎంత ఎత్తులో మందును పిచికారీ చేయాలో ముందే డ్రోన్ తెర మీద గుర్తులు పెట్టుకుని, జాయ్‌స్టిక్‌తో డ్రోన్‌ను నియంత్రిస్తూ గాల్లో ఎగరేయాలి. పురుగుమందులు పిచికారీకి డ్రోన్‌ను ఉపయోగించడంలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రమాదకరమైన పురుగుమందులకు బహిర్గతం కాకుండా, అతి తక్కువ సమయంలో పొలాలకు పిచికారీ చేయవచ్చు. అంతే కాకుండా పంట మొత్తానికీ మందు సోకేలా సమంగా పిచికారీ చేసుకోవచ్చు. సాధారణంగా ఈ పనికి కూలీలను వినియోగించుకుంటూ ఉంటారు. ఒక కూలీకి ఒక ఎకరాకు, రోజుకు 500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే పనిని డ్రోన్‌తో, 300 రూపాయలకే పూర్తి చేసుకోవచ్చు. ఒక ఎకరా పిచికారీ కేవలం 7 నుంచి 8 నిమిషాల్లోనే పూర్తయిపోతుంది. పంట ఎత్తు మీద రుసుము ఆధారపడి ఉంటుంది. అలాగే సాధారణంగా ఒక ఎకరాకు ఒక లీటరు పురుగు మందు అవసరమవుతుంది. కానీ డ్రోన్‌ను ఉపయోగిస్తే, ఒక ఎకరాకు 750 మిల్లీలీటర్ల పురుగుమందు సరిపోతుంది. ఇలా డ్రోన్‌తో ఒక రోజుకు 20 ఎకరాలకు పురుగుమందులు పిచికారీ చేసుకోవచ్చు. పైగా డ్రోన్ వాడకం వల్ల పురుగుమందు ఖర్చు కలిసొస్తుంది. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది.

డ్రోన్లతో బహుళ ప్రయోజనాలు

పురుగుమందుల పిచికారీకి డ్రోన్లను వాడుకోవడం వల్ల రైతులూ, ఆర్థిక స్వావలంబన సాధించాలనుకునే మహిళలూ.. ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. డ్రోన్‌ను నడిపించడం కూడా ఎంతో తేలిక. చదువుకోని మహిళలు సైతం దీన్నెంతో సులువుగా ఉపయోగించుకోవచ్చు. డ్రోన్ సహాయంతో పత్తి, వరి, మొక్కజొన్న, మినుము, కంది, మిరప, అరటి పంటలకు పురుగుమందుల పిచికారీ చేసుకోవచ్చు. అయితే ఈ డ్రోన్‌కు కూడా ఒకట్రెండు ప్రతికూలతలున్నాయి. ఆకారంలో పెద్దగా ఉంటుంది కాబట్టి పొలం దగ్గరకు తీసుకువెళ్లడానికి ఆటో లేదా ట్రాలీ లాంటి వాహనం అవసరమవుతుంది. పిచికారీతో పొందే ఆదాయంలో 50 శాతం ఈ వాహనానికే ఖర్చయిపోతూ ఉంటుంది. అలాగే డ్రోన్ బ్యాటరీ సహాయంతో ఎగురుతుంది. ఈ బ్యాటరీ ఒక ఎకరా పంట పిచికారీ వరకే పని చేస్తుంది. తర్వాత డ్రోన్‌ను నేల మీదకు దింపుకుని బ్యాటరీ మార్చుకోవాలి. డ్రోన్‌తో పాటు మాకు అందిన ఐదు అదనపు బ్యాటరీలను వాడుకున్నప్పటికీ ప్రతి రెండు గంటలకోసారి వాటన్నిటినీ చార్జ్ చేసుకోడానికి చాలా సమయం పడుతూ ఉంటుంది. ఈ సమయం కలిసి రావాలంటే మా దగ్గర జనరేటర్ సదుపాయం ఉండాలి. డ్రోన్‌ను తరలించడానికి వాహనంతో పాటు, జనరేటర్ సదుపాయాలను కల్పిస్తే ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చు. ఈ విషయంలో మాలాంటి వాళ్లకు ప్రభుత్వ తోడ్పాటు ఎంతో అవసరం.

● గోగుమళ్ల కవిత



మహిళ ఒక చైతన్య దీప్తి. ఆదిపరాశక్తి. సునీతా విలియమ్స్‌లా ఆకాశాన్ని అందుకోగలదు. మలాలలా ప్రపంచాన్ని కదిలించగలదు. కట్టుబాట్లను కాదని... వివక్షను దాటి... అవమానాలకు తట్టుకొని... అత్యున్నత శిఖరాలను చేరిన వనితలు ఎందరో. అలాంటి అసాధారణ మహిళల విజయాలను స్మరిస్తూ... వారి ప్రస్థానాన్ని భావితరాలకు పరిచయం చేస్తూ... 'అనుకొంటే ఏదైనా సాధించగలవు' అంటూ స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తుంటుంది ప్రముఖ సంస్థ 'బార్బీ'. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని... ఈసారి వివిధ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఐదుగురు భారతీయుల బొమ్మలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. వీరిలో భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ప్రముఖ గాయని నీతి మోహన్, ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా, ముంబయి చెఫ్ బీనా నోరోన్హా, ఫైర్ ఫైటర్ మేఘనా సక్పాల్ ఉన్నారు. వీరంతా తమ తమ రంగాల్లో తమదైన ముద్ర వేశారు. లక్ష్యం ఎంత పెద్దదైనా, అవరోధాలు, అసమానతలు ఎన్ని ఎదురైనా అనుకున్నది సాధించి చూపించారు. యువతరానికి ప్రేరణగా నిలిచారు.

మగువా... నీకుంది ఆ తెగువ

హర్మన్‌ప్రీత్ కౌర్:

భారత మహిళల క్రికెట్ జట్టు సారథి. సమర్థవంతమైన నాయకత్వంతో దేశంలో మహిళా క్రికెట్‌కు అరుదైన విజయాలు అందించింది. అనితరసాధ్యమైన బ్యాటింగ్‌తో రికార్డులెన్నో తిరగరాసింది. అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, జట్టును ప్రభావవంతంగా నడిపించడంలో ప్రత్యేకత చాటుకున్న హర్మన్... ఔత్సాహిక మహిళా అథ్లెట్లకు స్ఫూర్తిమంత్రం.

నీతి మోహన్:

భారతీయ సంగీత పరిశ్రమలో తనకంటూ కొన్ని పేజీలు లిఖించుకున్న గాయని నీతి మోహన్. రియాలిటీ షో కంటెస్టెంట్ నుంచి దేశం గర్వించదగ్గ గాయనిగా ఎదగడం వరకు... ఆమె ప్రతి మజిలీ ప్రేరణ కలిగిస్తుంది. వృత్తిపట్ల అంకితభావం... ఎంతటి క్లిష్టమైన స్వరమైనా అలవోకగా పలికించగలగడం... ఇవే నీతి మోహన్‌ను భిన్నమైన గాయనిగా తీర్చిదిద్దాయి.



మేఘనా సక్పాల్:

ఆమె కుటుంబంలో మూడోతరం ఫైర్ ఫైటర్. మగవారికే పరిమితమనుకున్న ఈ వృత్తిని చేపట్టిన ఆమె సాహసానికి మహిళా లోకం సలాం చేస్తోంది. విధుల నిర్వహణలో అంకితభావం, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వెనుతిరగని నైజం చూస్తుంటే... అతివకు అసాధ్యమనేది లేదని చెబుతోంది. పట్టుదలగా ప్రయత్నిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపిస్తోంది.

బీనా నోరోన్హా:

స్కార్లెట్ హౌస్, లైలా, గిగీ తదితర ముంబయిలోని ప్రసిద్ధ రెస్టారెంట్లకు హెడ్ చెఫ్‌గా వ్యవహరిస్తోంది బీనా నోరోన్హా. స్కార్లెట్ హౌస్' బాలీవుడ్ భామ మలైకా అరోరా, ఆమె తనయుడు అర్హన్‌ఖాన్ కలిసి ఏర్పాటు చేసిన రెస్టారెంటు. ఈ రెస్టారెంట్లలో సంప్రదాయ భారతీయ వంటకాలకు పాశ్చాత్య హంగులు అద్ది విభిన్నంగా వడ్డిస్తోంది బీనా. తద్వారా మన రుచులను ప్రపంచ దేశాల అతిథులకు పరిచయయం చేస్తోంది. ఆతిథ్య రంగంలోకి రావాలనుకొనే మహిళలకు ఆమె ప్రయాణమే పెద్ద ప్రేరణ.

అనామికా ఖన్నా:

దేశంలోనే ప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్లలో ఒకరు అనామికా ఖన్నా. భారతీయ సంప్రదాయ వస్త్రధారణలోని గొప్పదనాన్ని చాటుతూనే... వినూత్న డిజైన్లతో ఫ్యాషన్ ప్రపంచాన్ని ఆకర్షించిన ఘనత ఆమెది. వస్త్రశ్రేణుల్లో విలక్షణత, చేసే పనిలో నిబద్ధత, అద్భుతమైన కళాచతురత... ఫ్యాషన్ రంగంపై అనామికాది చెరగని ముద్ర.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

తెర వెనుకా తమదైన ముద్ర

మిగిలిన అన్ని రంగాల్లో అగ్రపథాన దూసుకుపోతున్న మహిళలకు చిత్రసీమలో లభిస్తున్న ప్రాతినిథ్యం తక్కువే. అయినా సరే తెరపైనే కాకుండా తెర వెనుక కూడా తమదైన ముద్ర వేసేందుకు ఎంతో మంది కృషి చేస్తున్నారు. ఒకప్పుడు నటనకు, అప్పుడప్పుడు దర్శకత్వ శాఖకు పరిమితమైన మహిళలు ఇప్పుడు చిత్ర నిర్మాణ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మగవారికి దీటుగా ఇరవై నాలుగు విభాగాల్లోనూ తమ సేవలు అందిస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. పురుషాధిక్యరంగంగా భావించే చిత్రపరిశ్రమలో అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ వడివడిగా అడుగులేస్తోన్న కొందరు నారీ మణులు మహిళా దినోత్సవం సందర్భంగా చిత్రజ్యోతితో పంచుకున్న నాలుగు మంచి మాటలు.

మహిళలు ముందుకు రావాలి

ఇండస్ట్రీలో ఒకప్పటి కన్నా ఇప్పుడే మహిళలకు అవకాశాలు ఎక్కువ. పాతికేళ్ల ముందైనా, ఇప్పుడైనా మహిళలందరికీ నేను చేప్పే మాట ఒక్కటే. ఇండస్ట్రీలో మీ ప్రతిభను చూపేందుకు ముందుకు రావాలి. తెలుగు రాష్ట్రాల్లో తొలి, దేశంలో రెండో మహిళా సినిమాటోగ్రాఫర్ నేనే. పలు భారతీయ చిత్రాలతో పాటు తెలుగులో రాజశేఖర్ నటించిన 'విలన్', జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'సుబ్బు', వడ్డే నవీన్ నటించిన 'ధనుష్', విజయశాంతి నటించిన 'శివాని'.. తదితర సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశాను. ఒక్క రోజులోనే తెరకెక్కి.. గిన్నీస్ రికార్డు సాధించిన 'స్వయంవరం' అనే తమిళ సినిమాలో భాగమయ్యాను. పాతికేళ్ల నా కెరీర్‌లో నమ్మకమే నన్ను ముందుకు నడిపిస్తోంది. ఎన్ని కష్టాలు వచ్చినా ఆగిపోలేదు. నిరాశ పడలేదు. కొత్తగా ఆలోచిస్తా. ప్రయత్నిస్తా. నిరంతరం అప్‌డేట్ అవుతుంటా. బ్లాక్ అండ్ వైట్, కలర్, డిజిటల్.. మూడు తరాలతో పనిచేసిన అనుభవం సంపాదించా.



- విజయ శ్రీ (సినిమాటోగ్రాఫర్)

సవాల్‌ను స్వీకరిస్తూ సాగిపోవాలి

ఇండస్ట్రీలో ఎవరూ ఎవరికీ సపోర్ట్ చేయరు. ఎవరి ప్రతిభ వారికి రక్ష. సత్తానే ముందుకు నడిపిస్తుంది. ప్రతి సవాల్‌ను స్వీకరిస్తూ ముందుకు సాగిపోవాలి. ఎవరైనా మనల్ని ఏదైనా పని చేయలేవు అని అంటే, కచ్చితంగా చేసి చూపించాలి. మా నాన్న రౌతు రవి రచయిత. ఆయన ద్వారానే నాకు రచనపై మక్కువ ఏర్పడింది. నిత్యామీనన్ నటించిన 'కుమారి శ్రీమతి' వెబ్ సిరీస్‌తో పాటు కొన్ని సినిమాలకు పాటలన్నీ నేనే రాశాను. ఇప్పటివరకూ 70 సినిమాల్లో 200 పాటలు రాశాను. చిన్నప్పటి నుంచి మణిశర్మ అంటే చాలా ఇష్టం. నేను రాసిన ఓ పాటను ఆయన మెచ్చుకోవడం నాకు దక్కిన అతి పెద్ద ప్రశంస. సాయిదుర్గాతేజ్, స్వాతి నటించిన 'సత్య' అనే లఘు చిత్రానికి సంభాషణలు రాశా. ప్రస్తుతం 'మహేంద్రగిరి వారాహి' చిత్రంతో పాటు మరికొన్ని సినిమాలకు పాటలు రాస్తున్నా. భవిష్యత్తులో దర్శకురాలిగా మారాలనే ఆలోచన ఉంది.



- కడలి రౌతు (గీత రచయిత్రి)

ఆ విధానంలో మార్పు రావాలి



సాధారణ కుటుంబం నుంచి వచ్చాను. మా వారికి దర్శకుడు అవ్వాలనే కోరిక ఉండేది. ఆయన కోసమని ప్రొడక్షన్‌లో అడుగు పెట్టాను. నిర్మాతగా నా మొదటి చిత్రం 'లక్కీ లక్ష్మణ్'. ఈ ప్రయాణంలో దర్శకత్వం వైపూ ఆసక్తి కలిగింది. దాంతో నా దర్శకత్వంలో 'ఫియర్' చిత్రం రూపుదిద్దుకుంది. డబ్బులు ఉంటే సినిమా తీయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, పూర్తయిన సినిమాను మార్కెట్ చేయడం పెద్ద సవాలుగా అనిపించింది. ఎవరి వద్దకు వెళ్లినా.. బ్యానర్ ఎవరిది? సినిమా తీసింది ఎవరు? డైరెక్టర్ ఎవరు, వారి బ్యాగ్రౌండ్ ఏంటి వంటి అంశాలనే చూస్తున్నారు కానీ కంటెంట్‌ను పట్టించుకోవడం లేదు. ఈ విధానంలో మార్పు రావాలి. తన ప్రొడక్ట్‌ని అమ్ముకుంటేనే కదా నిర్మాతకు లాభం వచ్చేది. ప్రొడ్యూసర్ బావుంటేనే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ మూడేళ్ల ప్రయాణంలో ఇదే నాకు అర్థమైంది. నా చిన్ననాటి నుంచే ఎన్నో ఇబ్బందులు అనుభవించా. అప్పుడు ఆదుకున్న వారు ఎవరూ లేరు. అందుకే ఎవరైనా సాయం కోరితే నాకు తోచింది చేయాలని నిర్ణయించుకున్నా. ఒక వైపు సినిమాలు చేస్తూనే సొసైటీకి సేవ చేయాలనేది నా లక్ష్యం. ముఖ్యంగా మహిళా సాధికారతకు నా వంతు కృషి చేస్తున్నా.

- హరిత గోగినేని (దర్శకురాలు)

వద్దన్న వాళ్లే ప్రశంసించారు



చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తి ఉంది. తెలిసినవాళ్ల ద్వారా ఒక సినిమాకు పనిచేసే అవకాశం వచ్చింది.. కానీ ప్రొడక్షన్ విభాగంలో. అక్కడ అన్ని విభాగాలను చక్కగా సమన్వయం చేస్తూ పనిచేయడం చూసి, 'ఇండస్ట్రీలో మహిళా మేనేజర్లు లేరు. నువ్వు ప్రయత్నం చేయవచ్చు కదా' అన్నారు. అలా మొదట్లో కొన్ని చిన్న సినిమాలకు పనిచేశాను. ప్రొడక్షన్ యూనియన్‌లో సభ్యత్వం ఉంటే అవకాశాల కోసం ప్రయత్నించవచ్చు అని అనుకున్నాను. కానీ అమ్మాయిలకు రక్షణ ఇవ్వలేమంటూ సభ్యత్వం ఇచ్చేందుకు తిరస్కరించారు. మీ సంస్థ నియమావళిలో మహిళలకు సభ్యత్వం ఇవ్వకూడదని ఉందా? అని ప్రశ్నించి, పోరాడి యూనియన్ కార్డ్ సాధించుకున్నాను. ఆ తర్వాత ఇండస్ట్రీలో అవకాశాల కోసం పెద్ద నిర్మాణసంస్థల దగ్గరకు వెళితే 'మహిళలు ప్రొడక్షన్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించలేరు' అన్నారు. ఇండస్ట్రీలో తొలి మహిళా ప్రొడక్షన్ మేనేజర్‌గా ఎదిగాను. సొంతంగా ప్రొడక్షన్ హౌస్ స్థాపించి, పదిమందికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదిగాను. వద్దన్నవాళ్ల ప్రొడక్షన్‌లోనే మేనేజర్‌గా పని చేసి, వాళ్లతోనే శభాష్ అనిపించుకున్నాను. ఇక్కడ రాత్రికి రాత్రే ఎవరూ గొప్పవాళ్లు కాలేరు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నించే అమ్మాయిలపై రాళ్లేసేవాళ్లే ఎక్కువ. వాటిని పూలబాటగా మార్చుకొని ప్రయాణం కొనసాగిస్తే విజయం తథ్యం.

- దీప్తి (ప్రొడక్షన్ మేనేజర్)

వీరు సైతం...





- ఎస్ఎస్ రాజమౌళి భార్య రమా రాజమౌళి చలన చిత్ర రంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు. స్టూడెంట్ నం.1 సినిమా ద్వారా ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. మగధీర, ఈగ, బాహుబలి-1, బాహుబలి-2, ఆర్ఆర్ఆర్ సినిమాలకు పనిచేశారు.
- దర్శకుడు త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నృత్య కళాకారిణి. నిర్మాతగా కూడా పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. 'సార్, లక్కీ భాస్కర్, డాకు మహారాజ్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు ఆమె నిర్మాతగా వ్యవహరించారు.
- కోన వెంకట్ సోదరి కోన నీరజ 'గుండె జారి గల్లంతయ్యిందే' సినిమాలో తొలిసారిగా హీరో నితిన్‌కు స్టైలిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె పలు విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు. సమంతకు వ్యక్తిగత స్టైలిస్ట్‌గా కూడా వ్యవహరించారు. ప్రస్తుతం 'తెలుసు కదా' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.
- శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన అనేక సినిమాలకు రూపా వైట్ల కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు.
- డైరెక్టర్ సుకుమార్ భార్య తబితా కూడా చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. ఇటీవలె విడుదలైన 'గాంధీ తాత చెట్టు' సినిమా నిర్మాణంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.
- దర్శకుడు వైవీఎస్ చౌదరి భార్య గీతా చౌదరి నిర్మాతగా మారారు. జానకిరామ్ తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ ఓ సినిమా తీస్తున్నారు.



నా పాట నలుగురూ పాడుకునేలా ఉండాలి

సినీ పరిశ్రమలో మహిళల సంఖ్య తక్కువ. అందులోనూ గీత రచయిత్రిలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. అలాంటిది వరుస సినిమాల్లో అవకాశం రావటం నా కష్టానికి తగిన ప్రతిఫలంగా భావిస్తున్నా. ఎనిమిదో తరగతి చదివేటప్పుడు కవిత్వం రాయడం అలవాటైంది. ఉద్యోగం చేసే సమయంలో నేను రాసిన కవితలను సోషల్‌మీడియాలో షేర్ చేయడం మొదలుపెట్టాను. వాటి ద్వారా నాకు తొలి అవకాశం వచ్చింది. నేను రాసిన రెండో పాట 'వందేమాతరం' (ప్రైవేట్ ఆల్బమ్) ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంగారు పాడటం.. నేను రాసిన ఓ పాట విని నటి గౌతమిగారు ఫోన్ చేసి అభినందించడం మరిచిపోలేని అనుభూతులు. ఇండస్ట్రీకి రావడానికి స్ఫూర్తినిచ్చిన వారు లేరు. కానీ పరిశ్రమలో నాకు దిశానిర్ధేశం చేసేవాళ్లు చాలా మంది ఉన్నారు. గీత రచయితగా ప్రత్యేక లక్ష్యాలంటూ ఏమీ లేవు. నా వర్క్ అందరికీ చేరితే చాలు. నా పాట నలుగురు పాడుకునేలా ఉంటే చాలు. ఇప్పటివరకూ 70 సినిమాల్లో 100 పాటలు రాశాను. 'మా నాన్న సూపర్ హీరో' చిత్రంలో 'నాన్నా', 'గామి'లో 'అరిరారో' అనే లాలిపాట', 'హ్యాష్‌ట్యాగ్ నైన్టీస్' లోని 'మనసు మంగళం.. ప్రేమ మంగళం', 'కాలింగ్ సహస్ర'లోని 'కలా నిజమా', 'హీరామండీ' వెబ్ సిరీస్‌లోని 'మనసారా నను లాగిపోకే' వంటి పాటలతో మంచి గుర్తింపు వచ్చింది" అని గీత రచయిత లక్ష్మీప్రియాంక పులవర్తి చెప్పారు.

- లక్ష్మీప్రియాంక (గీత రచయిత)

మల్టీప్లెక్స్‌లోనూ రూ.200లోపే సినిమా టికెట్!

» సినీ పరిశ్రమకు కర్ణాటక సర్కార్ షాక్

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సినిమా రంగానికి కర్ణాటక ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. సినిమా టికెట్ ధర రూ.200కు మించరాదని సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ప్రకటించారు. మల్టీప్లెక్స్‌లు సహా రాష్ట్రమంతటా అన్ని థియేటర్లలో ఈ మేరకు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కన్నడ సినిమాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ఓటీటీ వేదికను ప్రారంభించనున్నట్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆయన తెలిపారు. సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. కన్నడ సినిమారంగానికి, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ నేపథ్యంలో టికెట్ చార్జీలకు సీలింగ్ విధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సిరియాలో ఘర్షణలు..70 మందికి పైగా మృతి

డమాస్కస్/లటాకియా, మార్చి 7: రాజకీయ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న సిరియాలో ఘర్షణలు చెలరేగాయి. తీర ప్రాంతంలో ప్రభుత్వ బలగాలు, మాజీ అధ్యక్షుడు బషర్ అసద్ మద్దతుదారుల మధ్య జరిగిన కాల్పుల్లో 70 మందికి పైగా మరణించారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయని, 35 మంది ప్రభుత్వ బలగాల సభ్యులు, 32 మంది అసద్ మద్దతు సాయుధులు, నలుగురు పౌరులు మరణించారని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. తీర పట్టణాలైన బనియాస్, జబ్లే శివారు ప్రాంతాలు ఇంకా అసద్ మద్దతుదారుల నియంత్రణలోనే ఉన్నాయి. జబ్లే పట్టణ సమీపంలో ఒక వాంటెడ్ వ్యక్తిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించినప్పుడు.. అసద్ మద్దతుదారులు మెరుపుదాడి చేయడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

రాణా పిటిషన్‌ను కొట్టేసిన అమెరికా సుప్రీంకోర్టు

న్యూయార్క్, మార్చి 7: తనను భారత్‌కు అప్పగించవద్దంటూ ముంబై దాడుల కేసులో కీలక నిందితుడు తహవూర్ రాణా వేసిన అత్యవసర పిటిషన్‌ను పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాణా దరఖాస్తును జస్టిస్ ఎలెనా కగేన్ తిరస్కరించారని న్యాయస్థానం వెబ్‌సైట్‌లో గురువారం అప్‌లోడ్ అయిన నోట్ పేర్కొన్నారు. అయితే, రాణా మళ్లీ అదే అభ్యర్థనతో చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్‌కు మరో పిటిషన్‌ను సమర్పించాడు. తనను భారత్‌కు అప్పగించడంపై స్టే విధించాలని కోరాడు. తహవూర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. ప్రస్తుతం అతన్ని లాస్ ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటిన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు.

ఈ చివరి క్షణంలోనూ నీపై ప్రేమే..

» సూసైడ్ నోట్ రాసి మరో భార్యా బాధితుడి ఆత్మహత్య

ముంబై, మార్చి 7: భార్య వేధింపులు తాళలేక ముంబైలో మరో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బాలీవుడ్‌లో యానిమేటర్‌గా పనిచేసే నిశాంత్ త్రిపాఠి (41) విలే పార్లేలోని ఓ హోటల్‌లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మరణానికి ముందు అతడు రాసిన సూసైడ్ నోట్‌ను తను పనిచేసే కంపెనీ వెబ్‌సైట్‌కు పంపాడు. ఆ నోట్‌లో తన భార్య అపూర్వ పారిఖ్‌పై ఎనలేని ప్రేమను వ్యక్తం చేశాడు. "నువ్వు ఈ లేఖ చదివే సమయానికి నేను ఉండను. ఇప్పటి వరకు నువ్వు వేధించిన దానికి ఈ చివరి క్షణాల్లో నిన్ను నేను అసహ్యించుకోవాలి. కానీ నేను అలా చేయలేను. ఈ చివరి క్షణాల్లోనూ నీపైన ప్రేమే ఉంది. అది ఎన్నటికీ చెరిగిపోదు. నా చావుకు నువ్వు, నీ బంధువు ప్రార్థన మిశ్రా కారణం" అని లేఖలో రాశాడు. మహిళా హక్కుల కార్యకర్త అయిన నిశాంత్ తల్లి నీలమ్ చతుర్వేది ఫిర్యాదు మేరకు పోలీసులు అపూర్వ, ప్రార్థన మిశ్రాలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వీడ్కోలు సభలో కెనడా ప్రధాని ట్రూడో కంట నీరు



అట్టావా, మార్చి 7: కెనడా ప్రధానిగా బాధ్యతల నుంచి తప్పుకొన్న జస్టిన్ ట్రూడో... వీడ్కోలు సమావేశంలో భావోద్వేగానికి లోనయి కన్నీటిపర్యంతమయ్యారు. కెనడా వాసులను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి రోజూ కృషి చేశానని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను విమర్శిస్తూ 'అంతర్జాతీయ సంబంధాలంటే రియల్ ఎస్టేట్ డీల్స్ కాదని వ్యాఖ్యానించారు.. లిబరల్ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, ప్రజాదరణ రేటింగ్స్ తగ్గిపోవడంతో ట్రూడో జనవరి నెలలో ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఇంతవరకు ఆపద్ధర్మ ప్రధానిగా విధులు నిర్వరిస్తున్నారు. పదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉండడం గమనార్హం. ఆదివారం లిబరల్ పార్టీ కొత్త ప్రధానిని ఎన్నుకోనున్న నేపథ్యంలో గురువారం ట్రూడోకు వీడ్కోలు పలికారు. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై అనుసరిస్తున్న వైఖరి నేపథ్యంలో ట్రూడో చేసిన ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకొంది. కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా మార్చుతామని, ట్రూడో గవర్నర్ అవుతారని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. కెనడాపై 25% ప్రతీకార సంకం కూడా విధించారు.

నియోజకవర్గాల పునర్విభజనపై

చర్చిద్దాం రండి



రేవంత్ సహా 7 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ ఆహ్వానం

» 29 పార్టీల అధినేతలకు కూడా

» 22న చెన్నైలో సమావేశం

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 29 పార్టీల అధినేతలకు ఆహ్వానం పంపారు. ఇటీవల నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానం మేరకు ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న చెన్నైలో సమావేశం తలపెట్టారు. దీనికి రావాలని కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబు, కేరళ సీఎం విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, పశ్చిమబెంగాల్ సీఎం మమత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఒడిసా సీఎం మోహన్‌చంద్ర మాఝీలకు ఆహ్వాన లేఖలు పంపించారు. ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటుకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆమోదం తెలపాలని, అదే సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన రాజకీయపార్టీలు ఈ కమిటీలో తమ తరఫున ప్రతినిధులను సభ్యులుగా నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించబోయే నియోజకవర్గాల పునర్విభజన ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమైందని, ఈ వ్యవహారాన్ని రాజకీయపరంగా, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2021లో జరగాల్సిన జనగణన ఆలస్యం కావడంతో నియోజకవర్గాల పునర్విభజన.. 2031లో జరగనున్న జన గణన ప్రకారం జరుగుతుందని భావించామని, అయితే అంతకంటే ముందే పునర్విభజన చేపట్టనుండడంతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లడం ఖాయమని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు తీరని నష్టం కలుగుతుందన్నారు. పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, అయితే అప్రజాస్వామికంగా చేపడుతున్న పునర్విభజననే వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. "జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించినందుకు మనకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చోకూడదు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ లేఖ రాసినవారిలో మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం జగన్, పుదుచ్చేరి సీఎం ఎన్. రంగస్వామి, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు. వీరితో పాటు కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిసా, పంజాబ్, తదితర రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నేతలకు కూడా స్టాలిన్ లేఖలు రాశారు.

వచ్చే ఏడాది ఎన్నికలు


తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన అంశాలపై సీఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. హిందీని బలవంతంగా రుద్దుతున్నారని పేర్కొంటూ ఇటీవల కాలంలో కేంద్రంపై నిప్పులు చెరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా స్టాలిన్ పోరాటం ప్రారంభించారు. జనాభా నియంత్రణను పాటించిన రాష్ట్రాలకు ఈ పునర్విభజన ద్వారా నష్టం కలుగుతుందని, అదేసమయంలో జనాభా నియంత్రణను పట్టించుకోని బీజేపీ పాలిత ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ప్రాంతీయ భాషలకూ కేంద్రం ప్రాధాన్యం

మెడికల్, ఇంజనీరింగ్ పాఠాలు తమిళంలోకి అనువదించాలని స్టాలిన్‌కు చెబుతున్నా: షా

చెన్నై, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం కల్పిస్తోందని, మోదీ అధికారంలోకి వచ్చాకే సీఐఎస్ఎఫ్ ఎంపిక పరీక్షలు తమిళం సహా ఇతర ప్రాంతీయ భాషల్లో రాసే సదుపాయం కల్పించారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. తమిళనాడులోని రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని తక్కోలం వద్దనున్న రాజాధిత్య చోళన్ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) శిక్షణా కేంద్రంలో శుక్రవారం జరిగిన 56వ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన పదిమందికి రాష్ట్రపతి పతకాలు, ఇరువురికి జీవన్ రక్షా పతకాలు, 10 మందికి ప్రత్యేక పతకాలను ప్రదానం చేశారు. అనంతరం అమిత్‌షా ప్రసంగిస్తూ.. మెడికల్, ఇంజనీరింగ్ కోర్సుల పాఠ్యాంశాలను తమిళంలో అనువదించాలని, అది తమిళ మాధ్యమ విద్యార్థులకు సులభంగా ఉంటుందని గత రెండేళ్లుగా తమిళనాడు సీఎం స్టాలిన్‌కు తాను ప్రతిపాదిస్తూనే ఉన్నానని తెలిపారు. ప్రధాని మోదీ తమిళ భాషకు, తమిళ సంస్కృతీ సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. భారతీయ సంస్కృతిని తమిళ సంస్కృతి మరింత పటిష్ఠం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ కోటిమంది పౌరులకు సీఐఎస్ఎఫ్ పటిష్ఠమైన భద్రతను కల్పిస్తుండటం హర్షణీయమన్నారు. సీఐఎస్ఎఫ్ ప్రాంతీయ శిక్షణా కేంద్రానికి చోళవంశీయుడైన రాజాధిత్య చోళుడి పేరు పెట్టడం అన్ని విధాలా ప్రశంసనీయమని చెప్పారు. సీఐఎస్ఎఫ్‌లో ఈ యేడాది లక్షమందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు.

లోకం తీరు



2050కల్లా 44 కోట్ల మందికి ఊబకాయం

బరువు తగ్గడంపై ప్రజలు దృష్టి పెట్టాలి:మోదీ

సిల్వస, మార్చి 7: జీవనశైలి కారణంగా వచ్చే వ్యాధులు మన ఆరోగ్యానికి పెను ముప్పుగా పరిణవిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందులో ఊబకాయం ఒకటని, అనేక జబ్బులకు ఇదే మూలకారణమని చెప్పారు. ఇటీవల విడుదలైన ఒక సర్వే ప్రకారం మన దేశంలో 2050 నాటికి 44 కోట్ల మంది ప్రజలు ఊబకాయ సమస్య బారిన పడే అవకాశం ఉందని మోదీ తెలిపారు. శుక్రవారం ఆయన కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీలోని సిల్వస పట్టణంలో రూ.2,587 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. ఊబకాయం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలన్నారు. బరువు తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించాలని తాను ఇప్పటికే ప్రజలకు విజ్ఞప్తి చేశానన్నారు. అందరూ 10 శాతం తక్కువగా వంట నూనెలను కొనుగోలు చేస్తామని ప్రతినబూనాలని కోరారు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం, సైక్లింగ్ చేయాలని చెప్పారు.

సుంకాల తగ్గింపునకు భారత్ ఒప్పుకొంది

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

» ఎలాంటి వ్యాఖ్య చేయని విదేశీ వ్యవహారాల శాఖ



వాషింగ్టన్, మార్చి 7: అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. వారు ఇంతవరకు చేసినదాన్ని ఇప్పుడు ఎవరో ఒకరు బయటపెడుతున్నందున పన్నులు తగ్గింపునకు అంగీకరించారని వ్యాఖ్యానించారు. అయితే భారత విదేశీ వ్యవహారాల శాఖ మాత్రం దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయకపోవడం గమనార్హం. ట్రంప్ ప్రకటన మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. రానున్న కొద్ది నెలల్లో వాహనాల తయారీ సంస్థ అయిన టెస్లా భారత్ మార్కెట్‌లో ప్రవేశించనుంది. టెస్లా వాహనాలపై భారత్ ప్రస్తుతం 110% దిగుమతి సుంకం విధిస్తోంది. మరోవైపు, కెనడా వస్తువులు అమెరికాకు అవసరం లేదని ట్రంప్ చెప్పారు. కెనడా నుంచి కలపను దిగుమతి చేసుకోబోమని, అమెరికా అడవుల్లోని కలపను ఉపయోగించుకుంటామని తెలిపారు. అమెరికా పాల ఉత్పత్తులపై కెనడా 220 శాతం సుంకం విధిస్తుండడాన్ని తప్పుపట్టారు. రష్యాపైనా బ్యాంకింగ్ ఆంక్షలు, సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్‌తో చర్చలు జరిపి, కాల్పులు విరమించే వరకు ఇవి కొనసాగుతాయని తెలిపారు. అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి లేఖ రాసినట్టు తెలిపారు.

చిన్న కత్తి చాలు.. గొడ్డలెందుకు

'ఆపరేషన్లు చేసే చిన్న కత్తి చాలు.. చిన్న గొడ్డలి ఎందుకు?' అంటూ తన సలహాదారు ఎలాన్ మస్క్‌కు ట్రంప్ సూచించారు. డోజ్ సారథిగా మస్క్... ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను, వ్యయాన్ని భారీగా తగ్గిస్తుండడంతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డోజ్ అద్భుతంగా పనిచేస్తోందని ప్రశంసిస్తూనే.. ప్రభుత్వ విభాగాలకు కార్యదర్శులే తప్ప మస్క్ అధిపతి కాదని స్పష్టం చేశారు. సిబ్బందిని తగ్గించాలని ఆయన సిఫార్సు చేసినా, పూర్తిగా అమలు చేయాల్సిన పనిలేదని కూడా తెలిపారు.

భారత్-చైనా భాయీ భాయీ!

» ఇరు దేశాలు చేతులు కలిపితే ప్రపంచ ప్రజాస్వామ్యం బలోపేతం

» ఏనుగు, డ్రాగన్ కలిసి డ్యాన్స్ చేయాలి

» చైనా విదేశాంగమంత్రి వాంగ్ ఈ



బీజింగ్, మార్చి 7: భారత్-చైనా చేతులు కలిపితే అంతర్జాతీయంగా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని, ప్రపంచ దక్షిణాది దేశాలు శక్తిమంతమవుతాయని చైనా విదేశాంగమంత్రి వాంగ్ ఈ పేర్కొన్నారు. నియంతృత్వం, దౌర్జన్య రాజకీయాలకు వ్యతిరేకంగా ఈ రెండు దేశాలూ అగ్రగామి పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పరోక్షంగా అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చైనా పార్లమెంటు వార్షిక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాంగ్ శుక్రవారం దేశ, విదేశ మీడియా ప్రతినిధులతో పలు అంశాలపై మాట్లాడారు. భారత్ చిహ్నమైన ఏనుగును, చైనా చిహ్నమైన డ్రాగన్‌ను ప్రస్తావిస్తూ.. 'ఏనుగు, డ్రాగన్ కలిసి నాట్యం చేయటమే భారత్-చైనా సంబంధాలకు సరైన మార్గం. ఒకరికొకరికి నష్టం చేసుకోవటం కంటే పరస్పరం సహకరించుకోవాలి. ఒకరి మీద ఒకరం నిఘా పెట్టుకోవటం కంటే.. చేతులు కలిపి సమిష్టిగా పని చేయాలి. దీనివల్లే మన రెండు దేశాలకూ లబ్ధి చేకూరుతుంది' అని వాంగ్ తెలిపారు. ప్రాచీన నాగరికతలకు నిలయమైన ఇరుదేశాలూ సరిహద్దు సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని వాంగ్ చెప్పారు. ఈ ఏడాది భారత్-చైనా దౌత్య సంబంధాలు 75వ వార్షికోత్సవాన్ని జరుపుకొంటాయని గుర్తు చేస్తూ.. గత సుదీర్ఘ అనుభవాల నేపథ్యంలో కొత్త ప్రణాళికలు రచించి ఇరుదేశాల సుస్థిర అభివృద్ధి కోసం భారత్‌తో కలిసి పని చేయటానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. చైనాతోపాటు పలు దేశాలపై విధిస్తున్న సుంకాలపై తీవ్రంగా స్పందిస్తూ.. అంతర్జాతీయ సహకారాన్ని పక్కనపెట్టి, ఏ దేశానికి ఆ దేశం సొంత ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తే ప్రపంచం ఆటవికరాజ్యంగా మారుతుందని వాంగ్ వ్యాఖ్యానించారు. చిన్న, బలహీన దేశాలు తొలుత తీవ్రంగా నష్టపోతాయి.. అంతర్జాతీయ నిబంధనలు, వ్యవస్థలు ధ్వంసమవుతాయని హెచ్చరించారు.

తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



తుర్లపాటి రాజేశ్వరి

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ప్రముఖ ఒడియా రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గోపీనాథ్ మహంతి రచించిన 'దాడీ బుఢా' అనే నవలను 'ఈతచెట్టు దేవుడు' పేరిట తెలుగులోకి అనువదించినందుకు తుర్లపాటిని ఈ పురస్కారం వరించింది. ఒడిశాలోని బరంపురంలో నివసిస్తున్న రాజేశ్వరి అనేక రచనలను ఒడియా నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. స్వతంత్ర రచనలూ చేశారు. గతంలో అనేక పురస్కారాలను ఆమె స్వీకరించారు. కాగా తెలుగుతోపాటు 21 భాషల్లో అనువాద పురస్కారాలను శుక్రవారం కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రకటించారు. తెలుగు అనువాద పురస్కారాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించిన న్యాయనిర్ణేతల్లో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు, ప్రముఖ రచయితలు దాసరి అమరేంద్ర, గుడిపాటి వేంకటేశ్వర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో డీఎస్పీ మృతి

కుకునూరుపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న హోర్డింగ్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ డీఎస్పీ మృతి చెందారు. ఈ దుర్ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. డీఎస్పీ జవహర్(50) మేడ్చల్‌లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం నంగునూరు మండలం రాజగోపాల్‌పేటలో గల పోలీస్ ఫైరింగ్ రేంజ్‌కి వెళ్లారు. తిరుగు ప్రయాణంలోచిన్నకిష్టాపూర్ క్రాస్ రోడ్ వద్దకు చేరుకున్న సమయంలో అకస్మాత్తుగా ఓ వాహనం రహదారిపై రావడంతో దానిని తప్పించబోయి డీఎస్పీ కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. దాంతో కారు రోడ్డు పక్కనే ఉన్న హోర్డింగ్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డీఎస్పీ జవహర్‌కు లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

» అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో 65 మంది ఎంపిక

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లకు నారాయణ విద్యా సంస్థలకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణ వెల్లడించారు. హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, భారత ప్రభుత్వం సంయుక్తంగా ఈ ఎంపికలు నిర్వహిస్తోందని వారు తెలిపారు. ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌లో.. ఆస్ట్రానమి క్యాంప్‌కు 14 మంది, ఫిజిక్స్, జూనియర్ సైన్స్ క్యాంప్‌లకు 9 మంది చొప్పున, జూనియర్ ఆస్ట్రానమి, కెమిస్ట్రీ, బయాలజీ క్యాంపులకు ఏడుగురు చొప్పున విద్యార్థులు, ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. తమ విద్యాసంస్థల నుంచే 65 మంది ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విజయం సాధించిన విద్యార్థులను ఈడీ పునీత్ అభినందించారు.


ఎకరా టార్గెట్ 100 కోట్లు!

వేలం భూముల ధర పెంపునకు మౌలిక సదుపాయాల కల్పన

» గచ్చిబౌలిలోని ఐఐఐటీ నుంచి ఓఆర్ఆర్ దగ్గర్లోని జీఏఆర్ వరకూ

» 5 కిలోమీటర్ల మేర 6 వరుసల్లో ఫ్లై ఓవర్ లేదా ఎలివేటెడ్ కారిడార్

» డీపీఆర్, సాధ్యాసాధ్యాల నివేదికకు టెండర్లు ఆహ్వానించిన టీజీఐఐసీ



ఐఐఐటీ జంక్షన్ నుంచి ఓఆర్ఆర్ వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్న మార్గం ఇదే

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐఐఐటీ) జంక్షన్ నుంచి ఔటర్ రింగు రోడ్డు (ఎగ్జిట్ నంబర్ 1)కు దగ్గర్లో ఉన్న జీఏఆర్ రోటరీ వరకు 5 కిలోమీటర్ల మేర ఫ్లై ఓవర్ నిర్మించాలని సర్కారు భావిస్తోంది. కనీసం ఆరు వరుసలతో దీనిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు, అప్రోచ్ రోడ్లు, జంక్షన్లు, వీధి లైట్లు, డ్రైనేజీ, పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్, పార్కింగ్, ఇతర మౌలిక వసతులను కల్పించనుంది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)తోపాటు, మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్న సాధ్యాసాధ్యాలను తెలుసుకునేందుకు ఫీజిబులిటీ రిపోర్టును తయారు చేసేందుకు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) ఏజెన్సీల నుంచి శుక్రవారం టెండర్లను ఆహ్వానించింది. ఇందుకు కారణం లేకపోలేదు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25 (పి) పరిధిలోని 400 ఎకరాలను వేలం వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రియల్ ఎస్టేట్ పరంగా ఇప్పటికే ఈ ప్రాంతం హాట్ కేక్. ఇక్కడి భూమిని తొలుత ఒక్కో ఎకరం రూ.75 కోట్లకు విక్రయించాలని సర్కారు భావించింది. అయితే, మౌలిక సదుపాయాలను కల్పిస్తే భూముల ధర పెరిగే అవకాశం ఉందని, తద్వారా ఎకరం కనీసం రూ.100 కోట్లకు తగ్గకుండా ధర పలుకుతుందనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో కోకాపేట ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం ఆర్థిక వనరుల సమీకరణ కోసం భూములను వేలం వేసిన విషయం తెలిసిందే. అప్పట్లో అక్కడ ఎకరం రూ.100 కోట్లకుపైగా పలికింది. ఇందుకు కారణం అక్కడున్న మౌలిక సదుపాయాలే. ఈ నేపథ్యంలోనే, కంచ గచ్చిబౌలి పరిధిలో వేలం వేయబోయే భూముల చుట్టూ వివిధ రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ ప్రాంతంలో మెట్రో రైల్‌ను విస్తరించినా.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా 5 కిలోమీటర్ల మేర కనెక్టివిటీని అందుబాటులోకి తీసుకు రావాలని భావిస్తోంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆన్‌లైన్‌లో టీజీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది. వీటి దాఖలుకు మార్చి 28 మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఇచ్చింది. అదే రోజు సాయంత్రం సాంకేతిక బిడ్లను తెరవనున్నట్టు టెండర్ నోటీస్‌లో పేర్కొంది. మొత్తం 5 కిలోమీటర్ల మేర ఫ్లై ఓవర్, జంక్షన్లు, అప్రోచ్ రోడ్లను నిర్మించనుండగా.. డీపీఆర్ రిపోర్టు వచ్చాక దీనికి ఎంత ఖర్చవుతుందనే అంశంపై స్పష్టతరానుంది.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని..

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఐఐఐటీ-ఓఆర్ఆర్ మార్గంలో పలు రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్ నోటీసులో ఇచ్చిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌లో (ఆర్ఎఫ్‌పీ) పొందుపర్చింది. రాబోయే 15, 20 ఏళ్లలో పెరిగే ట్రాఫిక్‌తోపాటు జనసాంద్రత, కాలుష్యం ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని వీటిని కల్పించనున్నారు. హైదరాబాద్‌వాసులు ఇప్పటికే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. అభివృద్ధి చెందుతున్న కంచ గచ్చిబౌలిలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా సర్కారు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఓఆర్ఆర్- ఐఐఐటీ మధ్య ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ రెండు జంక్షన్లు ఉన్నా.. ట్రాఫిక్ రద్దీ తగ్గడం లేదు. దీనికి విరుగుడుగా ఫ్లై ఓవర్ లేదా ఎలివేటెడ్ కారిడార్ లేదా అండర్ పాస్‌లను నిర్మించాలని భావిస్తోంది. వీటిలో దేనిని నిర్మించాలి? ఏదైతే ట్రాఫిక్ రద్దీ తగ్గేందుకు అవకాశం ఉంటుందనే దానిపై డీపీఆర్‌లో ఇవ్వాలని సూచించింది. మౌలిక సదుపాయాల కల్పనతో ఒక్కో ఎకరం ధర తొలుత భావించిన దానికంటే అదనంగా పెరిగితే.. సర్కారు ఖజానాకు వేలం ద్వారా వచ్చే రాబడి కూడా పెరుగుతుందని భావిస్తోంది.

సీఐడీ ఐజీగా శ్రీనివాసులు

» అదనపు డీజీ(పర్సనల్)గా అనిల్‌కుమార్

» రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల్లో ఒక అదనపు డీజీ, ఇద్దరు ఐజీలు, ఇద్దరు డీఐజీలు, 14మంది ఐపీఎస్‌లు, ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు ఉన్నారు. ఈ సారి ఐపీఎస్ అధికారుల పనితీరు ఆధారంగా ఆచితూచి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో వైపు పనిభారంతో సతమతమవుతున్న సీనియర్ ఐపీఎస్ అధికారులకు స్వల్ప ఊరట కలిగించేలా ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. అదనపు డీజీ పర్సనల్, లా అండ్ ఆర్డర్ విభాగాలను పర్యవేక్షిస్తున్న మహేష్ భగవత్‌కు పని భారం తగ్గిస్తూ.. అదనపు డీజీ పర్సనల్‌గా అనిల్ కుమార్‌ను నియమించింది. వాస్తవానికి అనిల్ కుమార్ ప్రస్తుతం ఎస్పీఎఫ్ డీజీగా కొనసాగుతున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అదనంగా ఎస్పీఎఫ్ బాధ్యతలు కూడా పర్యవేక్షించాలని ఆయన్ను ఆదేశించింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
అనిల్‌కుమార్	ఎస్పీఎఫ్ డీజీ	అదనపు డీజీ(పర్సనల్), ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు
ఎం.శ్రీనివాసులు	రామగుండం సీపీ	సీఐడీ ఐజీ
అంబర్ కిషోర్ ఝా	వరంగల్ సీపీ	రామగుండం సీపీ
సన్‌ప్రీత్ సింగ్	సూర్యాపేట ఎస్పీ	వరంగల్ సీపీ
చేతన	పెద్దపల్లి డీసీపీ	మహిళా భద్రత విభాగం ఎస్పీ
సింధూశర్మ	కామారెడ్డి ఎస్పీ	ఇంటెలిజెన్స్ ఎస్పీ
రాజేష్ చంద్ర	యాదాద్రి డీసీపీ	కామారెడ్డి ఎస్పీ
పి.సాయిచైతన్య	యాంటీ నార్కోటిక్స్ ఎస్పీ	నిజామాబాద్ సీపీ
గౌస్ ఆలం	ఆదిలాబాద్ ఎస్పీ	కరీంనగర్ సీపీ
అఖిల్ మహాజన్	సిరిసిల్ల ఎస్పీ	ఆదిలాబాద్ ఎస్పీ
చెన్నూరి రూపేష్	సంగారెడ్డి ఎస్పీ	యాంటీ నార్కోటిక్స్ ఎస్పీ
అక్షాంశ్ యాదవ్	సెంట్రల్‌జోన్ డీసీపీ	భువనగిరి డీసీపీ
పరితోష్ పంకజ్	కొత్తగూడెం ఓఎస్డీ	సంగారెడ్డి ఎస్పీ
జి.మహేశ్ బాబాసాహెబ్	ములుగు ఓఎస్డీ	సిరిసిల్ల ఎస్పీ
అంకిత్ కుమార్	వెయిటింగ్	వరంగల్ ఈస్ట్ డీసీపీ
ఎ.భాస్కర్	వెయిటింగ్	మంచిర్యాల డీసీపీ
కె.నర్సింహ	వెయిటింగ్	సూర్యాపేట ఎస్పీ
కే.శిల్పవల్లి	వెయిటింగ్	సెంట్రల్‌జోన్ డీసీపీ
వై.సాయి శేఖర్	వెయిటింగ్	ఎస్ఐబీ ఎస్పీ
పి.కరుణాకర్	వెయిటింగ్	పెద్దపల్లి డీసీపీ
పి.రవీందర్	వరంగల్ ఈస్ట్ డీసీపీ	సీఐడీ ఎస్పీ



పరేడ్‌గ్రౌండ్‌లో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

లక్ష మంది మహిళలతో నేడు మహిళా దినోత్సవం

హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ సభ

» ఇందిరా మహిళాశక్తి మిషన్‌ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం లక్ష మంది మహిళల తో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి మిషన్-2025ను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆధ్యక్షతన జరిగే ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు. మహిళా సంఘాలు ఏడాది కాలంలో సాధించిన విజయాలతోపాటు మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను ఇందిరా మహిళాశక్తి మిషన్-2025లో పొందుపరిచారు. కాగా ఈ సభకు వివిధ జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం ప్రభుత్వం 600కుపైగా ఆర్టీసీ బస్సులను సెర్ప్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచారు. మహిళలు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకునేవరకు సమన్వయం చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలను కల్పించనున్నారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వచ్చే అవకాశం ఉండటంతో రాత్రి ఏడున్నర గంటలలోపు సభను ముగించేలా సంబంధిత విభాగాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సీతక్క

పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి సీతక్క శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగు నీరు, విద్యుత్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయంలో జిల్లా డీఆర్డీఏ, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మహిళలకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

కాస్త మెరుగే.. అయినా బరువే!

(మొదటి పేజీ తరువాయి)



ఉంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. హైదరాబాద్‌లో మూడింట రెండొంతుల మంది మహిళలు తమ జీతంపై తమకు ఎలాంటి నిర్ణయాధికారమూ లేదని చెప్పారు. ఈ విషయంలో హైదరాబాద్‌తో పోలిస్తే.. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో మహిళల పరిస్థితే మెరుగ్గా ఉంది. అలాగే.. రాష్ట్రంలో ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉన్నా.. ఇప్పటికీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతి వంద మందిలో దాదాపు మూడొంతుల మంది ఇబ్బందులు పడుతూనే ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది. ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా.. ఇప్పటికీ, పుట్టింటికి వెళ్లడానికి భర్త, అత్తమామల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నవారు దాదాపు 39 శాతం మంది దాకా ఉంది. ఆఫీసులో చాకిరీకి తోడు.. ఇంటి పని భారం కూడా పూర్తిగా తామే మోస్తున్న ఉద్యోగినులు దాదాపు 27 శాతం మందికి ఉండగా.. తాము అడగకుండానే భర్త, పిల్లలు సాయం చేస్తారని చెప్పిన వారు దాదాపు 57 శాతం మంది ఉండడం గమనార్హం. కాగా.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నా కొంత మంది మగవారు స్త్రీలను చులకనగా చూస్తున్నారని, ఈ విషయంలో మార్పు రావాల్సి ఉందని సర్వేలో పాల్గొన్న మహిళల్లో పలువురు అభిప్రాయపడ్డారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తేవాలని చాలా మంది డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు తగిన సౌకర్యాలు ఉండట్లేదని చాలా మంది ఉద్యోగినులు ఫిర్యాదు చేస్తున్నారు. నాలుగో తరగతి ఉద్యోగినులైతే.. తాము పనిచేసే కార్యాలయంలో అధికారి విధిలో ఉంటే, తాము పని సమయమంతా నిలబడే ఉండాల్సి వస్తోందని, వయసు పెరిగినవారికి ఇది ఇబ్బందికరమైన విషయమేనని.. ఈ విషయంలో మార్పు రావాల్సి ఉందని వాపోయారు. మహిళలు ఉన్నతచదువులు చదివేందుకు భర్త, పిల్లలు, ఇతర కుటుంబసభ్యులు సహకరించాలని సర్వేలో పాల్గొన్నవారిలో అత్యధికులు అభిప్రాయపడ్డారు.

సర్వేలో ప్రధానాంశాలు..

మీరు ఉద్యోగం చేయడానికి కారణం?			
వ్యక్తిగత ఇష్టంతో	42.2	కుటుంబ అవసరాలు	57.8

మీ జీతం మీద పూర్తి నిర్ణయాధికారం మీదేనా?			
అవును	52.0	కాదు	48.0

ఆఫీసుకు వెళ్లడానికి రవాణా సౌకర్యం అనుకూలంగా ఉందా?			
ఉంది	67.9	లేదు	32.1

ఇంటిపనిలో భర్త, పిల్లల తోడ్పాటు ఉంటుందా?					
ఉండదు	27.3	అడిగితేనే..	15.8	అడక్కుండానే..	56.9

అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తారా?			
తీసుకెళ్తారు	84.3	ఆలస్యం చేస్తారు	15.7

పుట్టింటికి వెళ్లడానికి మీ భర్త, అత్త, మామల అనుమతి అవసరమా?			
అవును	61.3	కాదు	38.7



మహిళకు అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

డీలిమిటేషన్‌పై తప్పుడు ప్రచారం ఆపండి

» కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తున్న పార్టీలే నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గాలు తగ్గబోవని స్పష్టం చేశారు. 2009లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం నిర్వహించిన విధంగానే ఈసారి నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని చెప్పారు. త్వరలో జనగణన ప్రారంభమవుతుందని ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళా ఉపాధ్యాయులు, పట్టభద్రులు 90శాతం మంది బీజేపీకే ఓటువేసినట్లు సర్వేలో తేలిందని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మహిళాశక్తిని గుర్తించడం వల్లే దేశ ప్రథమ పౌరురాలుగా ద్రౌపది ముర్మును, ఆర్థిక మంత్రిగా నిర్మలకు ప్రధాని మోదీ బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. కాగా, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ శనివారం హైదరాబాద్ రానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ముఖ్యులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

ఉత్పత్తి వ్యయం తగ్గితేనే మరింత సంక్షేమం

» గుర్తింపు సంఘంతో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గితేనే సింగరేణి సంస్థ పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకోగలదని సంస్థ సీఎండీ ఎన్. బలరాం పేర్కొన్నారు. అప్పుడే కార్మికులకు సంక్షేమ పథకాలను కొనసాగించగలమని, కొత్త పథకాలను ప్రారంభించగలమని స్పష్టం చేశారు. గుర్తింపు సంఘం.. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఇండియా, విదేశీ బొగ్గుతో పోల్చితే ధరలు అధికంగా ఉండటంతో సింగరేణి బొగ్గుకు డిమాండ్ తగ్గుతోందని చెప్పారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.12 వేల నుంచి రూ.16 వేల దాకా ఉంటుందని, ఈ వ్యయాన్ని తగ్గించేందుకు ఉద్యోగులు, కార్మిక సంఘం సహకారం తప్పనిసరి అని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలిస్తామని, కార్మికులకు సొంత ఇంటి పథకం సాధ్యాసాధ్యాలపై కమిటీ వేస్తామని సీఎండీ తెలిపారు. కాగా, అధిక ఉత్పత్తి, యంత్రాలు, ఆధునిక రక్షణ సాంకేతికతలో ఆస్ట్రేలియా కంపెనీలతో కలిసి పని చేస్తామని సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన 13 కంపెనీల ప్రతినిధులతో సింగరేణి భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. 100 మిలియన్ టన్నుల ఉత్పత్తే లక్ష్యంగా సింగరేణి పని చేస్తోందన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయినా పంపించకుండా డిప్యుటేషన్‌పై మూడేళ్లుగా కొనసాగిస్తున్నారని, పనిఒత్తిడి తీవ్రంగా ఉందనే మనస్తాపంతో ప్రభుత్వ ఇంజినీర్ ఒకరు ఆత్మహత్యాయత్నం చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ 2018నుంచి బాన్సువాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్నారు. 2022లో ప్రభుత్వం శ్రీకాంత్‌ను షాద్‌నగర్‌కు బదిలీ చేసింది. అయినా ఉన్నతాధికారులు డిప్యుటేషన్‌పై శ్రీకాంత్‌కు బాన్సువాడలోనే విధులు అప్పగించారు. డిప్యూటేషన్ రద్దు చేయాలన్న శ్రీకాంత్ విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు శుక్రవారం శ్రీకాంత్‌ను పరామర్శించారు. త్వరలోనే బదిలీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వీ-హబ్ నగి'షీ'లు

మహిళలకు వెన్నుదన్నుగా విమిన్ ఆంట్రప్రెనర్ హబ్

- » ఎంచుకున్న వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళామణులు
- » ఆలయాల్లోని పూలతో అగర్‌బత్తీల తయారీలో లాభాలు
- » ఆన్‌లైన్‌లో చేనేత వస్త్రాలు పెట్టడంతో పెరిగిన విక్రయాలు
- » అధునాతన యంత్రాలతో స్వచ్ఛమైన వంట నూనెల తయారీ
- » కుట్టులో నైపుణ్యం ఉన్న మహిళలతో ఆరు గార్మెంట్స్ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వ్యాపారం అన్నాక సవాళ్లు ఎదురవుతాయి. మహిళలకైతే మరింతగా! కానీ ఆ మహిళలు వెనుకడుగు వేయలేదు. అవమానాలనే ఆభరణాలుగా.. సందేహాలను సందేశాలుగా తీసుకున్నారు. ముళ్ల మార్గమే అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకే వెళుతూ ఒక్కరుగానే సాగి.. అనుకున్నది సాధించేసి.. అందరిచేతా ఔరా అనిపించుకుంటున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్న లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'విమిన్ ఆంట్రప్రెనర్ హబ్' (వీ-హబ్) నెలకొల్పింది. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం రాష్ట్రంలోని ఎంతోమంది ఔత్సాహిక మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 'ఐడియా' ఉందంటూ ఆత్మవిశ్వాసంతో వస్తేచాలు వారిని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అన్ని విధాలుగా సహకరిస్తోంది. ఇటీవల.. వ్యాపారంలో గొప్పగా రాణిస్తున్న ఆరుగురు మహిళలను సక్సెస్‌ఫుల్ ఆంట్రప్రెనర్స్‌గా వీ-హబ్ ఎంపికచేసింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీరిలో నలుగురుని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. వ్యాపారంలో తాము ఎదురైన సవాళ్లు, సమస్యలు.. వాటిని తాము అధిగమించిన తీరును ఆ మహిళామణులు చెప్పుకొచ్చారు.

వాట్సాప్, ఇన్‌స్టాతో ఇంటివద్దే ఆదాయం

చేనేత వస్త్రాలు ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని అందరూ అంటుంటారు కానీ ఉత్పత్తులు కొనేందుకు మాత్రం వెనకడుగు వేస్తారు. కారణం ధరలు ఎక్కువగా ఉండటమే! 'వీవర్స్ టు కస్టమర్' ఈ సమస్యలకు పరిష్కారం అని భావించాను. దానికోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు ప్రారంభించి విజయం సాధించాను. బీఎస్సీ చదివాక పోచంపల్లిలోని ఓ చేనేత కుటుంబంలోకి కోడలిగా వెళ్లాను. అత్తామామలు, భర్తకు అద్భుతమైన కళా నైపుణ్యం ఉన్నా వ్యాపారం మాత్రం అంతంత మాత్రంగానే ఉండేది. మా కుటుంబానికే కాదు.. పోచంపల్లిలో చేనేతపై ఆధారపడ్డ 4వేల కుటుంబాలదీ ఇదే దుస్థితి. మావద్ద పట్టుచీరను వ్యాపారులు రూ. 8వేలకు కొని హైదరాబాద్‌లో రూ.20వేలకు అమ్ముకుంటున్నారు. దళారులు లేకుండా నేరుగా కస్టమర్లకు అందిస్తే వారికీ లాభమవుతుందని భావించి.. మూడేళ్ల క్రితం వాట్సాప్ గ్రూప్ ప్రారంభించి ఉత్పత్తులు అందుబాటులో ఉంచాం. అనేకమంది నేరుగా మా వద్దకు వస్తున్నారు. కొందరు ఆన్‌లైన్లో ఆర్డర్ ఇస్తున్నారు. ఫలితంగా ఉత్పత్తులను వెంటనే అమ్ముకునే వీలు కలిగింది. దీంతో ఎంతో మంది కార్మికులు ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఉత్పత్తులు విక్రయించాలన్నదే మా లక్ష్యం.



- గుండేటి నవనీత, వీవర్స్ హబ్ హ్యాండ్లూమ్స్, పోచంపల్లి

రుణం కోసం వెళితే తండ్రితోనో.. భర్తతోనో రావాలన్నారు



ఓవైపు కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ మరోవైపు వ్యాపారం చూసుకోవడం మహిళలకు పెద్దసవాల్. మహిళలు చిన్నపాటి రుణం కోసం బ్యాంకుకు వెళితే తండ్రినో, భర్తనో వెంటబెట్టుకొని రావాలని చెబుతారు. వ్యాపారం మొదలుపెట్టాలనే ఆలోచన వచ్చాక రుణం కోసం నేను ఏ బ్యాంకుకు వెళ్లినా ఇలాంటి ప్రశ్నలే ఎదురయ్యాయి. నాకు బ్యాంకులు రుణం ఇవ్వలేదు. కుటుంబసభ్యుల సహకారంతోనే వ్యాపారం మొదలుపెట్టి.. క్రమక్రమంగా ఉత్పత్తి పెంచుకున్నా. నేను జేఎన్‌టీయూ నుంచి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశాను. నాలుగేళ్ల క్రితం బాసరకు వెళ్లాను. అక్కడ గోదావరిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చూశాక.. వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలన్న ఆలోచనొచ్చింది. తొలుత పూల వ్యర్థాల నుంచి అగరొత్తులు, అత్తర్లు తయారు చేయాలనుకున్నాను. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మీ, రాజేంద్రనగర్‌లోని ఖాదీ విలేజ్‌లో శిక్షణ పొందాను. కూకట్‌పల్లి పరిసరాల్లోని ఆలయాల నుంచి నిత్యం పువ్వులను సేకరించి వాటితో అగరొత్తులు తయారు చేస్తున్నాను. ఆలయాల నుంచి సేకరించిన పూలు కావడంతో చాలా మంది ఆదరిస్తున్నారు. వ్యాపారాన్ని మరింత విస్తరించాలని లక్ష్యంతో ఇటీవల వీ-హబ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నాను. ఉత్పత్తులను హైదరాబాద్ అంతా మార్కెట్ చేసేందుకు ఉత్పత్తిని పెంచుతున్నాం. పేపర్ వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్ నుంచి ఉత్పత్తులు చేయాలన్న ఆలోచనలున్నాయి.

- డాక్టర్ శైలజ మద్దిపట్ల, సమృద్ధి వేస్ట్ 2వెల్త్, కూకట్‌పల్లి, హైదరాబాద్

ఒత్తిడి తట్టుకోలేక ఏడిస్తే.. వ్యాపారం వదిలేయమన్నారు



వ్యాపారం తొలినాళ్లలో నష్టాలు రావడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డా. ఒత్తిడితో మానసికంగా కుంగిపోయాను. ఇంట్లోవాళ్లు వ్యాపారాన్ని వదిలెయ్ అన్నారు. నేను వెనక్కి తగ్గలేదు. కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేశాను. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నాను. నా భర్తకు పూజా స్టోర్ ఉంది. అక్కడే స్వచ్ఛమైన వంట నూనెలు తయారు చేసి విక్రయించాలని ఆలోచన వచ్చింది. రెండేళ్ల క్రితం రూ.28వేలతో చిన్నపాటి ఆయిల్ మిషన్ కొనుక్కొని కరీంనగర్‌లో వ్యాపారం ప్రారంభించాను. నష్టాలొచ్చాయి. వ్యాపారం పెద్ద స్థాయిలో చేస్తేనే లాభాలొస్తాయని అనిపించింది. పెద్ద యంత్రాల కొనుగోలుకు బ్యాంకు నుంచి రూ.10లక్షల అప్పు తీసుకున్నాను. కోయంబత్తూర్ నుంచి అధునాతన యంత్రాలు కొనుగోలు చేశాను. పల్లి, కొబ్బరి, ఆవాలు, నువ్వుల నూనెలు తయారు చేస్తున్నాను. ఆర్గానిక్ హెయిర్ ఆయిల్ ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం ఆర్డర్లు పెద్దఎత్తున వస్తున్నాయి. త్వరలో రాష్ట్ర స్థాయిలో వ్యాపారాన్ని విస్తరించాలన్నదే లక్ష్యం. ఈ ప్రయాణంలో వీ -హబ్ సహకారం ఎంతో ఉంది.


- చిత్ర, శ్రీరామ ఆర్గానిక్ ఆయిల్స్, కరీంనగర్

కుటుంబ పొదుపంతా పెట్టుబడికే



నా డబ్బు కొంత.. అమ్మ, నాన్న చేసిన పొదుపు చేసింది కొంత పోగేసి రూ.25 లక్షల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాను. 'మీరు తయారు చేసేవి.. ఎంతోమంది తయారు చేస్తున్నారు.. ఎంతోమంది విక్రయిస్తున్నారు.. మీ వద్దే ఎందుకు కొనాలి?' అని మొదట్లో ప్రశ్నించినవారంతా ఇప్పుడు మా ఉత్పత్తులను ఇష్టపడి కొంటున్నారు. నా ప్రయాణం వెనక మూడేళ్ల శ్రమ ఉంది. ఏడేళ్ల పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాను. మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ అందించాలన్న లక్ష్యంతో జాబ్ వదిలేసి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశా. కుట్టు, కంప్యూటర్ రంగంలో 1500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చాను. నైపుణ్యం ఉన్న ఆ మహిళలతో కలిసి ఒక పరిశ్రమ ఏర్పాటుచేయాలనుకొని మూడేళ్ల క్రితం భువనగిరిలో ఆరు గార్మెంట్స్ ప్రారంభించాను. కాటన్ వస్త్రాలకు రాష్ట్రంలో భారీ డిమాండ్ ఉంది. జైపూర్ నుంచి ముడిసరుకు తెప్పించి ఇక్కడ చీరలు, బ్లౌజులు, నైటీలు, ఫ్రాక్స్, కుర్తీలు, దుపట్టాలు తయారు చేస్తున్నాం. మా ఉత్పత్తుల కనీస ధర రూ.300 ఉండటంతో విశేష ఆదరణ లభిస్తోంది. త్వరలో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేసే పనిలో ఉన్నాం.

- ప్రవీణ, ఆరు గార్మెంట్స్, భువనగిరి



అప్రావ సౌరవిద్యుత్తు ప్లాంట్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బంది

'ఆమె' నిర్వహణలో ఓ విద్యుత్తు ప్లాంట్

పూర్తిగా మహిళల నిర్వహణలో వెల్టూర్ సౌర విద్యుత్తు ప్లాంట్



హైదరాబాద్, మార్చి7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఒక సౌర విద్యుత్తు ప్లాంట్ పూర్తి నిర్వహణను మహిళలే చూసుకుంటున్నారు. వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలం వెల్టూర్ సౌర విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన అప్రావ సంస్థ దాని నిర్వహణను పూర్తిగా మహిళలకు అప్పగించింది. మహిళా ఇంజినీర్ల బృందం పర్యవేక్షణలో ఈ ప్లాంట్ నడుస్తోంది. ఆ బృందంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య అభ్యసించిన దూది మెట్ల తేజస్విని, అనూష రుద్రముని, ఇందుశ్రీ రుద్రముని, కొరెత సుగుణ ఉన్నారు. అప్రావ నుంచి పి.ఝస్విని కుమారి, మేడ మణి దీప్తి ప్లాంట్ కార్యకలాపాల పర్యవేక్షణలో ఆ బృందానికి చేయూత అందిస్తున్నారు. ఈ రంగంలో పని చేయడానికి మహిళా ఇంజినీర్లు వెనకంజ వేసే పరిస్థితి ఉండగా సౌర విద్యుత్తు ప్లాంట్ నిర్వహణ చేపట్టిన ఈ మహిళా బృందం మహిళా దినోత్సవాన ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిందని అప్రావ ఎనర్జీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌ఆర్ దీపా సెబాస్టియన్ అన్నారు. తమ సంస్థ మహిళా సాధికారతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ఇంజనీర్ల బృందంలో ఒకరైన ఇందుశ్రీ రుద్రముని మాట్లాడుతూ సోలార్ ప్లాంట్‌లో పనిచేయడం తనకు మొదటిసారి అని, ఈ అనుభవం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని తెలిపారు.

ఎల్లుండే గ్రూప్-1 ఫలితాలు

11న గ్రూప్-2, 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితా

- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల జాబితా
- షెడ్యూల్‌ను ప్రకటించిన టీజీపీఎస్సీ
- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా సంప్రదిస్తే.. 9966700339 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండి
- టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్న గ్రూప్స్ ఫలితాలకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలతో పాటు గతంలో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్ష ఫలితాల తేదీలను శుక్రవారం ప్రకటించింది. ఆ షెడ్యూలు ప్రకారం.. గ్రూప్-1 పరీక్షలో అభ్యర్థులు సాధించిన ప్రొవిజినల్ మార్కుల వివరాలను మార్చి10న ప్రకటించనున్నారు. గ్రూప్-2 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను 11వ తేదీన, గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల చేయనున్నారు. గతంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల ఫలితాలను మార్చి 19న ప్రకటిస్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామకాలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని టీజీపీఎస్సీ విజ్ఞప్తి చేసింది. అన్ని పరీక్షలనూ అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, ఎలాంటి లోటుపాట్లకూ తావు లేకుండా ఫలితాలు ప్రకటిస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన వెల్లడించారు. ప్రతిభావంతులైన ఉద్యోగులను ఏంపిక చేయడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని.. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే, అలాంటివారి మాటలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఎవరైనా ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తే.. 9966700339నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వెంకటేశం సూచించారు.



వీధి కుక్కల దాడిలో గాయాల పాలైన చిన్నారి శ్రీలక్ష్మి

హైదరాబాద్‌లో చిన్నారిపై వీధి కుక్కల దాడి

ఒళ్లంతా తీవ్ర గాయాలు.. నిలోఫర్‌లో చికిత్స

గోల్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గోల్నాక డివిజన్‌లోని కమలానగర్‌లో శుక్రవారం ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. 19 నెలల శ్రీలక్ష్మి ఇంటి బయట ఆడుకుంటుండగా రెండు కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి ముఖం, మెడ, చేతులు, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు నిలోఫర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం చిన్నారి నిలోఫర్‌లో చికిత్స పొందుతోంది. తీవ్రగాయాలు కావడంతో శ్రీలక్ష్మి స్పృహ కోల్పోయిందని, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రాబోయే నాలుగేళ్లకు ఉద్యమ కార్యాచరణ

- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళతాం:లక్ష్మణ్

న్యూఢిల్లీ, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళతామని, ఉగాది తర్వాత రాబోయే నాలుగేళ్లకు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారును ఏర్పాటు చేసి ప్రధాని మోదీకి కానుకగా ఇస్తామన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రేటర్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఉదారంగా నిధులిస్తున్నామని, ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్‌కు మోదీ హయాంలోనే రైల్వే స్టేషన్ వచ్చిందని లక్ష్మణ్ చెప్పారు. రాష్ట్రంలో బిల్లులు రాక, కమీషన్లు ఇవ్వలేక కాంట్రాక్టర్లు ఆందోళన చేసే పరిస్థితి ఉందన్నారు.

బీసీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వండి

- ఎమ్మెల్సీ కవితకు మెదక్ ఎంపీ రఘునందన్ సవాల్

గజ్వేల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ బీసీలకు అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం హాస్యాస్పదని, దమ్ముంటే బీసీలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సవాల్ విసిరారు. లేదంటే కేసీఆర్‌తో మాట్లాడి శాసనసభ ప్రతిపక్ష నాయకుడి హోదాను బీసీకి ఇప్పించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో బీసీ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌ను బర్తరఫ్ చేసి, బయటకు పంపించిన చరిత్ర బీఆర్ఎస్‌ది అని విమర్శించారు. మొదటి దఫా కేసీఆర్ క్యాబినెట్‌లో ఒక్క మహిళకూ మంత్రి పదవినీ ఇవ్వలేదని గుర్తు చేశారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించండి

- బీహెచ్ఈఎల్ నివేదికలు ఆరోపణలను రుజువు చేస్తున్నాయ్
- నాగం జనార్దన్ రెడ్డి పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు

న్యూఢిల్లీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి సుప్రీంకోర్టును కోరారు. ఆ ప్రాజెక్టు పనులతో సంబంధం ఉన్న బీహెచ్ఈఎల్ సంస్థ సమర్పించిన నివేదికలో తాము చేసిన ఆరోపణలకు రుజువులు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాజెక్టు పేరుతో అప్పటి ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ ఆయన 2019 మార్చి 5న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. బీహెచ్ఈఎల్ దాఖలు చేసిన అఫిడవిట్, నాగం జనార్దన్ రెడ్డి దాఖలు చేసిన రీజాయిండర్లను పరిగణలోకి తీసుకుంటున్నట్టు ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను మే 13 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది.

ఫాల్కన్ కేసు.. అమర్‌దీప్ బెయిల్ తిరస్కరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాలు ఆశ చూపి భారీ మొత్తంలో డబ్బు సేకరించి పెట్టుబడిదారులకు రూ.850 కోట్ల మేర టోకరా వేసిన ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంట్ కంపెనీ కేసులో ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఫాల్కన్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండీ అమర్‌దీప్ కుమార్ ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించిందని పోలీసులు తెలిపారు. అమర్‌దీప్‌తో పాటు ఆయన భార్య అనితా కుమారి కూడా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో పవన్ కుమార్ ఓదెల, కావ్య నల్లూరి, అనితా రాణి అనే ముగ్గురిని పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు అమర్‌దీప్ కుమార్, సంస్థ సీవోవో ఆర్యన్‌సింగ్, సీఈవో యుగేందర్ సింగ్ కేసు నమోదుకు ముందే విదేశాలకు పరారయ్యారు.

పొంగులేటి క్యాబినెట్ మంత్రా? కాంట్రాక్టరా?

- క్యాబినెట్ భేటీ కాదు.. మంత్రుల కుస్తీ పోటీ:ఏలేటి

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాబినెట్ మంత్రా? లేక కాంట్రాక్టరా? అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి కేటాయించుకోవడం ఎంతవరకు సమర్థనీయమన్నారు. ఉదండపూర్ రిజర్వాయర్ పనులను రూ. 430 కోట్ల నుంచి రూ. 1150కోట్లకు రివైజ్డ్ అంచనాలు పెంచడాన్ని ఇద్దరు మంత్రులు ప్రశ్నించడంతో క్యాబినెట్‌లో రచ్చకు దారితీసిందన్నారు. ఆరు గంటల పాటు జరిగింది క్యాబినెట్ సమావేశం కాదని, మంత్రుల కుస్తీ పోటీ అని మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. నీటిపారుదల ప్రాజెక్టుల రివైజ్డ్ అంచనాలు, నిధుల కేటాయింపులో సీఎంకు, ఒక పెద్ద మంత్రికి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు.

విద్వేష రాజకీయాలకు స్వస్తి చెప్పండి

- హరీశ్‌కు టీడీపీ నేత నర్సిరెడ్డి సూచన

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల మధ్య, తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడడం మానుకోవాలని, నీచ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి సూచించారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ నేతలు పదే పదే చంద్రబాబు, టీడీపీ ప్రస్తావన తీసుకువస్తున్నారని విమర్శించారు. బనకచర్లపై వారు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశాల గడువు పొడిగింపు

తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ఎంఎస్ఏటీ-2025 ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌లో పలు మార్పులు జరిగాయి. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువును 20వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రిప్టో కరెన్సీ మోసం కేసులో సూత్రధారి అరెస్టు

జీబీఆర్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో సూత్రధారి చెన్నైకి చెందిన వైఎస్ రవికుమార్‌రెడ్డి అలియాస్ రవిరెడ్డిని తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. జీబీఆర్ పేరిట నకిలీ వెబ్‌సైట్ ఏర్పాటు చేసిన జనగామకు చెందిన కురిమెల్ల రమేశ్ గౌడ్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ప్రచారం చేశారని సీఐడీ డీజీ షిఖా గోయల్ తెలిపారు. రమేశ్ గౌడ్ మాటలు నమ్మి కరీంనగర్‌కు చెందిన మనోజ్ కుమార్‌తో పాటు 43 మంది రూ.95 కోట్లు పెట్టుబడి పెట్టారన్నారు. అయితే, రోజులు గడుస్తున్నా క్రిప్టో కరెన్సీలో వచ్చిన లాభాలను చెల్లించకపోవడంతో బాధితులంతా ఫిర్యాదు చేశారని వెల్లడించారు. దీంతో కేసు నమోదు చేసి రమేశ్‌గౌడ్‌ను అరెస్టు చేశామన్నారు. అతడిని విచారించగా.. రవికుమార్ రెడ్డి పాత్ర బయటపడిందన్నారు.

కాంగ్రెస్‌ను ఎండగడతా

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంతో పాటు దేశంలో వర్తమాన రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించారు. కాంగ్రెస్ ఆశ పెట్టిన గ్యారెంటీలను నమ్మి గెలిపించిన ప్రజలు.. ఇప్పుడు ఆ పార్టీ నిజస్వరూపం తెలుసుకున్నారని కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దామని, ఆ తర్వాత బీసీల పక్షాన పోరాడదామని పార్టీ నేతలతో అన్నారు. బీఆర్ఎస్‌పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో తెలంగాణ సమాజం గర్వపడేలా రజతోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని చెప్పారు. అందుకోసం త్వరలో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కమిటీలు..

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కేసీఆర్ పేర్కొన్నారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీలో యువత, మహిళల భాగస్వామ్యం పెంచాలని సూచించారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వమున్నా తెలంగాణకు వ్యతిరేకంగానే పనిచేస్తున్నాయని, ఈ నేపథ్యంలో దేశ రాజకీయ పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతోందని, ఈ విషయాన్ని



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో సమావేశమైన కేసీఆర్

ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని కేసీఆర్ పేర్కొన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ..!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ చర్చించినట్లు సమాచారం. ఎవరిని బరిలో దించాలన్న దానిపై జరిగిన చర్చలో ప్రధానంగా సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్ పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఇందులో ఇద్దరిని పోటీలో నిలబెట్టే అవకాశం ఉంది. ఆ ఇద్దరు ఎవరనేది కేసీఆర్ త్వరలో ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కేంద్ర కొత్త ఐటీ బిల్లుతో పౌరుల డిజిటల్ గోప్యతకు ముప్పు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను (ఐటీ) బిల్లుతో పౌరుల డిజిటల్ గోప్యతకు ముప్పు కలగనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందులో ప్రస్తావించిన 'వర్చువల్ డిజిటల్ స్పైసెస్'.. వేధింపులకు, దుర్వినియోగానికి, విస్తృత నిఘాకు దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్ ఖాతాలపై పన్ను తనిఖీ పేరుతో కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఐటీ అధికారులకు అపరిమిత అధికారాలను ఇచ్చేలా ఉందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన ఈ బిల్లును దేశపౌరులు, విపక్షాలు వ్యతిరేకించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

శ్రీవిద్యకు కేటీఆర్ అండ

హైదరాబాద్ సిటీ: సనత్‌నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి మల్లెల శ్రీవిద్యకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన "ఆధార్ ఇప్పిస్తే.. ఈ చిన్నారి చదువుకుంటుంది.." అనే వార్తా కథనానికి స్పందించిన ఆయన శుక్రవారం తన కార్యాలయ సిబ్బందిని శ్రీవిద్య ఇంటికి పంపించి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆమె రెండేళ్ల స్కూల్ ఫీజును చెల్లించారు. భవిష్యత్తులో శ్రీవిద్య చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ 2.5% పెంపు

- నేటి నుంచే అమల్లోకి
- పెంపుతో ప్రభుత్వానికి 3.6కోట్ల భారం
- మహిళా శక్తి బస్సుల ప్రారంభం నేడే
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 2.5% డీఏ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని(మార్చి 8) పురస్కరించుకొని శనివారం నుంచి ఇది అమల్లోకి వస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. డీఏ పెంపుతో ప్రభుత్వంపై ప్రతినెలా రూ.3.6కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. అంతేకాకుండా, కోటి మంది మహిళల్ని కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యంగా మహిళా దినోత్సవం రోజు 'మహిళా శక్తి' బస్సులను ప్రారంభిస్తామని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి బస్సు పథకంలో భాగంగా.. మండల మహిళా సమైక్య సంఘాల ద్వారా బస్సులను కొనిపించి, వాటిని అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలో నడిపిస్తూ.. మహిళా సంఘాలకు అద్దె చెల్లించనున్నారు. బస్సుల కొనుగోలుకు ప్రభుత్వమే రుణాలు సమకూరుస్తుంది. మొత్తం 600 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనిపించి, ఆర్టీసీలో నడిపించేలా ఒప్పందం జరిగినట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తొలిదశలో శనివారం 150 బస్సులను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ బస్సులను సీఎం రేవంత్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క లాంఛనంగా ప్రారంభించనున్నారు. శనివారం 150 మండలాల్లో.. ఒక్కో మండలంలో ఒక్కో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ బస్సులు ప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 150కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇలా వారికి రూ.5వేల కోట్ల ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ కొత్త నాటకం

- 6 గ్యారంటీలపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించండి
- బండి సంజయ్ డిమాండ్



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు, హామీల అమల్లో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ కొత్త నాటకానికి తెరదీసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. అఖిలపక్ష సమావేశం పెట్టే ముందు 6 గ్యారంటీలు, హామీలపై అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. యువతకు నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలపై ముందుగా అఖిలపక్ష సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్‌నాం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ అఖిలపక్ష సమావేశం లక్ష్యమా అని ఆయన ప్రశ్నించారు. ఏకపక్షంగా ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రంపైకి నెపం నెట్టి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పినా తీరు మారకపోవడం బాధాకరమని బండి సంజయ్ చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. ఉద్యోగుల జీత భత్యాలను పెంచకపోగా ఉన్న వేతనాల్లో భారీగా కోత విధించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పొరపాటును సరిదిద్దుకుని మున్సిపల్ డ్రైవర్లు, శానిటేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలను సరి చేయడంతో పాటు ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలను పెంచాలని సంజయ్ డిమాండ్ చేశారు.

20 లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- లేకపోతే 25న అసెంబ్లీ ముట్టడిస్తాం
- తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరిక
- బిల్లులు చెల్లించాలని భట్టి చాంబర్ ముందు నిరసన

పంజాగుట్ట, హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల నుంచి బిల్లుల బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చిన్న చిన్న కాంట్రాక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుందని వడ్డీకి అప్పులు తెచ్చి, బంగారం తాకట్టు పెట్టి కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారని, రూ.10 లక్షల మేర పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు 6 వేల మంది ఉన్నారని, వారికి రూ.505 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉన్నాయన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకుండా బడా కాంట్రాక్టర్లకు మాత్రం రూ.వందల కోట్లు చెల్లిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలోనూ ఈ పరిస్థితి ఎదుర్కొన్నామన్నారు. ఈనెల 20వ తేదీలోపు రూ.10 లక్షలలోపు ఉన్న చిన్న కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించాలని, లేకపోతే ఈనెల 25న అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కొంత మంది అధికారులు పర్సంటేజీలు అడుగుతున్నారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు ఆపొద్దని, ఇవ్వమని చెప్పారని, కానీ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాత్రం ఆయనకు నచ్చిన వారికే బిల్లులు ఇస్తున్నారన్నారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని తొలగించి తమకు న్యాయం చేయాలన్నారు. లేకపోతే తమకు ఆత్మహత్యలే గతి అన్నారు.



సచివాలయంలో తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధుల ఆందోళన

బిల్లులు చెల్లించాలని నిరసన:

అనంతరం తమ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారంటూ తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు సచివాలయంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం చాంబర్ వద్ద వచ్చిన భట్టికి బిల్లులు చెల్లించాలని వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దాంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. సాయంత్రం మళ్లీ చాంబర్ వద్దకు వచ్చిన భట్టిని కలిసి వినతిపత్రం అందించారు.

బకాయిల కోసం తిరగాల్సిన పని లేదు

- రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేశాం
- ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో భట్టి

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు బకాయిల కోసం తిరగాల్సిన పని లేదని, ప్రజా ప్రభుత్వం వచ్చాక ఏడాది వ్యవధిలో ఉద్యోగులకు సంబంధించి రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని ప్రతినిధులతో సచివాలయంలో శుక్రవారం ఉపముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి, తానూ అర్థం చేసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి రూ. 5వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. గత 14 నెలల కాలంలో కొన్ని బకాయిలు జమ అయ్యాయని, పాత, కొత్త బిల్లులు కలిపి రూ.10 వేల కోట్ల బిల్లులను క్లియర్ చేసినట్లు వివరించారు. మరో రూ.8 వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని, ఏప్రిల్ నుంచి బకాయిలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రతి నెలా రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని, పదవీ విరమణ ప్రయోజనాలు, వైద్య బిల్లులే పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

బిల్లుల మంజూరుకు 20శాతం కమీషన్లా?

- కాంట్రాక్టర్ల ధర్నా.. ప్రభుత్వ ప్రతిష్ఠకు మాయని మచ్చ
- మంత్రులకు కమీషన్ల ఆరోపణలపై రాహుల్ స్పందించాలి
- బనకచర్లతో 200టీఎంసీల తరలింపునకు బాబు కుట్ర
- ఈ విషయంపై రేవంత్‌రెడ్డి స్పందించరా?: హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): "మాది ప్రజా ప్రభుత్వమని ప్రచారం చేసుకునే భట్టి విక్రమార్క బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్లు సచివాలయానికి వస్తే ఎందుకు మొహం చాటేశారు? పోలీసులను అడ్డుపెట్టుకొని వెనుక గేటునుంచి ఎందుకు వెళ్లిపోయారు? ప్రజా ప్రభుత్వమంటే పలాయనం చిత్తగించడమేనా?" అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఢిల్లీ బాస్‌లకు కప్పం కట్టేందుకు అన్ని వర్గాల నుంచి మంత్రులు లంచాలు తీసుకుంటున్నారని లోకం కోడై కూస్తోందని పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్థిక మంత్రి చాంబర్ ఎదుట కాంట్రాక్టర్లు ధర్నా చేయడం.. ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తోందని ఓ ప్రకటనలో తెలిపారు. బిల్లుల మంజూరుకు 20శాతం కమీషన్ తీసుకుంటున్నారంటూ కాంట్రాక్టర్లే స్వయంగా చెప్పడం.. ప్రభుత్వ ప్రతిష్ఠకు మాయని మచ్చగా నిలుస్తోందని పేర్కొన్నారు. నీతి సూత్రాలు చెప్పే రాహుల్ గాంధీ.. ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమీషన్లకు ఆశపడి కొందరు మంత్రులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న వైనం, కాంగ్రెస్ ప్రభుత్వ కమీషన్ల కక్కుర్తి సచివాలయం సాక్షిగా బట్టబయలైందన్నారు. పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌లు రోడ్డెక్కినా ప్రభుత్వం కరుణించడం లేదని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే రూ.6వేల కోట్లు బాకీ పడిందని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ల తరహాలో ఉద్యోగులు కూడా కమీషన్లు ఇవ్వాల్సిందేనా? అని నిలదీశారు. కాగా, బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్ ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తామని, తెలంగాణకు నష్టమేమీ లేదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి చెబుతుంటే.. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ స్పందించరా? అని నిలదీశారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకు పోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బనకచర్లతో తెలంగాణకు ఏం నష్టమని ఏపీ సీఎం స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా సీఎం, రాష్ట్ర మంత్రులు ఎవరూ గట్టిగా స్పందించలేదని ఆరోపించారు. చంద్రబాబుతో దోస్తీ చేస్తూ రాష్ట్రానికి మోసం చేస్తారా? అని నిలదీశారు.


కూసుమంచిలో కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

వచ్చే వారం నుంచే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

- జీఆర్ఎస్ ఆర్థిక అరాచకం వల్లే 'తులం బంగారం' ఆలస్యం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

కూసుమంచి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం, ఆర్థిక అరాచకం వల్లే తాము పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటులో ఉందని, అందుకే కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం వంటి వాటి అమలు ఆలస్యమవుతోందని ఆయన పేర్కొన్నారు.

బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలు ఇవ్వండి

- ప్రభుత్వానికి కమిషన్ ప్రతిపాదన

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాల్లో మరింత క్రియాశీలంగా వ్యవహరించేందుకు బీసీ కమిషన్ అధికారాల పరిధిని విస్తృతం చేయాలని ఆ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మీతో కలిసి నిరంజన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కమిషన్‌కు అవసరమైన మరిన్ని అధికారాలు దఖలు పరచాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో 'పది' హాల్‌టికెట్లు

హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ తెలిపారు. హాల్‌టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపిచామని, విద్యార్థులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్(040-2323 0942) ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

డీఎడ్ ఫలితాలు విడుదల

గత ఏడాది డిసెంబరులో జరిగిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) ఫస్టియర్ ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసింది. వెబ్ మెమోలు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, రీకౌంటింగ్‌కు ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా డీవీఎన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడిగా డీవీఎన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి రాజు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా డీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల సమస్యలను ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనను జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

టీహబ్ కొత్త సీఈవోగా కవిక్రుత్ నియామకం

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీహబ్ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా కవిక్రుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఈ పదవిలో కవిక్రుత్ మూడేళ్లపాటు ఉంటారు.

ఫోన్‌ట్యాపింగ్‌పై సమాచారం ఇప్పించండి

- సమాచార కమిషనర్లు లేక హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్, ఇతర అక్రమాలపై వివరాలు ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సమాచార కమిషనర్లు లేకపోవడంతో మరో మార్గం లేక హైకోర్టును ఆశ్రయించినట్లు ఫర్హాత్ ఇబ్రహీం అనే సామాజిక కార్యకర్త తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తనకు బెదిరింపులు రావడం, ఫోన్ ట్యాపింగ్ జరగడంతో కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఫిర్యాదును కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బదిలీ చేసిందని తెలిపారు. దానిపై తీసుకున్న చర్యలపై వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినప్పటికీ స్పందన లేదని పేర్కొన్నారు. అందువల్ల పూర్తిసమాచారం ఇచ్చే ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 21కి వాయిదావేసింది.

రెండు వారాల్లో బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్ ఇవ్వండి:హైకోర్టు

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్‌ను రెండు వారాల్లో సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బార్ కౌన్సిల్ పదవీకాలం ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ఆలస్యం చేయడం సరికాదని పేర్కొంది. బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికలు నిర్వహించకపోవడం అడ్వకేట్ యాక్ట్ కు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం రెండు వారాల్లో షెడ్యూల్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీకి 3 సీట్లూ రావు: మధుసూదన్‌రెడ్డి

'ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు చూసి సంబరపడుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటున్నారు. అధికారం మాట అటుంచి.. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీకి మూడు సీట్లు కూడా రావు' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా పదేళ్లు అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు.

గూడెం, కాట వివాదంపై దామోదర అభిప్రాయం సేకరణ..

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆ నియోజకవర్గ కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్‌ల మధ్య వివాదంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌రెడ్డిలతో ఏర్పాటైన ద్విసభ్య విచారణ కమిటీ.. మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో కలిసింది. ఈ వివాదానికి సంబంధించి ఆయన అభిప్రాయాన్ని తీసుకుంది.

దక్షిణాదిపై కక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడారు. దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకే పునర్విభజన చేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, ప్రో రేటా ప్రకారం చేసినా ఇదే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. "ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం 80 సీట్లు ఉన్నాయి. ప్రో రేటా ప్రకారం 50 శాతం సీట్లు పెంచాలని అనుకుంటే అక్కడ 120కి పెరుగుతాయి. అదే సమయంలో, తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లున్నాయి. అక్కడ 50 శాతం చొప్పున పెంచితే 60 సీట్లు అవుతాయి. ప్రస్తుతం ఆ రెండు రాష్ట్రాల్లోని అసెంబ్లీ సీట్ల మధ్య తేడా 40 మాత్రమే. కానీ, ప్రో రేటా ప్రకారం సీట్లను పెంచితే ఈ తేడా ఏకంగా 60కి చేరుతుంది. ఒక్క రాష్ట్రంలోనే ఇంత తేడా ఉంటే.. మిగతా రాష్ట్రాల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. దక్షిణాదిలో ప్రస్తుతం 126 లోక్‌సభ సీట్లు ఉన్నాయని, ఇక్కడ 50 శాతం పెంచితే గరిష్ఠంగా 62 పెరుగుతాయని.. మొత్తంమీద 185 సీట్లకు దాటదని వివరించారు. దక్షిణాదిలో బీజేపీకి తగిన ప్రాతినిధ్యం లేదని, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ఆ పార్టీకి వచ్చిన 240 సీట్లలో ఇక్కడ గెలిచింది కేవలం 29 సీట్లు మాత్రమేనని గుర్తు చేశారు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోందని ఆరోపించారు. అందరికీ మంచి జరగాలని ఉంటే అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. ప్రభుత్వపరమైన నిర్ణయాన్ని అధికారులపై ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. పునర్విభజనపై అన్ని రాజకీయ పార్టీలను పిలిచి చర్చించాలని డిమాండ్ చేశారు. కుటుంబ నియంత్రణ విధానానికి ముందు 1971 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్కువ మంది పిల్లల్ని కనాలని చెబుతున్నారుగా అని ప్రశ్నించగా.. "30ఏళ్ల తర్వాత పునర్విభజన చేపట్టమనండి. అప్పుడు దక్షిణాది సత్తా ఆధారంగా సంఖ్య పెరుగుతుంది. అప్పుడు మా నియోజకవర్గాలూ పెరుగుతాయి" అంటూ నవ్వులు పూయించారు. హిందీ ఈ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష మాత్రమేనని, అది జాతీయ భాష కానేకాదని రేవంత్ చెప్పారు. హిందీని బలవంతంగా రుద్దాల్సిన అవసరం లేదని, ఎవరైనా ఏ భాషనైనా నేర్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. "హిందీ తర్వాత అత్యధికంగా తెలుగు, బెంగాలీ భాషలు మాట్లాడే వారున్నారు. మరి, తెలుగుకు ఎంత మేర ప్రాధాన్యం ఇస్తున్నారు? సివిల్స్ పరీక్షల్లో తెలుగు ఎందుకు లేదు!?" అని ప్రశ్నించారు.

ప్రత్యర్థులను ఐస్ చేసేందుకు 'నైస్'

సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించి, వారిని బలహీనపరిచి ఎన్నికల్లో బీజేపీ గెలుస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. విద్యార్థి, యువజన, మహిళ తదితర సంఘాలు కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థలైతే.. ఈడీ, సీబీఐ, ఐటీలు బీజేపీకి అనుబంధ సంస్థలని ఎద్దేవా చేశారు. నార్కోటిక్స్, ఐటీ, సీబీఐ, ఈడీ సంస్థలను రేవంత్ రెడ్డి 'నైస్'గా అభివర్ణించారు. ప్రత్యర్థులను ఐస్ చేసేందుకు నైస్‌ను ప్రయోగిస్తున్నారని అన్నారు.

మోదీది టెస్టు మ్యాచ్.. నాది 20-20

ప్రధాని మోదీది టెస్టు మ్యాచ్ అని, తనది 20 - 20 మ్యాచ్ అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. "గుజరాత్ నమూనాకు కాలం చెల్లింది. ఇప్పుడిక తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శం. తెలంగాణ నమూనా ముందు గుజరాత్ నమూనా ఎందుకూ పనికి రాదు. గుజరాత్‌కు మోదీ బ్రాండ్ అంబాసిడర్ అయితే, తెలంగాణకు నేనే బ్రాండ్ అంబాసిడర్" అని అన్నారు. గిఫ్ట్ సిటీ పేరుతో కేవలం గుజరాత్‌నే అభివృద్ధి చేయాలని మోదీ అనుకుంటున్నారని, అక్కడ కల్పించిన రాయితీలను ఇతర రాష్ట్రాల్లో ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో విదేశీ పెట్టుబడులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అన్ని పెట్టుబడులు గుజరాత్‌కే తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు అహ్మదాబాద్‌లో ఎక్కడున్నాయని నిలదీశారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించామని, అది ఐదేళ్లలో ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి ఫలానా వ్యక్తి కారణమంటే తాను అంగీకరించబోనని, బ్రిటిష్ వారు, కులీ కుతుబ్ షా, నిజాం నుంచి మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి ఇలా ప్రతి ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి కారణమయ్యారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీయే రిజర్వేషన్లు కల్పించిందని, ఇప్పుడు ఓబీసీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని తాము భావిస్తున్నామని తెలిపారు. వాళ్ల డిమాండ్ సరైనప్పుడు ఇవ్వడంలో తప్పేం ఉందని ప్రశ్నించారు. ప్రతి మత విశ్వాసాన్ని తాము గౌరవిస్తున్నామని, తిరుపతి వెళ్లే వారికి రాయితీలు ఇస్తున్నామని ఓ ప్రశ్నకు జవాబిచ్చారు. "దేశ ప్రధానిగా మోదీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తా. తెలంగాణకు సీఎంగా రాష్ట్రానికి కావాల్సినవి డిమాండ్ చేస్తా. అది నా హక్కు.. బాధ్యత. కాంగ్రెస్ ప్రతినిధిగా బీజేపీతో రాజకీయంగా విభేదిస్తా" అని అన్నారు. మోదీకి, తనకు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, మోదీని వ్యక్తిగా కాకుండా విధానపరంగానే తాను వ్యతిరేకిస్తున్నానని వివరించారు.



ఉచితాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి

కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు కేవలం రూ69 వేల కోట్లు మాత్రమే అప్పు ఉండేదని, పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి ప్రజలపై భారం మోపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. అయినా, ప్రజలకు ఇచ్చిన హామీలను తాము నెరవేరుస్తున్నామని చెప్పారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.21 వేల కోట్లు రైతులకు అందించామన్నారు. రుణ భారం ఉన్నప్పటికీ ప్రజలకు ఉచితాలు పంచడంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, అది తన ఒక్కడి సమస్య కాదని చెప్పారు. మోదీ కూడా ఢిల్లీలో అనేక గ్యారెంటీలు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ ఉచితాల కారణంగా నిజానికి మౌలిక సదుపాయాలపై రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒలింపిక్స్‌కు హైదరాబాద్ అత్యుత్తమ నగరం

హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాల్సిందిగా క్రీడా మంత్రి మాండవీయకు తాను వినతి పత్రం సమర్పించానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఒలింపిక్స్ నిర్వహణకు హైదరాబాద్ అత్యుత్తమ నగరమని చెప్పారు. ఎన్నో అంతర్జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించామని, ఇక్కడ ఉన్నన్ని మౌలిక సదుపాయాలు ఎక్కడా లేవని చెప్పారు. ఒలింపిక్స్‌లో పాల్గొన్న సానియా మీర్జా, పీవీ సింధు, నిఖత్ జరీన్ హైదరాబాద్‌కు చెందిన వారేనని గుర్తు చేశారు. అలాంటి హైదరాబాద్‌ను కాదని మోదీ అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలని చూస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ

కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ కావడం బలహీనతేనని రేవంత్ అంగీకరించారు. ఐదు సార్లు రాజ్యసభ సీటు వచ్చినా.. ఆరోసారి రాలేదని బహిరంగంగా విమర్శిస్తారని, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తారని ఎద్దేవా చేశారు. బీజేపీలో అద్వాణీ, మురళీ మనోహర్ జోషి వంటి నేతలను పక్కన పెట్టినా అడిగేవాళ్లు లేరన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం చెబితే.. అదానీ నిధులను తాను వెనక్కి ఇవ్వలేదని, ప్రతిపక్షాలు నిందలు వేసినందుకే ఆ పని చేశానని చెప్పారు. కుంభమేళాను తాను వ్యతిరేకించలేదని, తన కుటుంబ సభ్యులు కుంభమేళాకు వెళ్లారని చెప్పారు. అయితే, భద్రాద్రిలో పురాతనమైన రామ మందిరం ఉందని, దానికి మోదీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సహకరిస్తాం

- నెలాఖరు నుంచి బకాయిలు చెల్లిస్తాం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అత్యధిక మందికి ఉపాధినిచ్చే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎంఎస్ఎంఈ స్పార్క్2.0 పేరుతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పారిశ్రామికవృద్ధిలో భాగంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధిపై దృష్టిపెట్టామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానం తీసుకొచ్చామని, త్వరలోనే విధివిధానాలను అమల్లోకి తెస్తామని తెలిపారు. తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు నిపుణుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. నిర్వాహకుల సమస్యలను పరిష్కరిస్తామని, మార్కెటింగ్ కోసం ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని చెప్పారు. 2014 నుంచి పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెలాఖరు నుంచి విడతల వారీగా చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎవరెన్ని ప్రచారాలు చేసినా రాష్ట్రానికి పెట్టుబడులు ఆగడంలేదన్నారు.

ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయికి 50 మంది బీసీ గురుకుల విద్యార్థులు

- అభినందించిన మంత్రి పొన్నం



హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన 50 మంది బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం అభినందించారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ 50 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికవడం విశేషమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో రూ.10వేల నగదు జమవుతాయని, దీంతో వారి ఆలోచన మేరకు ప్రాజెక్టును రూపొందించుకుని ప్రదర్శనలో ఉంచాలని ఆయన పేర్కొన్నారు.


ప్రమాదానికి కారణమైన యువతికి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు

మద్యం మత్తులో యువతుల హల్‌చల్!

- కారుతో రెండు బైక్‌లను ఢీకొట్టిన వైనం
- ఉల్టా ఓ బాధితుడితో వాగ్వాదం
- డ్రంకెన్ డ్రైవ్ కింద కేసు నమోదు

హైదర్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు యువతులు మద్యం మత్తులో ఉన్నారు. పైగా కార్లో కొన్ని బీరు బాటిళ్లు పెట్టుకొని బయలుదేరారు. తాగిన మత్తులో కారు అదుపు తప్పనే తప్పింది. ఎదురుగా వెళుతున్న ఓ స్కూటీని.. అదే వేగంలో మరో బైక్‌నూ ఢీకొట్టారు. ఇలా మద్యం మత్తులో ముగ్గురు యువతులు కారుతో కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించారు. స్థానికుల వివరాల ప్రకారం.. గురువారం రాత్రి పదింటికి కూకట్‌పల్లి నుంచి జేఎన్‌టీయూ వైపు వస్తున్న కారు.. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద బీభత్సం సృష్టించింది. పైగా కారు డ్రైవింగ్ సీట్లోంచి దిగిన యువతి, ఉల్టా బాధితుడైన ఓ వాహనదారుడినే బెదిరిస్తూ వాగ్వాదానికి దిగింది. స్థానికులు గుమిగూడి కారులో చూడగా బీరు క్యాన్లు కనిపించాయి. లోపల మద్యం మత్తులో ఉన్న మరో ఇద్దరు యువతులను గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వగా వారొచ్చి కారు నడిపిన యువతికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. రీడింగ్ 212 పాయింట్లు రావడంతో కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో అంబులెన్స్ డ్రైవింగ్

- తనిఖీల్లో పట్టుబడిన డ్రైవర్

పంజాగుట్ట, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించడంలో అత్యంత కీలకమైన అంబులెన్స్‌ను మద్యం మత్తులో నడుపుతున్న ఓ డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట చౌరస్తాలో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా అంబులెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోన్న పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఓ అంబులెన్స్‌ను ఆపి తనిఖీ చేశారు. ఆ వాహన డ్రైవర్ ఎండీ హఫీజ్ ఉద్దీన్(48)కు బ్రీత్‌ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా బీఏసీ లెవెల్ 126 వచ్చింది. అతడు మద్యం మత్తులో ఉన్నట్టు తేలడంతో పోలీసులు సదరు వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్‌తోపాటు వాహన యజమానిపై కేసు నమోదు చేశారు. హఫీజ్‌ఉద్దీన్.. సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి నుంచి నీలోఫర్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో(తేజా అంబులెన్స్) ఓ చిన్నారిని చికిత్స నిమిత్తం తరలించాడు. అనంతరం పంజాగుట్ట మీదుగా కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఉన్న ఓ ఆస్పత్రికి వెళుతూ తనిఖీల్లో పట్టుబడ్డాడు.

నేడే అఖిలపక్ష భేటీ



(మొదటిపేజీ తరువాయి)

రావాలని ఆహ్వానించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో రాష్ట్రం తరఫున అన్ని పార్టీల ఎంపీలు గళమెత్తాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యంగా విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం స్టీల్ ప్లాంటు, గిరిజన వర్సిటీకి నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి' కింద రూ.1800 కోట్లు ఇవ్వాలని రాష్ట్రం అడుగుతోంది. మెట్రో రైలు రెండో దశ కింద రూ.24,269 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.14,100 కోట్లు, ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు మధ్య నిర్మించే 10 గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు, 'గోదావరి-మూసీ అనుసంధాన' ప్రాజెక్టుకు రూ.7,440 కోట్లు ఇవ్వాలని కోరుతోంది. హైదరాబాద్‌లో సమీకృత మురికినీటి మాస్టర్ ప్లాన్(సీఎస్ఎంపీ)కు, వరంగల్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ అభివృద్ధికి నిధులివ్వాలని అడుగుతోంది. ఆయా అంశాలపై తాజా ఎంపీల సమావేశంలో చర్చించి, కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు. తమ పార్టీ జాతీయ నాయకత్వంతో చర్చించిన తర్వాతే డిప్యూటీ సీఎం అధ్యక్షతన జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరు కావడంపై తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాలని డిప్యూటీ సీఎం భట్టి ఫోన్ చేశారని, ఈ విషయాన్ని తమ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. పార్టీ ఎంపీలతోనూ చర్చించాక నిర్ణయం తీసుకుంటామని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మరోవైపు.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు భట్టి ఫోన్ చేసి ఆహ్వానించగా.. ఈ విషయంలో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్ణయానికి అనుగుణంగా తాము నడుచుకుంటామని బదులిచ్చినట్లు పార్టీవర్గాలు తెలిపాయి.

ఏ కులానికి ఎలా న్యాయం చేద్దాం?

సమగ్ర కుల గణనపై నెలలో నివేదిక ఇవ్వండి

సలహా కమిటీకి డిప్యూటీ సీఎం సూచన

'సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే' ఆధారంగా ఏ కులానికి, ఏ వర్గానికి ఎలా మేలు చేస్తే బాగుంటుందో అధ్యయనం చేసి చెప్పాలని ఈ సర్వేపై ఏర్పాటైన సలహా కమిటీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నెల రోజుల్లో ఓ నివేదిక ఇవ్వాలని అడిగారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా, ప్రొ.కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా ఏర్పాటైన సలహా కమిటీ మంత్రి భట్టి విక్రమార్కతో శుక్రవారం భేటీ అయింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన సర్వే వల్ల రాష్ట్రంలో ఏ కులం, ఏ వర్గం ఏ స్థాయిలో ఉందనే అవగాహన వచ్చిందని అన్నారు. ఆయా వర్గాలకు ప్రభుత్వం మేలు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ దృష్ట్యా సలహా కమిటీ తగిన సూచనలతో నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు.

అనుమతి లేకుండా అవయవ మార్పిడి చేస్తే పదేళ్ల జైలు.. రూ.కోటి దాకా జరిమానా!

- అక్రమ అవయవ మార్పిడిపై ఉక్కుపాదం
- 2011 కేంద్ర చట్టాన్ని అమలు చేయనున్న రాష్ట్రం
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం-2011'ను రాష్ట్రంలో యథాతథంగా అనుసరించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు మంత్రిమండలి సమావేశంలో ఆమోద ముద్ర వేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి ఆమోదం తెలపనున్నారు. అనంతరం గెజిట్ విడుదల చేసి, రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేస్తారు. దీంతో అవయవాల మార్పిడిలో అక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయి. అలాగే అవయవాల లభ్యత పెరగడంతో పాటు ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. ఇప్పటి దాకా కుటుంబ సభ్యుల మధ్య మాత్రమే ఉన్న సజీవ అవయవ దాన పరిధి విస్తృతం కానుంది. అమ్మమ్మ, తాతయ్యలు సైతం తమ మనవళ్లకు అవయవదానం చేసే వెసులుబాటు కలగనుంది. రాష్ట్రంలో మానవ అవయవ మార్పిడిలో పలు అవకతవకలు జరుగుతున్నాయి. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అక్రమంగా అవయవ మార్పిడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర చట్టాన్ని అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. కేంద్రం తొలిసారి 'మానవ అవయవ మార్పిడి చట్టం-1994' తీసుకొచ్చింది. దాన్ని ఉమ్మడి రాష్ట్రంలో 'ఏపీ మానవ అవయవ మార్పిడి చట్టం-1995' పేరిట అమలు చేశారు. అనంతరం 2011లో కేంద్రం ఈ చట్టానికి సవరణలు చేసి 'మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం' తీసుకొచ్చింది. అయితే 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలోని చట్టాన్నే అమలు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కసరత్తు చేసి 2011 చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. పాత చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే 10 వేల జరిమానా, గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది.

ఫ్యూచర్ సిటీ మ్యాప్ ఇదీ!

765 చ.కి.మీ విస్తీర్ణంలో నిర్మాణం.. పరిధిలో 7 మండలాలు.. 56 గ్రామాలు

వీటితో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ.. సర్కారు నిర్ణయం



హైదరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీని 765.28 చ.కి.మీ విస్తీర్ణంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహేశ్వరం, ఆమనగల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాలు ఫ్యూచర్ సిటీ పరిధిలోకి రానున్నాయి. ఈ 7 మండలాల్లోని 56 గ్రామాలతో ఫ్యూచర్‌సిటీ డెవపల్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు కానుంది. ఆమనగల్లులో 2 గ్రామాలు, మహేశ్వరం నుంచి 2 గ్రామాలు, మంచాల నుంచి 3 గ్రామాలు, ఇబ్రహీంపట్నంలో 8 గ్రామాలు, కడ్తాల్లోని 6 గ్రామాలు, యాచారం నుంచి 17 గ్రామాలు, కందుకూరు నుంచి 18 గ్రామాలు క్యాబినెట్ ఆమోదంతో ఇకపై ఫ్యూచర్ సిటీ పరిధిలోకి రానున్నాయి. ఇక ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా ఓ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించనుంది. ఇందుకుగాను ఐఏఎస్ అధికారులు కే శశాంక, ఎస్.హరీశ్, బీ గోపి పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఎఫ్‌సీడీఏను ఏర్పాటు చేస్తూ మంత్రివర్గ సమావేశం ఇటీవలే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కాగా కాగా ఎఫ్‌డీసీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా, మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తారు. ఇక.. శాసనసభ సమావేశాలు ఈనెల 12 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ ఆమోదంతో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

నేను కాంగ్రెసోణ్ని కాదు!

అదో పార్టీనా..? నేను పక్కా బీఆర్ఎస్!!.. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వ్యాఖ్యలు



పటాన్‌చెరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. కాంగ్రెస్ కండువా కప్పుకొన్న సంగతి తెలిసిందే. ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలిచే ఎమ్మెల్యే.. తాజాగా కాంగ్రెస్ పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్ జేఏసీ నాయకులు, గ్రామస్థులు తమ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న జీహెచ్ఎంసీ డంప్‌యార్డ్‌ను ఎత్తివేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేసేందుకు ఇటీవల ఆయన క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు, ఎమ్మెల్యేకు మధ్య వాదన జరిగింది. 'మీరు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఉన్నారు కదా. ప్యారానగర్ డంప్‌యార్డ్‌ను ఎత్తివేయించండి' అని కొందరు అడగడంతో మహిపాల్‌రెడ్డి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. 'నేను కాంగ్రెస్ పార్టీకి చెందినవాడిని కాదు. అదో పార్టీనా? నేను పక్కా బీఆర్ఎస్' అంటూ అభ్యంతకమైన వ్యాఖ్యలు చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ప్యారానగర్ డంప్‌యార్డ్ ఉద్యమం జరుగుతున్నా తనకు మాట మాత్రం చెప్పకుండా కొందరు నాయకులతో కలిసి రాజకీయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా తన వద్దకు రాకుండా ఏం చేస్తున్నారని గ్రామస్థులను నిలదీశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో తాను పార్టీలను చూడనని వ్యాఖ్యానించారు. డంప్‌యార్డ్ విషయం చేయి దాటిపోయిందని, ప్రభుత్వ నిర్ణయం మారదని స్పష్టం చేశారు. కాగా, ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఆయన కాంగ్రెస్‌లో చేరడాన్ని ముందు నుంచి జీర్ణించుకోలేని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులు శుక్రవారం బీరంగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేను కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు పార్టీలో చేరిన వ్యక్తితో ఎప్పటికైనా నష్టమేనన్నారు. కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా అనరాని మాటలు అంటున్నా ఇంకా కొనసాగించడమంటే పార్టీ కార్యకర్తలు, నాయకుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ప్రకటన విడుదల చేశారు. తాను కాంగ్రెస్ పార్టీపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. ప్యారానగర్ డంప్‌యార్డ్ తొలగించే అంశంపై పార్టీలకతీతంగా చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పే సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు.

జేఎన్‌టీయూలో విద్యార్థుల ఘర్షణ

- మద్యం తాగి వెళ్లిన డిటెయిన్డ్ విద్యార్థులు
- గౌతమి, కిన్నెర హాస్టళ్ల వారిపై రాళ్ల దాడి
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు నిలయంగా ఉండాల్సిన జేఎన్‌టీయూ ఘర్షణలకు నెలవుగా మారింది. సాంకేతికత పరిఢవిల్లాల్సిన యూనివర్సిటీలో మద్యం ఏరులై పారుతోంది. తాజాగా, యూనివర్సిటీలో డిటెయిన్ అయిన విద్యార్థులు కొందరు.. మద్యం సేవించిన మరికొందరు విద్యార్థులను వెంటబెట్టుకొని జేఎన్‌టీయూలోకి చొరబడ్డారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నప్పటికీ, వారి నుంచి తప్పించుకుని గౌతమి, కిన్నెర హాస్టళ్ల వైపు వెళ్లారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను బూతులు తిడుతూ, అడ్డొచ్చిన వారిపై రాళ్లు రువ్వుతూ ఘర్షణకు దిగారు. దీంతో హాస్టల్ విద్యార్థులు పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న వారికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేయగా బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్(బీఏసీ) 150కి పైగా నమోదైనట్లు సమాచారం. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం బాధిత విద్యార్థులుఆందోళనకు దిగారు. డిటైన్డ్ విద్యార్థుల అడ్మిషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పర్యవేక్షించాల్సిన పాలకులు ఎక్కడ..?

యూనివర్సిటీలో ఉండి విద్యార్థుల ఆలనా పాలన చూడాల్సిన అధికారులు, ఆచార్యులు సాయంత్రానికి విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. వైస్ చాన్స్‌లర్, రెక్టార్, రిజిస్ట్రార్ వంటి ఉన్నత పదవుల్లో ఉన్న వారు క్యాంపస్‌లో నివసించేందుకు భవనాలున్నాయి. వారు తప్పనిసరిగా ఆయా భవనాల్లో ఉండాల్సి ఉన్నా, ఐదారేళ్లుగా వాటిని పాడుబెట్టారు. అలాగే, వివిధ విభాగాల డైరెక్టర్లు, ఆచార్యులకు క్వార్టర్స్ ఉన్నా.. వారెవరూ అందులో ఉండటం లేదు. దీంతో విద్యార్థుల ఇబ్బందులు, సమస్యలను పట్టించుకునే వారెవరూ అందుబాటులో లేకుండాపోయారు. ఈ విషయమై కొత్త వీసీ దృష్టి సారించాలని విద్యార్థి, ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

16 ఏళ్ల కింద సౌదీ వెళ్లి..
నేడు శవంలా ఇంటికి!

- మరో గల్ఫ్ కార్మికుడి జీవితం విషాదాంతం
- మోసం కేసులో ఇరికి.. ఆరోగ్యం క్షీణించి దుర్మరణం
- మృతుడిది మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): చేసిన అప్పులు తీర్చి.. కుటుంబాన్ని పోషించుకునేందుకు ఏడారి దేశం వెళ్లిన మరో తెలంగాణ ప్రవాసీ జీవితం విషాదాంతంగా ముగిసింది.. 16 ఏళ్ల క్రితం సౌదీ వెళ్లిన అతడు.. చివరికి శవంలా తిరిగొస్తున్నాడు.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడా మండలం వేపూర్ గ్రామ రామాలయం తండాకు చెందిన సబావత్ రవి నాయక్ ఉపాధి కోసం 2009లో సౌదీ అరేబియాకు వెళ్లాడు. భవన నిర్మాణ కూలీగా పనిచేస్తూ.. అప్పులు తీర్చుకుంటున్న క్రమంలో అతడిపై మోసానికి సంబంధించి ఒక కేసు నమోదైంది. దీంతో అతడి జీవితమే మారిపోయింది.. కేసుకు తోడు, ఆ తర్వాత వీసా గడువు ముగియడంతో ఏళ్లు గడిచినా దేశం తిరిగొచ్చే మార్గం లేక అక్కడే అక్రమంగా ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే అతడి ఆరోగ్యం క్షీణించసాగింది. ఇటు సౌదీకి వెళ్లే ముందు చూసిన తన 3 నెలల పాప పూజ ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఎప్పటికైనా కలవకపోతానా అని రవి ఎదురుచూస్తున్న క్రమంలోనే ఆరోగ్యం మరింత విషమించి ఆస్పత్రి పాలయ్యాడు. ఈనేపథ్యంలోనే జనవరి 26న మరణించాడు. అతడి శవాన్ని స్వదేశానికి పంపించాలని సౌదీలోని తోటి కార్మికులు ప్రయత్నించగా.. అతడిపై ఉన్న కేసు కారణంగా వీసా రద్దు కాలేదు. దీంతో వారు ఏం చేయాలో తెలియక అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలోనే మలయాళీ సామాజిక కార్యకర్తలు 2 నెలల పాటు చేసిన ప్రయత్నాలు ఫలించి వీసా రద్దయింది. రవి మృతదేహాన్ని శుక్రవారం స్వదేశానికి పంపించారు. శనివారం ఉదయం స్వస్థలానికి చేరుకోనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.